thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 33 | కరీంనగర్ ఆదివారం, 13 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సరిహద్దుల్లో పాక్ కాల్పులు

జమ్మూ : జమ్మూకశ్మీర్ పూంఛ్ జిల్లా కృష్ణ ఘాటీ సెక్టర్‌లో అర్ధరాత్రి తీవ్ర అలజడి నెలకొంది. పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత సైన్యంపైకి ఒక్కసారిగా కాల్పులు జరిపింది. వెంటనే తేరుకున్న భారత సైన్యం ప్రతిగా ఎదురు కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో పాకిస్థాన్ వైపు భారీగా ప్రాణ నష్టం జరిగిందని భారత సైనికాధికారులు వెల్లడించారు. అయితే మృతుల సంఖ్యను మాత్రం స్పష్టంగా చెప్పలేదు. వారి వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ మృతి చెందిన కొంతమంది సైనికులకు ఓ పాక్ అధికారి నివాళులర్పిస్తున్న తేదీలేని వీడియో ఫేస్ బుక్‌లో దర్శనమిచ్చింది. మరోవైపుకృష్ణ ఘాటీ సెక్టర్‌లో ఓ భారత జవాను ప్రమాదవశాత్తు ల్యాండ్‌మైన్‌పై కాలు పెట్టి గాయపడగా అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.



# విభజన సమస్యలపై దృష్టి

## మరో సారి భేటీ కానున్న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు

# పరిష్కారం లభించేనా!?

హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కానున్నట్లు తెలుస్తోంది. విభజన సమస్యల పరిష్కారం కోసం మరోసారి సమావేశం కావాలనుకుంటున్నట్లు సమాచారం. పదేళ్లు అవుతున్నా విభజన సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. రెండు రాష్ట్రాల సీఎంలు కలిసి కూర్చుని మాట్లాడుకుంటే సమసిపోయే సమస్యలు చాలానే ఉన్నాయి. అందుకే చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు త్వరలోనే సమావేశం అవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. రేవంత్ , చంద్రబాబులు సీఎంగా బాధ్యతలు చేపట్టాక విభజన సమస్యల పరిష్కారం కోసం ముందుకు వచ్చారు. గతేడాది జులైలో ప్రజా భవన్ లో భేటీ అయ్యారు. విడిపోయి పదేళ్లయినా చట్ట ప్రకారం జరగాల్సిన పంపకాలు పూర్తికాకపోవడంపై ఇరువురు ముఖ్యమంత్రులు దృష్టి సారించినట్లు అధికారులు వెల్లడించారు.

సాధ్యమైనంత తొందరగా ఈ విషయం సద్దుమణిగేలా చొరవ తీసుకోవాలనుకున్నారు. అప్పట్లో చర్చించిన విషయాల్లో స్టేటస్ ఏంటి? మిగతా విషయాల్లో పరిష్కారం కోసం మరోసారి భేటీ అయి చర్చించించాలని అప్పట్లోనే నిర్ణయించారు. పదేళ్లు కేసీఆర్ అధికారం లో ఉన్నా, విభజన సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపలేదన్న అభిప్రాయం ఉద్యోగవర్గాల్లో ఉంది. జగన్ తో సాన్నిహిత్యం ఉన్నప్పటికీ వాటిని నాన్చారు. ఇప్పుడున్న సీఎంలు వాటిని అలాగే వదిలేయవద్దని భావిస్తున్నారు. సాగునీరు విషయంలో తెలంగాణకు దక్కాల్సిన వాటా దక్కడం లేదని, తెలంగాణ నీటిని కొత్త ప్రాజెక్టుల ద్వారా ఏపీకి తరలించేలా ప్రయత్నాలు చేస్తుంటే రేవంత్ మాట్లాడటం లేదని బీఆర్ఎస్ నేతలు గొంతు చించుకుంటున్నారు.

తెలంగాణ ఎడారిగా మారి, భూములు ఎండిపోతున్నాయని, దీనికి రేవంత్ , చంద్రబాబులు కారణం అనే అభిప్రాయాన్ని కలిగించేలా శతవిధాలా ప్రయ త్నిస్తున్నారు. విద్యుత్ బకాయిలు, ఉ ద్యోగుల అంశం, ఆస్తులు..ఇలా పలు విభజన సమస్యలపై మరోసారి భేటీ అవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే కేంద్ర పరిధిలోని అంశాలపై కూడా చర్చించి ప్రధాని దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సమావేశం ఉపయోగ పడుతుందని అనుకుంటున్నారు. అయితే ఈ సారి భేటీతో అయినా సమస్యలను పరిష్కారం లభించాలని ఆశిద్దాం!



## రాష్ట్రాలకు కేంద్రం భారీ హెచ్చరిక.. దాడులు జరగొచ్చని హింట్

రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం భారీ హెచ్చరికలు జారీ చేసింది. డ్రోన్లు, IEDలతో ఉగ్రవాదులు దాడులు చేసే అవకాశం ఉందని శనివారం కేంద్రహోంశాఖ హెచ్చరికలు పంపింది.

సముద్ర తీర ప్రాంత పరిధిలోని పట్టణాలను ముఖ్యంగా కేంద్రం అలర్ట్ చేసింది. ఇక సముద్ర తీర ప్రాంతాల్లో నిఘా పెంచాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఎందుకంటే మోస్ట్ వాంటెడ్, 26/11 ముంబై పేలుళ్ల కుట్రదారు తహవ్వూర్ రాణాను ఎన్ఐఏ అరెస్టు చేసి తన కస్టడీలో ఉంచుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే దాడులు జరగొచ్చని ఇంటెలిజెన్స్ హెచ్చరికల మేరకు కేంద్ర హోంశాఖ రాష్ట్రలను అలర్ట్ చేసింది.

# తెలంగాణ ప్రజలకు శుభవార్త..

## ఇంటింటికీ ఇంటర్నెట్.. మూహూర్తం ఫిక్స్..!




హైదరాబాద్ : ప్రస్తుతం ఇంటర్నెట్ యుగం నడుస్తోంది. ప్రతి ఒక్కరూ ఇంటర్నెట్ కు అలవాటు పడిపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే యోచనలో ఉంది. రానున్న ఆరు నెలల్లో ప్రతి ఇంటికి టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు టీ ఫైబర్ ఇకపై తెలంగాణ నెక్స్ట్ జెన్ టెక్నాలజీ పేరుతో ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలు అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. బేగంపేటలోని సెంటర్ పాయింట్ భవనంలో నూతనంగా ఏర్పాటైన తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ‘టీ ఫైబర్ ప్రాజెక్టు కేవలం ఇంటర్నెట్ సేవలను అందించడానికి మాత్రమే పరిమితం కాదని.. దీని ద్వారా టెలిఫోన్, కంప్యూటర్, స్మార్ట్ టెలివిజన్ సేవలను కూడా ప్రతి ఇంటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇప్పటికే 4 గ్రామాల్లోని 4 వేల ఇళ్లల్లో ప్రతి ఒక్కరూ టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సేవలు వినియోగిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 424 మండలాల్లోని 8,891 గ్రామ పంచాయతీలకు అనుసంధానం చేశామన్నారు. వీటిలో 336 మండలాల్లోని 7,187 గ్రామాల్లో ఇంటర్నెట్ సేవలు అందుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. సుమారు 45 వేల కిలోమీటర్ల పొడవున ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా శ్రీధర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్,టీ ఫైబర్ బిజినెస్ హెడ్ శ్రీ కుమార్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.




# అంబేద్కర్ జయంతికి శ్రీకారం!

## దశల వారీగా అమలు చేయనున్న ప్రభుత్వం

### ఆరు మాడ్యుల్స్‌తో సులభంగా ఉండేలా కొత్త వెబ్‌సైట్


### చాట్‌బాట్‌తో పాటు ప్రత్యేక యాప్ ఏర్పాటుకు కసరత్తు

హైదరాబాద్ :కొత్త భూ భారతి చట్టం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14 నుంచి అమల్లోకి రానున్నది. ఈమేరకు తెలంగాణ భూ భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్) యాక్ట్, 2025 ఆవిష్కరణకు డేట్ ఫిక్స్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంచ్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భూ భారతి చట్టం ప్రొవిజన్స్‌తో కొత్త పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. శిల్ప కళావేదికగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్లను సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఆదేశించారు. కొత్త భూ భారతి చట్టం ఒకేసారి అమల్లోకి రావడం లేదు. ఫేజ్‌ల వారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. మొదటి ఫేజ్ ను ప్రారంభించేందుకు అటు రెవెన్యూ, ఇటు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ధరణిలో 33కు పైగా మాడ్యూల్స్ ఉండగా, భూ భారతిలో కేవలం 6 మాడ్యూల్స్‌తో సమస్యలను సులభంగా పరిష్కరించేలా కొ త్త వెబ్‌సైట్ రూపొందించింది. దీంతో ఎలాంటి కన్ఫ్యూజన్? లేకుండానే అప్లికేషన్లు పెట్టుకునే అవకాశం లభించనున్నది. ధరణి పోర్టల్ స్లోగా ఉండటంతో పాటు యూజర్ ఫ్రెండ్లీగా లేదు. దీంతో యూజర్ ఫ్రెండ్లీ భూ భారతిని తీసుకురావడమే కాకుండా.. వెబ్ పోర్టల్ స్పీడ్?ను పెంచారు. ఇక అప్పీళ్ల వ్యవస్థ కూడా అందుబాటులోకి రానున్నది. భూ భారతి చట్టంలో తహసీల్దార్, ఆర్‌డీఓ, కలెక్టర్ స్థాయిలో అప్పీల్ వ్యవస్థ ఉంది. ధరణిలో ఏం రిజెక్ట్ చేసినా కోర్టులపై ఆధారపడాల్సి వచ్చేది. భూ భారతిలో జిల్లా స్థాయిలోనే అప్పీల్ వ్యవస్థ పెట్టారు. దీంతో రైతులకు సమయం, ఖర్చు ఆదా కానున్నది. గతేడాది డిసెం బర్‌లో అసెంబ్లీ, కౌన్సిల్‌లో భూ భారతి బిల్లుకు ఆమోదం లభించింది. గవర్నర్ జనవరి 3వ తేదీన ఆమోదించగా.. జనవరి 20వ తేదీన ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. భూ భారతి పోర్టల్, భూ ధార్ విధానం, కొత్త పహాణీ వ్యవస్థతో రైతుల సమస్యలు పరిష్కారమై, పారదర్శక భూ రికార్డులు అందుబాటులోకి రానున్నాయి. భూ భారతి పోర్టల్‌లో ఒక చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయిం చారు. దీంతో పాటు ఒక ప్రత్యేక యాప్‌ను కూడా తీసుకురావాలని.. ఇందులో ఎం వ్యాలెట్ మాదిరి ప్రతి రైతు వారికి సంబంధించిన వివ రాలను టెంపరరీ భూధార్ నంబర్‌తో కలిగి ఉండేలా తీసుకువస్తున్నా రు. ఇక చాట్‌బాట్‌లో భూ భారతి పోర్టల్‌లో ఏదైనా డౌట్ క్లియర్ చేసుకోవాలన్నా చాట్ బాట్ ఉపయోగపడనుంది. ఏ సమస్యకు ఏ అప్లికేషన్ పెట్టుకోవాలి? ఎలాంటి డాక్యుమెంట్లు అవసరమో కూడా చెప్పనున్నది. చాట్‌బాట్ భూ భారతి చట్టం ప్రయోజనాలను, హక్కులను సరళంగా వివరిస్తూ, రైతులను చైతన్యం చేయనున్నది. చాట్‌బాట్ తో రైతులతో పాటు ప్రభుత్వానికి కూడా ఎన్నో ప్రయోజనాలు అందనున్నా యి. తహసీల్దార్, ఆర్‌డీవో కార్యాలయాల్లో సమాచారం కోసం వచ్చే రైతుల రద్దీ తగ్గుతుంది. అధికారుల వర్క్‌లోడ్ తగ్గి, వేగంగా సమస్యలు పరిష్కారం అవుతాయి. పైగా, పోర్టల్ సాంకేతిక సమస్యలను చాట్‌బాట్ గుర్తించి, అధికారులకు నివేదిస్తూ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.



# మూడు నెలల్లో తేల్చేయాల్సిందే.. సుప్రీం కోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి పరిశీలన కోసం గవర్నర్లు పంపే బిల్లులను ఉద్దేశించి దేశసర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రాలు రూపొందించే బిల్లుల నిలుపుదల విషయంలో గవర్నర్లకు, రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధమైన ప్రత్యేక అధికారాలేవీ ఉండబోవని స్పష్టం చేసింది. ఈ క్రమంలో గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఇంతకు ముందు గవర్నర్ల విషయంలోనూ ఇలాంటి గడువును నిర్దేశించిన సుప్రీం కోర్టు.. ఇప్పుడు రాష్ట్రపతి విషయంలోనూ ఈ తరహా సూచన చేయడం తెలిసిందే. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవికుమార్ తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో.. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి పరిశీలన కోసం గవర్నర్లు పంపే బిల్లులను మూడు నెలలకు మించి ఉంచకూడదని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్ నేతృత్వంలోని తాజాగా బెంచ్ స్పష్టం చేసింది. ఒకవేళ జాప్యం జరిగితే గనుక సరైన రాష్ట్రపతి భవన్ ఆ కారణాలను రాష్ట్రాలకు వివరించాల్సి ఉంటుందని తెలిపింది. ఒకవేళ నిర్ణీత సమయంలోపూ రాష్ట్రపతి నుంచి సరైన స్పందన లేకుంటే మాండమస్ రిట్ పిటిషన్ దాఖలు చేయొచ్చని రాష్ట్రాలకు సుప్రీం కోర్టు సూచించింది. అంతకు ముందు గవర్నర్ విషయంలోనూ కాల నిర్దేశాన్ని పాటించని పక్షంలో ఆయన చర్యపై కోర్టులు న్యాయసమీక్ష జరపవచ్చని వెల్లడించింది. మంత్రి మండలి సలహా సూచనల మేరకు తప్పనిసరిగా పనిచేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలేవీ లేవని, రాజ్యాంగంలోని 200వ అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేస్తోందని తెలిపింది. రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి ఉంచే అధికారం గవర్నర్‌కు లేదంది. ఇక.. తాజాగా ఆర్టికల్ 201 రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఒకవేళ బిల్లు గనుక రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే.. రాష్ట్రపతి ఆర్టికల్ 143 ప్రకారం సుప్రీం కోర్టును సంప్రదించడానికి అవకాశం ఉందని స్పష్టం చేసింది.



# హనుమాన్ శోభాయాత్రకు ముస్లిం సోదరుల స్వాగతం

హైదరాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా కొనసాగుతోంది. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో హనుమాన్ శోభాయాత్రకు ముస్లిం సోదరులు స్వాగతం పలికి మతసామరస్యాన్ని చాటారు.

హైదరాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా కొనసాగుతోంది. గౌలిగూడ నుంచి సికింద్రాబాద్ తాడ్‌బండ్ వరకు కొనసాగనున్న ఈ యాత్రలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో హనుమాన్ శోభాయాత్రకు ముస్లిం సోదరులు స్వాగతం పలికి మతసామరస్యాన్ని చాటారు. ఈ నేపథ్యంలో 17 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# పద్మశ్రీ వనజీవి రామయ్య కన్నుమూత



కూసుమంచి (ఖమ్మం): పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య (85) కన్నుమూశారు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మొక్కల ప్రేమికుడు రామయ్య.. ఇంటిపేరునే వనజీవిగా మార్చుకున్నారు. జీవితమంతా మొక్కలు నాటి పెంచారు. వనజీవి రామయ్య స్వగ్రామం ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి. కోటిగాపైగా మొక్కలు నాటి ఆయన సరికొత్త చరిత్ర సృష్టించారు. 2017లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

**తీవ్ర విచారానికి లోనయ్యా: ఏపీ సీఎం చంద్రబాబు :** వనజీవి రామయ్య మృతి వార్త తెలిసి తీవ్ర విచారానికి లోనైనట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. పచ్చదనం ప్రాధాన్యత చెప్పిన రామయ్య నేటితరానికి ఆదర్శమని చెప్పారు. ఆయన మరణం పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

**రామయ్యే నిజమైన పర్యావరణ యోధుడు: నారా లోకేశ్...** వనజీవి రామయ్య మరణం బాధాకరమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే సందేశమే ఆయన జీవిత సారాంశమని పేర్కొన్నారు. చెట్ల ఆవశ్యకత చెప్పిన రామయ్యే నిజమైన పర్యావరణ యోధుడని పేర్కొన్నారు. వనజీవి రామయ్య చూపిన మార్గం భావితరాలకు ప్రేరణ అని వివరించారు.

**రామయ్య మార్గం నేటి యువతకు ఆదర్శం: సీఎం రేవంత్...** పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రకృతి లేనిదే మనుగడ లేదని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన అని చెప్పారు. వ్యక్తిగా మొక్కలు నాటి సమాజాన్నే ప్రభావితం చేసిన వ్యక్తి రామయ్య అన్నారు. ఆయన మరణం సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. రామయ్య సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శమన్నారు.

**తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణవేత్తను కోల్పోయింది: కేసీఆర్...** వనజీవి రామయ్య మరణం పట్ల భారాస అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. పచ్చదనం పరిరక్షణ కోసం వనజీవి చేసిన కృషిని స్మరించారు. ఆయన మరణంతో తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణవేత్తను కోల్పోయిందన్నారు. పర్యావరణం కోసం ఆయన చేసిన త్యాగం అసమాన్యమైనదని వివరించారు. హరితహారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన అందించిన సహకారం గొప్పదన్నారు. రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.





# మీనాక్షికి బిగ్ షాక్ ఇచ్చిన సీనియర్లు.. హైకమాండ్ కు కంప్లైంట్!

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్కు సీనియర్ నేతలు బిగ్షాక్ ఇచ్చారు. ఆమెను తొలగించాలంటూ ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ఆమె వ్యవహారశైలితో పార్టీకి నష్టం జరుగుతుందంటూ హైకమాండ్ కు మొరపెట్టుకున్నారు. ముఖ్యంగా %ఎజఖ% అంశంపై మీనాక్షి వ్యవహరించిన తీరు పార్టీ, ప్రభుత్వానికి ఇబ్బందిగా మరిందంటూ కంప్లైంట్ చేశారు.

దీంతో ఇప్పుడు మీనాక్షి నటరాజన్ ను ఇన్ఛార్జిగా కొనసాగిస్తారా? లేక తప్పిస్తారా? అన్న అంశం తెలంగాణ పాలిటిక్స్ లో ఆసక్తికరంగా మారింది. HCU భూముల విషయంలో మీనాక్షి నటరాజన్ ఏకంగా సెక్రటేరియట్లోని భట్టి విక్రమార్క ఛాంబర్ లో సమీక్ష నిర్వహించిన అంశంపై విమర్శలు వచ్చాయి. అనంతరం యూనివర్సిటీకి వెళ్లి స్టూడెంట్స్ తో భేట కావడం ప్రతిపక్షాలకు అస్త్రంగా మారింది.

**అందుకే సీనియర్లకు కోపం?...** పార్టీలో అందరూ ఒకటే అనే సిద్ధాంతంతో మీనాక్షి పని చేస్తున్నారు. ఇది సీనియర్లకు మింగుడు పడడం లేదని తెలుస్తోంది. తమ సిఫారసులను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు గాంధీభవన్ లో చర్చ సాగుతోంది. రాహుల్ గాంధీటీమ్ లో మీనాక్షి కీలకంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర బాధ్యతలు అప్పగించారన్న ప్రచారం ఉంది. ఇక్కడ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని.. ఈ క్రమంలో పార్టీని బలోపేతం చేయడం, నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయడం అన్న లక్ష్యంగా మీనాక్సి నటరాజన్ ను తెలంగాణ ఇన్ఛార్జిగా నియమించింది హైకామాండ్. అయితే.. ప్రస్తుతం సీనియర్లు ఆగ్రహంగా ఉన్న ఈ తరుణంలో ఆమెను కొనసాగిస్తారా? లేక పక్కకు పెడతారా? అన్న అంశంపై తెలంగాణ పాలిటిక్స్ లో ఉత్కంఠగా మారింది.

# ప్రైవేటుపరం కాబోతున్న 400 ఎకరాల భూమిని కాపాడాం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: ప్రైవేటుపరం కాబోతున్న 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడిందని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంగా చెప్పినప్పటికీ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఏఐ వీడియోలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. “సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వీడియోలు వైరల్ చేసి దుష్ప్రచారం చేశారు. హెచ్‌సీయూ భూములు, పరిసరాల్లో ఏనుగులు ఉన్నాయా? విద్యార్థులను ప్రభావితం చేసి ప్రభుత్వ పనులను అడ్డుకోవాలని చూస్తున్నారు. హైదరాబాద్‌కు పెట్టుబడులు, ఉద్యోగాలు రావొద్దని కుట్ర చేస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగానే బాండ్ల జారీ ప్రక్రియ ఉంటుంది. ఐసీఐసీఐ నుంచి మేం ఎలాంటి లోన్లు తీసుకోలేదు. కంచ గచ్చిబౌలి భూములపై ఎలాంటి వివాదాలు లేవు. రాష్ట్ర ప్రజల సంక్షేమ కార్యక్రమాల కోసమే నిధులు సేకరిస్తున్నాం” అని శ్రీధర్‌బాబు తెలిపారు.


**సీఎం పదవిపై కీలక వ్యాఖ్యలు...** సీఎం పదవిపై మంత్రి శ్రీధర్‌బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని, ఆయనే ఉండి తీరుతారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం చేస్తూ రేవంత్ అవినీతిరహిత పాలన చేస్తున్నారని కితాబిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమర్థులేనని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్షనిర్వహించారంటూ వచ్చిన వార్తలను శ్రీధర్‌బాబు తోసిపుచ్చారు. ఆమె ఎలాంటి సమీక్ష నిర్వహించలేదన్నారు. “ మమ్మల్ని కలవడానికే మీనాక్షి నటరాజన్ సచివాలయానికి వచ్చారు. అక్కడికి ఎవరైనా రావొచ్చు. భాజపా, భారాస నాయకులు కూడా సచివాలయానికి వస్తారు” అని శ్రీధర్‌బాబు అన్నారు.

# బెంగాల్‌లో మళ్లీ చెలరేగిన హింస.. 110 మంది అరెస్ట్

వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో శుక్రవారం నుంచి నిరసనలు కొనసాగుతున్నాయి. శనివారం మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగి.. రోడ్లను దిగ్బంధించారు. వారిని ఆపడానికి ప్రయత్నించిన భద్రతా సిబ్బందిపై వారు రాళ్లతో దాడులు చేయగా హింసాత్మక పరిస్థితి నెలకొంది. దీంతో 110 మందికి పైగా నిరసనకారులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి ఉద్రిక్తంగానే ఉందన్నారు. హింసాత్మక చర్యలు నెలకొంటున్న నేపథ్యంలో ముర్షిదాబాద్ జిల్లాలో పలు నిషేధాజ్ఞలు విధించామని.. ఇంటర్నెట్ సేవలు నిలిపివేశామని అధికారులు తెలిపారు. శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్న వదంతులను పట్టించుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘర్షణ సమయంలో ఆందోళనకారులపై జరిపిన కాల్పుల్లో గాయపడిన 10మంది పోలీసులు.. ఓ యువకుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. వక్ఫ్ చట్టం మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది.

ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలుచేయబోమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇటీవల ప్రకటించారు. మైనారిటీలు, వారి ఆస్తులను రక్షిస్తానని హామీ ఇచ్చారు. ఒకప్పుడు బంగ్లాదేశ్, పాకిస్థాన్, భారతదేశం కలిసి ఉండేవని.. తర్వాతే విభజన జరిగిందని గుర్తుచేశారు. ఇక్కడే ఉండిపోయిన మైనారిటీలకు రక్షణ కల్పించడం మన బాధ్యత అని.. తాను ఉన్నంతకాలం వారిని, వారి ఆస్తులను రక్షిస్తానని అన్నారు.

# వనజీవి రామయ్య మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి




దిల్లీ: పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య (85) మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా రామయ్య గుర్తుండిపోతారని అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలుగులో పోస్టు చేశారు. “ లక్షలాది మొక్కలు నాటడానికి, వాటిని రక్షించడానికి రామయ్య తన జీవితాన్ని అంకితమిచ్చారు. ఆయన అవిశ్రాంత కృషి.. ప్రకృతి పట్ల గాఢమైన ప్రేమనూ, భవిష్యత్ తరాలపట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయి. ఆయన చేసిన కృషి.. యువతలో మరింత సుస్థిరమైన హరిత గ్రహాన్ని నిర్మించాలనే తపనను ప్రేరేపిస్తూనే ఉంటుంది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి” అంటూ రాసుకొచ్చారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరింపులు



హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో విజయశాంతి భర్త శ్రీనివాస ప్రసాద్ ఫిర్యాదు చేశారు. 4 ఏళ్ల క్రితం చంద్రకిరణ్‌రెడ్డి తమను సంప్రదించి, సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేటర్‌గా తనను తాను పరిచయం చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విజయశాంతి వద్ద సోషల్‌మీడియా హ్యాండ్లర్‌గా అవకాశం ఇవ్వాలని కోరినట్లు వివరించారు. “చంద్రకిరణ్‌రెడ్డి మాతో కలిసి పనిచేస్తూ తన సొంత వ్యా పారాన్ని బలపరుచుకున్నారు. స్వలాభం కోసం మా పేరును వాడుకున్నారు. అతని పనితీరు నచ్చకపోవడంతో చంద్రకిరణ్ సేవలను వినియోగించుకోలేదు. మేం భాజపాలో ఉన్నప్పుడు అతడితో పరిచయం ఏర్పడింది. ఆ పార్టీలో ఎదిగేందుకు చంద్రకిరణ్ మమ్మల్ని వాడుకున్నారు. భాజపాలో నుంచి బయటకు వచ్చాక అతడి నుంచి మెసేజ్ వచ్చింది. పెండింగ్‌లో ఉన్న నగదు చెల్లింపులు చేయగలరా అని అందులో ఉంది. ఈక్రమంలో మావద్ద బకాయిలు ఏమీ లేవని సమాధానమిచ్చాం. అయితే ఏప్రిల్ 6న చంద్రకిరణ్‌రెడ్డి బెదిరింపు సందేశం పంపాడు. బకాయిలు తీర్చకుంటే మీరు శత్రువులు అవుతారని మెసేజ్ చేశాడు. ఆమోదయోగ్యం కాని రీతిలో సందేశాలు ఉన్నాయి. చంద్రకిరణ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి” అని శ్రీనివాస ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు వివిధ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు.

# కొండగట్టు అంజన్న ఆలయంలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు





మాల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్టుకు అభిషేకం, సుప్రభాత సేవ నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. దీక్షలు, మాలధారణతో కాలినడకన అంజన్న సన్నిధికి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకున్నారు.

# కేటీఆర్ మాటల్లో వాస్తవం లేదు: చామల కిరణ్‌కుమార్




హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన ఆరోపణలను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఖండించారు. కేటీఆర్ నోటికొచ్చినట్లుగా మాట్లాడి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. టీజీఐఐసీకి ఐసీఐసీఐ బ్యాంకు రుణం ఇచ్చినట్లు కేటీఆర్ చెప్పడంలో వాస్తవం లేదన్నారు. టీజీఐఐసీ ఫేస్ వాల్యూ చూసి 27 కంపెనీలు బాండ్లు కొనుగోలు చేశాయని, తద్వారా వచ్చిన డబ్బులే ఐసీఐసీఐ బ్యాంక్ ద్వారా టీజీఐఐసీలో పడ్డాయని వివరించారు. ఐసీఐసీఐ బ్యాంకు రుణంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో.. కంచ గచ్చిబౌలి భూములు.. హెచ్‌సీయూ, అటవీ శాఖవి కాదని తేలిపోయిందని కిరణ్‌కుమార్ అన్నారు. పేద ప్రజలు సన్న బియ్యం అన్నం తింటుంటే.. భారాస నాయకులు ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు.

చురకలు



# ఏప్రిల్ 13...జలియన్ వాలా బాగ్ సంస్మరణ దినం




1919, ఏప్రిల్ 13... భారత దేశ చరిత్రలో దుర్దినం. బ్రిటిష్ పాలకుల దమన కాండకు పరాకాష్టగా చరిత్ర సాక్ష్యంగా నిలిచిన చీకటి దినం. భారత స్వాతంత్ర సంగ్రామ చరిత్రలో అత్యంత దురదృష్టమైన, హేయమైన సంఘటన జలియన్ వాలాబాగ్ ఉదంతం. నాటి బ్రిటిష్ పాలకుల కిరారక్ చర్యలు వంద లాది మంది అమాయకులు ప్రాణా లు కోల్పోయిన నేపద్యం. శతాబ్ద కాలం గడిచినా చెరగని నెత్తుటి మరకల జ్ఞాపకం. పంజాబ్, బెంగాల్ లో నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం, భారత ప్రజల్లో నానాటికీ రగులు తున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్ లో), మొదలైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తి యైన సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుస రించి బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం ద్వారా తిరుగుబాట్లను అణిచి వేయడానికి వైస్రాయ్ లకు విశేష అధికారాలను కట్టబెట్టారు. ప్రెస్ నోళ్ళను కట్టేయడానికీ, విచారణ లేకుండా రాజకీయ నాయకులను నిర్బంధించడం, తిరుగుబాటు దారులుగా అనుమానితులైన వ్యక్తులను వారంటు లేకుండా అరెస్టు చేయడం మొదలైన నిరంకుశ మైన అధికారాలు ఇందులో ఉన్నాయి. ఈ చట్టం పై దేశంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టమైన సంఘటన. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ లోగల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోట లో దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశమైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశమవడానికి ముఖ్య కారణం, ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూ లను అక్రమంగా నిర్బంధించ డాన్ని, వారికి ప్రాంత బహిష్కరణ శిక్ష విధించడానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సార్వజనీన సమావేశం. వివిధ విభాగాలకు చెందిన 90 మంది సైనికులు (ఇండియన్ ఆర్మీ), వారితో బాటు రెండు ఆయుధా లతో కూడిన సురక్షిత వాహనాలు అక్కడికి వచ్చాయి. ఇరుకైన సందుల కారణంగా వాహనాలు బాగ్ లోపలికి రాలేక పోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాలతోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలావాటికి తాళాలు వేసి ఉన్నాయి. ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైనికులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశ మైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులు పది నిమిషాలపాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహనాలు బాగ్ లోపలికి రాలేక పోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాలతోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలావాటికి తాళాలు వేసిఉన్నాయి. కాల్పుల కారణంగా వందలమంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మంది బాలురు, 6 వారాల పసికందు) మరణించారు. కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000 కి పైగా మరణిం చారు. 2000 మందికి పైగా గాయ పడ్డారు. అక్కడ స్మారక చిహ్నం పైన వ్రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను బయటకు తీశారు. నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. పంజాబ్ అమృత్ సర్ లోని 1919 ఏప్రిల్ 13 న జలియన్ వాలా భాగ్ లో శాంతియుతంగా వేల మంది సామన్య పౌరులు సమావేశం అయి ఉండగా పోలీసులతో చుట్టుముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేల మంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్. నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడినవారని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. తన ఆఫీసులో బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ డయ్యర్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం అతనికి తిరుగుబాటు విప్లవకారుల సేన ఎదురైనందున కాల్పులు జరుపవలసి వచ్చింది. డయ్యర్‌కు పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్ మైకేల్ ఓడ్వయర్ ఇచ్చిన టెలిగ్రాములో "నీ చర్య సరైనదే. దానిని లెఫ్టినెంట్ గవర్నర్ సమర్థిస్తున్నాడు" అని వ్రాసి ఉంది. ఈ ఉదంతంపై విచారణ జరప డానికి 1919లో "హంటర్ కమిషన్" ఏర్పరచారు. ఆ కమిషన్ సమక్షంలో డయ్యర్ – తనకు ఆ మీటింగ్ గురించి 12:40కి తెలిసిందనీ, దానిని నిలపడానికి తానేవిధమైన ప్రయత్నమూ చేయలేదనీ, అక్కడ సమావేశమైన గుంపు గనుక కనిపిస్తే కాల్పులు జరపాలనే ఉద్దేశంతోనే తాను అక్కడికి వెళ్ళాననీ – చెప్పాడు. "బహుశా కాల్పులు జరుపకుండా గుంపును చెదరగొట్టడం సాధ్యం అయ్యుండవచ్చునని నేను భావిస్తున్నాను. కాని వాళ్ళంతా మళ్ళీ తిరిగివచ్చి నన్ను అవహేళన చేసేవారు. నేను చేతగాని వాడిన య్యుండేవాడిని." ఎహంటర్ కమిషన్ సమక్షంలో డయ్యర్ పేర్కొన్నాడు. అంతే గాకుండా ఆ స్థలంలోనికి వాహనాలు వెళ్ళగలిగితే తాను మెషిన్ గన్లతో కాల్పులు జరిపించి ఉండేవాడినని, కాని ఇరుకైన సందులలోకి సాయుధ వాహనాలు వెళ్ళడం కుదరలేదని చెప్పాడు. జనం చెల్లా చెదురైనా గాని కాల్పులు ఆపలేదని, కొద్దిపాటి కాల్పులవల్ల ప్రయోజనం లేదని, జనం అంతా వెళ్ళిపోయేదాకా కాల్పులు జరపడం తన బాధ్యత అని చెప్పాడు. గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించడం తన బాధ్యత కాదు గనుక అలాంటి ప్రయత్నమేమీ చేయలేదని, ఆసుపత్రులు తెరచి ఉన్నందున వారే వెళ్ళవచ్చునని కూడా అన్నాడు. భారతదేశంలో దీనికి ప్రతిగా తీవ్రమైన ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. పంజాబ్ లో జరుగు తున్న స్వాతంత్ర్యోద్యమానికి మరింత ఆజ్యం పోసింది. 1920 లో గాంధీజీ ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా సహాయ నిరాకరణో ద్యమం ప్రారంభించడానికి నాంది పలికింది. భగత్ సింగ్ విప్లవ కారుడిగా మారడానికి కూడా ఈ సంఘటనే కారణం. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్, బ్రిటీష్ ప్రభుత్వం తనకిచ్చిన సర్ బిరుదును ఇంగ్లండు ప్రభువుకు తిరిగి ఇచ్చివేశాడు. మొత్తమ్మీద ఈ సంఘటన స్వాతంత్ర్యోద్యమానికి మరింత స్ఫూర్తినిచ్చి వేగవంతం చేసింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నాటక సినీ ఆధ్యాత్మిక రంగాలలో మమేకమైన ధూళిపాళ

## – ఏప్రిల్ 13... ధూళిపాళ సీతారామ శాస్త్రి వర్ధంతి

తెలుగు నాటక, సినిమా రంగాల్లో అసమాన ప్రతిభను చూపించిన ధూళిపాళ సీతారామ శాస్త్రి జీవితం, నిజమైన కళాకారునికి ఆదర్శం కావలసిన గ్రంథం వంటిది. ఒకప్పుటి రంగస్థలంపై నటనా నాట్యములతో జయధ్వజం ఎగరేసిన ఈ మహనీయుడు, చివరికి జీవితం అనే నట కూటాన్ని వదిలిపెట్టి ఆధ్యాత్మిక మార్గంలోకి అడుగుపెట్టి మానవ సేవకు పరమ ధ్యేయంగా నిలిచారు.



**బాల్యం నుంచే నటనపై ఆసక్తి ....** ధూళిపాళ సీతారామ శాస్త్రి జననం 24–9–1921న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా లో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జరిగింది. చిన్ననాటి నుంచే ఆయనకు నాటకాలపై ఆసక్తి ఉండేది.

ధూళిపాళ నటనలోని బలమైన వాచకశైలి, హావభావాలు, పాత్ర లోపలికి చొచ్చుకుపోయే తీరు ఆయన్ను ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయి. ప్రత్యేకించి శకుని పాత్రలో ఆయన ఇచ్చిన జీవం, ప్రేక్షకుల కళ్ళముందు ఆ పాత్రను సజీవంగా మార్చింది. ఎన్.టి.రామారావుతో కలిసి ఎన్నో పౌరాణిక చిత్రాల్లో నటించిన ఆయన నటనకు విమర్శకులు సైతం తలవంచక తప్పలేదు.

**నాటక రంగం నుండి సినిమా వరకు**... ఆయన నాటకాలలో నటించడమే కాకుండా వాటిని రాయడం, దర్శకత్వం వహించడం వంటి విభాగాల్లోనూ చురుకుగా పాల్గొన్నారు. హరికథ, పురాణ కథలు, నాటక రచనలు వంటి అనేక కళారూపాలలో ఆయన సవాళ్లను స్వీకరించారు. నాటక రంగంలో ఆయనకు మంచి పేరు ఉండటంతో, ఆయనను సినిమా రంగంలోకి ఆహ్వానించారు.

**సినీ జీవితం...** ధూళిపాళ సినిమాలలో ఎక్కువగా విలన్ పాత్రలు మరియు పౌరాణిక పాత్రలు పోషించారు. ముఖ్యంగా ఆయన నటించిన 'కార్తవీర్యార్జునుడు', 'భీష్ముడు', 'శకుని', 'జరాసంధుడు', 'నికుంభుడు' వంటి పాత్రలు ఇప్పటికీ ప్రేక్షకుల మనసుల్లో నిలిచి పోయాయి. ఆయన స్వరంలో ఉన్న గంభీరత, సంభాషణల ఉచ్ఛారణలో కనిపించే ఆత్మవిశ్వాసం ఆయన్ను ప్రత్యేకతతో నిలబెట్టాయి.

**ఆధ్యాత్మిక మార్గం వైపు మలుపు...** కళామతల్లికి మూడు దశాబ్దాలపాటు సేవలందించిన అనంతరం ఆయన కళారంగం నుంచి స్వచ్ఛందంగా తప్పుకుని "శ్రీ మారుతి సేవేంద్ర సరస్వతి"గా మారడం, జీవితం మీద ఆయన దృష్టిని తెలియ జేస్తుంది. 2001 మే 7న ఆయన కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ద్వారా సన్యాస దీక్షను స్వీకరించి శ్రీ మారుతి సేవేంద్ర సరస్వతిగా మారారు. ధనమూ, ఖ్యాతీ త్యజించి సేవా మార్గాన్ని ఎంచుకున్న ఆయన, నిజమైన తపస్విగా మారారు.

ధూళిపాళ సీతారామ శాస్త్రి ఏప్రిల్ 13, 2007లో మరణించారు. కానీ ఆయన అందించిన కళారూపాలు, నటనలో ఉన్న నాటకీయత తెలుగు సినిమా మరియు నాటక రంగాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి.

**పాఠం నేర్పిన పాత్ర...** ధూళిపాళ జీవితం మనందరికీ ఒక గొప్ప పాఠం. నటుడిగా, సన్యాసిగా %–% రెండు రంగాల్లో ఆయన చూపిన నిబద్ధత, సమర్పణ అసాధారణమైనవి. ఆత్మగౌరవం నుంచి ఆధ్యాత్మిక సాధన వరకూ ఆయన గమనం స్ఫూర్తిదాయకం.

**ముగింపు కాదు – సందేశం...** ధూళిపాళ జీవితం అంటే ఒక నటుడు నాటకాన్ని మాత్రమే కాదు, జీవితాన్నే ఒక కళగా మార్చగలడనే విషయం మనకు తెలుస్తుంది. ఆయన నాటకాలూ, ఆధ్యాత్మిక సేవలూ ఒకే రకంగా ప్రజల హృదయాలను తాకాయి. ఆయనను తలచుకోవడం అంటే ఒక యుగాన్ని స్మరించడమే. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# దాంపత్యంలో దారుణాలు...

## ఇన్‌స్టాగ్రామ్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన భర్తలు!



ఉత్తరప్రదేశ్‌లో రెండు వేర్వేరు ఘటనలు పెళ్లి బంధం ఎంత బలహీనంగా మారుతుందో, భార్యాభర్తల మధ్య నమ్మకం ఎంతలా సన్నగిల్లుతుందో చూపిస్తున్నాయి.

బరేలీలో భార్య వేధింపులు తాళలేక భర్త ప్రాణాలు తీసుకుంటే, ఝాన్సీలో భార్య వివాహేతర సంబంధం గురించి తెలిసిన భర్త తనకు ప్రాణహాని ఉందని పోలీసులను ఆశ్రయించాడు. ఈ రెండు సంఘటనలు సమాజంలో వివాహ వ్యవస్థ ఎటువైపు పోతుందో అద్దం పడుతుంది.

**బరేలీలో భర్త ఆత్మహత్య...** బరేలీకి చెందిన రాజ్ ఆర్య అనే యువకుడు తన భార్య సిమ్రాన్, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఏప్రిల్ 2024లో ప్రేమ వివాహం చేసుకున్న ఈ జంటకు 45 రోజుల క్రితమే పాప పుట్టింది. అయితే, కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో సిమ్రాన్ తన పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం సిమ్రాన్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో తన భర్తపై పోలీసు ఫిర్యాదు చేసినట్లు రాసింది. "ఉదయం 10:30 గంటలకల్లా అతను జైలులో ఉంటాడు" అని, ఆ తర్వాత "ఇప్పుడు జైలుకు వెళ్ళు" అని పోస్టులు చేసింది. అదే రోజు సాయంత్రం రాజ్ ఆర్య తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుమారుడితో మాట్లాడినప్పుడు "అమ్మా, నేను శాశ్వతంగా నిద్రపోతున్నాను" అని చెప్పాడని రాజ్ తల్లి పోలీసులకు తెలిపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

**ఝాన్సీలో భర్త ప్రాణభయం...** ఝాన్సీ జిల్లాలోని మౌరాణిపూర్‌కు చెందిన పవన్ అనే వ్యక్తి తన భార్య రీతూ వర్మ, ఆమె ప్రియుడు అభిషేక్ పాఠక్‌ను తన ఇంట్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. ప్రభుత్వ బాలికల కళాశాలలో క్లర్క్‌గా పనిచేస్తున్న రీతూ వర్మ, స్థానిక కౌన్సిలర్ అభిషేక్ పాఠక్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలిసినప్పటి నుంచి పవన్ వేరుగా ఉంటున్నాడు. పవన్ మహోబా జిల్లాలో ఆరోగ్య శాఖలో పనిచేస్తున్నాడు. తన భార్య ప్రియుడు ఇంట్లో ఉన్నాడని తెలుసుకున్న పవన్ పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడికి వెళ్లాడు. తలుపు తెరిచినప్పుడు కౌన్సిలర్ అభిషేక్ పాఠక్ బయటకు వచ్చి స్థానికులను, పోలీసులను బెదిరించడం ప్రారంభించాడు. "నా భార్య నన్ను, నా కొడుకుని చంపేస్తుంది. విషం టీ ఇస్తుంది. మా శరీరాలు డ్రమ్ములో కనిపిస్తాయి" అని పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కూడా పవన్ చిత్రీకరించాడు. అక్టోబర్ 2024లో తన భార్య ఎవరో ఒకరితో చాటింగ్ చేయడం చూశానని, ఆ తర్వాత ఆమెను మానుకోవాలని చెప్పానని పవన్ తెలిపాడు. "నా శరీరం నా ఇష్టం, నేను ఏమి చేసినా చేస్తాను, నన్ను ఆపడానికి నువ్వెవరు?" అని ఆమె బదులిచ్చిందని పవన్ చెప్పాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తైవాన్‌లో చైనా మహిళల ఆందోళన..

## భర్తలకు విడాకులు ఇవ్వనున్న 12,000 మంది

తైవాన్‌లో ఉంటున్న వేలాది మంది చైనా మహిళల జీవితాలు ప్రస్తుతం ఒత్తిడిలో ఉన్నాయి. ఒక చట్టపరమైన నియమం వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. మూడు నెలల్లోగా అవసరమైన పత్రాలను సమర్పించకపోతే, వారు తైవాన్‌లోని తమ చట్టబద్ధమైన నివాసాన్ని కోల్పోవలసి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఈ పరిస్థితి భర్త నుండి విడిపోయే వరకు దారితీయవచ్చు. దాదాపు 12,000 మంది చైనా సంతతికి చెందిన మహిళలు తమ కుటుంబం, గుర్తింపును కాపాడుకోవడానికి పోరాడుతున్నారు. తైవాన్‌లో నివసిస్తున్న, ఇప్పటివరకు తమ చైనా పౌరసత్వానికి సంబంధించిన 'గృహ నమోదు'ను ధృవీకరించని.. చైనా పౌరసత్వం కలిగిన భార్యలు మూడు నెలల్లోగా దాని ధృవీకరించబడిన కాపీని సమర్పించాలని తైవాన్ నేషనల్ ఇమ్మిగ్రేషన్ ఏజెన్సీ ఆదేశాలు జారీ చేసింది. అలా చేయడంలో విఫలమైతే, వారి తైవాన్ పౌరసత్వం రద్దు చేయబడుతుంది. ఈ నియమం 2004లో అమల్లోకి వచ్చింది. అయితే చాలా మంది మహిళలు తాము సంవత్సరాలుగా తైవాన్‌లో తమ భర్తలు, పిల్లలతో శాశ్వత జీవితాన్ని గడుపుతున్నందున ఈ దిశలో తాము ఎప్పుడూ తీవ్రంగా ఆలోచించలేదని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం హఠాత్తుగా



పత్రాలను కోరడం, గడువును నిర్ణయించడం వల్ల వారు భయం, అయోమయంలో ఉన్నారు. ఈ సమస్య తీవ్రతను 'ది స్ట్రెయిట్స్ ఎక్స్ఛేంజ్ ఫౌండేషన్' ప్రస్తుతం వేలాది కాల్స్, సందర్శనలను ఎదుర్కోవడమే నిదర్శనం. చాలా మంది మహిళలు ఫోన్‌లో సంప్రదించలేక నేరుగా సేవా కేంద్రానికి చేరుకున్నారు. దీని తరువాత ఫౌండేషన్ అదనపు సిబ్బందిని నియమించాల్సి వచ్చింది. వెబ్‌సైట్‌లో వివరణాత్మక ప్రక్రియను పంచుకోవలసి వచ్చింది. ఈ మహిళలకు అతిపెద్ద ఆందోళన ఏమిటంటే, వారు తైవాన్ ప్రభుత్వానికి అందించాల్సిన పత్రాలు చైనాలో తయారు చేయబడి ధృవీకరించబడాలి. ఈ ప్రక్రియ సుదీర్ఘమైనది. సంక్లిష్టమైనది మాత్రమే కాదు, రాజకీయ చిక్కుల కారణంగా ఆలస్యం అయ్యే అవకాశం కూడా ఉంది. ఈ మూడు నెలల గడువు చాలా తక్కువ అని, ప్రక్రియను పూర్తి చేయలేకపోతే తమ భర్తలు, కుటుంబాల నుండి విడిపోవలసి వస్తుందని చాలా మంది మహిళలు చెప్పారు. ప్రభుత్వం చర్యపై ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. చాలా సామాజిక సంస్థలు, మానవ హక్కుల కార్యకర్తలు దీనిని మహిళల హక్కుల ఉల్లంఘనగా అభివర్ణించారు. చాలా కాలంగా తైవాన్‌లో నివసిస్తున్న, కుటుంబాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న మహిళలను హఠాత్తుగా ఇలాంటి చట్టపరమైన చిక్కుల్లోకి నెట్టడం అన్యాయం మాత్రమే కాకుండా మానవతా దృక్పథం నుండి కూడా తప్పు అని వారు అంటున్నారు. మొత్తంమీద, తైవాన్‌లో నివసిస్తున్న ఈ 12,000 మంది చైనా భార్యలు ప్రస్తుతం తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారు. వారు తమ పౌరసత్వం గురించి మాత్రమే కాకుండా వారి కుటుంబం, పిల్లలు, జీవిత స్థిరత్వం గురించి కూడా ఆందోళన చెందుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఈ విషయంలో కాస్త ఉంటుందా లేదా అనేది వేలాది మంది మహిళల భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# సౌదీ ఎడారిలో 'బంగారు' మొక్క..

## తులసిని మించిన ఔషధ గుణాలు!

భారతదేశంలో ఇంటి పెరట్లో మొక్కలు నాటేటప్పుడు తులసి మొక్కకు ఖచ్చితంగా నాటుతాం. కానీ సౌదీ అరేబియాలో పెరుగుతున్న ఒక మొక్క ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ మొక్క సౌదీ ఎడారి నేలను కూడా బంగారంగా మారుస్తోంది. అది కూడా తీవ్రమైన వేడిలో, మధ్యాహ్నం వేళలో బతికి ఆశ్చర్యపరుస్తోంది. ఈ మొక్క మూలం యూరప్, ఆఫ్రికాలో ఉండటం గమనార్హం.

**వేడి ఎడారిలో దీని ఉత్పత్తి...** సౌదీ అరేబియాలోని ఉత్తర సరిహద్దు ప్రాంతాలలో కనిపించే రెసిడా లూటియా, దీనిని తెల్ల మిగ్నోనెట్ లేదా నిటారుగా ఉండే మిగ్నోనెట్ అని కూడా పిలుస్తారు, ఇది ఒక సుగంధ మూలిక. ఈ మొక్క జూలై నుండి సెప్టెంబర్ వరకు పెరుగుతుంది. గరిష్టంగా 60 సెంటీమీటర్ల వరకు పెరుగుతుంది. ఆకుపచ్చ రంగులో ఉండే ఈ మొక్క ఆరు రేకులు కలిగి ఉంటుంది. దీని చిన్న తెల్లని పువ్వులు తేనెటీగలు మరియు ఇతర పుప్పొడి కీటకాలను ఆకర్షించే సువాసనను వెదజల్లుతాయి. ఇది జీవవైవిధ్యాన్ని ప్రోత్సహిస్తుంది. నేల కోతను కూడా తగ్గిస్తుంది. ఈ మొక్క ఇసుక, బంకమట్టి నేలల్లో బాగా పెరుగుతుంది. దీని లోతైన మూలాలు నేలను బంధించి భూమిని సారవంతం చేస్తాయి. దీని కరువును తట్టుకునే సామర్థ్యం ఎడారి ప్రాంతాలకు అనువైనదిగా చేస్తుంది.



**సౌదీకి ఎలా ఉపయోగపడుతుంది?...** అమాన్ ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు నాసర్ అల్–ముజల్ద్ ప్రకారం, రెసిడా ఆల్బా విస్తరణ ప్రాంతం యొక్క సహజ వృక్షసంపద వారసత్వంలో ముఖ్యమైన భాగం. ఇది పర్యావరణ ప్రాముఖ్యతను పెంచడమే కాకుండా పర్యాటకాన్ని కూడా ప్రోత్సహిస్తుంది. ఈ మొక్క ఔషధ గుణాలు కూడా ముఖ్యమైనవి. సాంప్రదాయకంగా ఇది శ్వాసకోశ, జీర్ణ, చర్మ సమస్యల చికిత్సలో ఉపయోగించబడుతోంది. ఇది వాపు–నిరోధక, క్రిమినాశక, ఎక్స్‌పెక్టరెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. దీని తీపి వాసన కారణంగా ఇది పెర్ఫ్యూమ్, పోట్‌పురి తయారీలో కూడా ఉపయోగించబడుతుంది. దీని ఆకుల నుండి తీసిన పసుపు–ఆకుపచ్చ రంగు వస్త్రాల సాంప్రదాయ రంగులలో ఉపయోగపడుతుంది.

**భారతదేశంలో ఈ మొక్క పరిధి...** రెసిడా లూటియా భారతదేశానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మొక్కను రాజస్థాన్, గుజరాత్, హర్యానా, మధ్యప్రదేశ్ వంటి కరువు పీడిత ప్రాంతాలలో పెంచవచ్చు. ఇది భూమి కోతను నివారించడానికి, ఎడారీకరణను ఎదుర్కోవడానికి.. జీవవైవిధ్యాన్ని పెంచడానికి సహాయపడుతుంది. దీని పువ్వులు పుప్పొడిలో సహాయపడతాయి. తద్వారా వ్యవసాయానికి ప్రయోజనం చేకూరుస్తుంది. దీనిని అలంకార మొక్కగా కూడా ఉపయోగించవచ్చు.

# చురకలు

## సంపాదకీయం

### స్టాలిన్ గ్లామర్ ని పళనిస్వామి తట్టుకోగలరా ?

తమిళనాడులో జనాలు ఎపుడూ పవర్ ఫుల్ గా ఉన్న వారినే తమ నాయకులుగా ఎంచుకుంటారు. తమిళలో ఆవేశం పాలు హెచ్చు. అన్యాయం అంటే వెంటే గొంతు చించుకో వాల్సిందే. కేంద్రం వద్ద తొడగొట్టే మొనగాడికే వారు కోరి మరీ తెచ్చి మెడలో వరమాల వేస్తారు. అలా ఒకనాడు జయలలిత, కరుణానిధిలను పదే పదే గెలిపించి తమ రాజకీయ ఆకాంక్షలను అలా చాటుకున్నారు. ఇదిలా ఉంటే 2016లో జయలలిత అన్నాడీఎంకేని ఒంటి చేత్తే జయలలిత గెలిపించారు. ఆమె వరసగా రెండవసారి అధికారాన్ని అలా అందుకున్నారు. అవతల వైపు డీఎంకే నుంచి రాజకీయ భీష్ముడుగా ఉన్న కరుణానిధిని సైతం ఓడించారు. అయితే అధికారం తెచ్చిన జయలలిత అదే ఏడాది చివరిలో మరణించారు. ఆమె సీఎం గా పనిచేసింది కొద్ది నెలలు మాత్రమే. ఆ తరువాత పన్నీరు సెల్వం కొన్నాళ్ళ పాటు సీఎం గా ఉన్నా అన్నాడీఎంకేలో తనకు ఉన్న సంస్థాగత బలం తొ పళనిస్వామి ఆయన్ని పక్కన పెట్టి సీఎం అయ్యారు. అలా జయలలిత తెచ్చిన అధికారాన్ని ఆయన నాలుగేళ్ళ పాటు అనుభవించారు కానీ ఆయన నాయకత్వంలో అన్నాడీఎంకే గెలిచింది అయితే లేదు. 2021 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 66 సీట్లకే అన్నాడీఎంకే పరిమితం అయింది బీజేపీ కి మూడు సీట్లు వచ్చాయి మిగిలినవి అన్నీ స్టాలిన్ నాయకత్వంలో డీఎంకే కూటమి గెలుచుకుంది. ఇక స్టాలిన్ కి మరో విజయం 2024 ఎన్నికల్లో దక్కింది మొత్తానికి మొత్తం ఎంపీ సీట్లను ఆయన నాయకత్వంలో కూటమి గెలుచుకుంది. స్టాలిన్ కి పొలిటికల్ గా గ్లామర్ ఉంది. ఆయన కరుణానిధి నుంచి రాజకీయ వ్యూహాలను అనేకం నేర్చుకున్నారు. విద్యార్ధి నుంచే రాజకీయ అరంగేట్రం చేశారు. యువజ నాయకుడిగా ఎదిగారు. ఎమర్జెన్సీ టైంలో కూడా యువ నేతగా తన సత్తా చాటారు. తండ్రి అధికారంలో ఉన్నా వెనక చక్రం తిప్పినది ఆయనే. ఇక స్టాలిన్ ఈ రోజు దక్షిణాది రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఢీ కొడుతున్నారు. అయిదేళ్ళ ఆయన పాలన మీద సహజంగా కొంత వ్యతిరేకత ఉన్నా ఆయన సమ ఉజ్జీ నాయకులు అయితే అవతల వైపు లేరు అన్నది ఒక విశ్లేషణ. దానికి తోడు సినీ హీరో విజయ్ పార్టీ కూడా ఈసారి బరిలో ఉంటే ట్రయాంగిల్ జరిగి యాటీ ఓట్లు చీలి స్టాలిన్ కే మరోసారి అధికారం దఖలు పడుతుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ఈ నేపధ్యంలో అన్నా డీఎంకే బీజేపీల మధ్య పొత్తు కుదిరింది. మాజీ సీఎం అన్నా డీఎంకే అధినేత పళనిస్వామి నాయకత్వంలో ఎన్నికలకు వెళ్తామని అమిత్ షా ప్రకటించారు. అన్నా డీఎంకే బీజేపీ పొత్తు సక్సెస్ ఫుల్ అని 1998లో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత నేతృత్వంలో బీజేపీ, అన్నాడీఎంకే కూటమిగా ఏర్పడి లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే నాటి పొత్తు సక్సెస్ వెనక జనాకర్షణ కలిగిన నేత జయలలిత ఉన్నారు. ఆమె ఐరన్ లేడీ. ఆమెని తమిళ జనాలు అమ్మగా గుండెల్లో పెట్టుకున్నారు. మరి నాటి సక్సెస్ రిపీట్ కావాలి అంటే కుదురుతుందా అన్నది చర్చగా ఉంది. స్టాలిన్ ని ఓడించాలని బీజేపీకి కసి ఉంది. దాంతో పొత్తులతో కత్తులు దూస్తోంది.

కానీ తమిళనాట స్టాలిన్ కి ఎదురు నిలిచే పొత్తుగా ఇది ఉంటుందా లేక ఏమి జరుగుతుంది అన్నది చూడాల్సి ఉంది.

# బాలల వికాసం కోసం జీవితాన్ని అంకితం చేసిన న్యాయపతి రాఘవరావు - ఏప్రిల్ 13... రేడియో అన్నయ్య జయంతి

పిల్లలారా రారండోయ్... బాల బాలికలు రారండోయ్... బాలల ప్రోగ్రాం విన రారండోయ్... అంటూ ప్రారంభమై, పాటతో మొదలై... 'పోదామా ఇక పోదామా ఇళ్లకు... మన ఇళ్లకు...అనే ముగింపుతో వినిపించే రేడియోలో ప్రసారమయ్యే బాలానందం కార్యక్రమం కోసం పిల్లలే కాదు...పెద్దలు సైతం ఉత్సాహం తో ఎదిరి చూసిన పాత జ్ఞాపకాలు అయిదు పదుల వయసు దాటిన వారికి చేటుగి పోనివి. రేడియో అన్నయ్యగా న్యాయ పతి రాఘవరావు, రేడియో అక్కయ్యగా ఆయన సతీమణి కామేశ్వరి కలిసి ఆకాశవాణి ద్వారా నిర్వహించిన పిల్లల కార్యక్రమాలు మరిచి పోలేనివి. న్యాయపతి రాఘవరావు పేరు నేటి తరానికి తెలియక పోవచ్చు. అయితే రేడియో ప్రధాన మనో రంజన సాధనంగా ఉన్న పాతకాలపు రోజుల్లో రేడియో అన్నయ్యగా ఆయన సుపరిచితులు. పిల్లలే సర్వస్వంగా ఎంచి, పిల్లల కోసం అయన ఒక్కరే కాక, సహధర్మచారిణి అయిన కామేశ్వరితో కలిసి ఎన్నో పిల్లల కార్యక్రమాలను నిర్వహించారు. బాలికల శ్రేయస్సు, సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన విద్యావేత్త, కళా కోవిదుడు, రచయిత. నాటి రేడియో శ్రోతల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నారు. న్యాయపతి రాఘవరావు (ఏప్రిల్ 13, 1905 – ఫిబ్రవరి 24, 1984) రేడియో అన్నయ్యగా ప్రసిద్ధుడు, ఆంధ్ర బాలానంద సంఘం సంస్థాపకుడు, బాలసాహిత్యవేత్త, బాలబాలికల శ్రేయస్సు, సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన విద్యావేత్త, కళాకోవిదుడు, రచయిత. పిల్లల కోసం ఎవరూ, ఏ సంస్థా , ఏ ప్రభుత్వమూ చేయనంత కృషి సలిపారు రాఘవ రావు. 1905వ సంవత్సరం ఏప్రిల్ 13 న ఒరిస్సాలోని బరంపురం లో అయన జన్మించారు. తండ్రి న్యాయపతి రామానుజస్వామి ప్రముఖ న్యాయవాది. పాఠశాల చదువు అనంతరం విజయనగరం లోని మహారాజ కళాశాల లో డిగ్రీ పూర్తి చేసారు. 1934 లో కామేశ్వరితో పెళ్ళయింది. "రేడియో అక్కయ్య"గా పేరుగాంచిన న్యాయపతి కామేశ్వరి ఆమే. రాఘవరావుకు బాల్యం నుంచి పిల్లలంటే ప్రాణం. వారికి కథలు చెప్పటమన్నా, నటించి చూపటమన్నా మహా ఇష్టం. పాఠశాలలో వక్తృత్వ పోటీల్లో కథలు చెప్పే పోటీల్లో ప్రథమ బహుమతులన్నీ ఆయనకే సొంతం, సొత్తు అయ్యేవి. డిగ్రీ అయ్యాక, మద్రాసు లో "ది హిందూ" పత్రికలో విలేఖరిగా జీవితం ప్రారంభించి, పది సంవత్సరాల తరువాత, దానికి రాజీనామా చేసి , ఆకాశవాణి లో కాంట్రాక్టు పద్ధతిపై చేరాడు. ఆ రోజుల్లో బీ.బీ.సీ లోని పిల్ల కార్యక్రామాల తరహాలో మన దేశంలో కూడ రేడియో చిన్న పిల్లల కొరకు రేడియో ప్రసారలను చేపట్టాలని అప్పటి ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఒక నిర్ణయం తీసుకుంది. మద్రాసు రేడియోలో పిల్లల కార్య క్రమాలను దుర్గాబాయి దేశముఖ్ నిర్వహించే వారు. 1933 లో రాఘవ రావు, కామేశ్వరి జంటకు ఆ అవకాశం వరించింది. అక్కడ చేరిన తరువాత చిన్నపిల్లల కార్యక్రమాలను ప్రతి వారం నిర్వహించే పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తూ క్రమంగా రాఘవరావు "రేడియో అన్నయ్య" గా పేరొందారు. ప్రతి ఆదివారం "ఆటవిడుపు" అనే కార్యక్రమం ప్రారంభించి, తెలుగు బాల బాలికలను... రారండోయ్ రారండోయ్........ పిల్లల్లారా రారండోయ్ అంటూ పిలుపు నిచ్చారు. ఆయనకు చేదోడు వాదోడుగా ఆయన శ్రీమతి న్యాయపతి కామేశ్వరి అండగా నిలిచి ఆ కార్యక్రమాలను విజయవంతం చేసి "రేడియో అక్కయ్య" గా పేరొందారు. రేడియోలో పనిని వారు ఉద్యోగంగా కాకుండా ఒక ఉద్యమంగా భావించారు. ఆటవిడుపు కార్యక్రమానికి శ్రోతల సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. దాంతోపాటే ఆ కార్యక్రమంలో పాల్గొనే పిల్లల సంఖ్యకూడా ఎక్కువ కావటంతో పది సంవత్సరాల లోపు పిల్లలకు శనివారం బాలానందం అనీ, పది సంవత్సరాలు పైబడిన వారికి ఇతర కార్యక్రమం పెట్టి బాలబాలికల సృజనాత్మక శక్తిని పెంపొందించే ప్రయత్నంలో రేడియో అన్నయ్య ఎంతో కృషి చేశారు. వారిని ఒడిలో కూర్చో పెట్టుకుని లాలించి, ముద్దాడి, ముద్దు ముద్దు పాటలు పాడిస్తూ, వారి పాట కనుగుణంగా నోటితో రకరకాల ధ్వనులను చేస్తూ మధ్య మధ్యలో అగ్గిపెట్టితో చిత్రవిచిత్ర ధ్వనులు చేస్తూ ఆ కార్యక్రమం వింటున్న వారికి గిలిగింతలు పెట్టే వారు. వాస్తవానికి ఆ కార్యక్రమం కోసం పిల్లలకన్నా పెద్దలే ఆతృతగా వేచి చూసేవారన్నది వాస్తవం. రేడియో అన్నయ్య సృష్టించిన పాత్రల్లో "మొద్దబ్బాయి, పొట్టిబావ, చిట్టిమరదలు, దొడ్డమ్మ" శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయన "బూరెల మూకుడు, కొంటె కిష్టయ్య, పిల్లలకే స్వరాజ్యం వస్తే, చీమ కథ, ఏనుగొచ్చిందేనుగు, బడి గంట, మడతకుర్చీ, రామూ సోమూ, పిల్లల దొంగ" ఇంకా అనేక హాస్య నాటికలు, గమ్మత్తు నాటికలు, చిట్టి నాటికలు దాదాపు పన్నెండు వందలకు పైగా రచించి వాటిని పిల్లలతో వేయించారు. దాదాపు పది చలన చిత్రాలలో కూడా పిల్లలచే వేషం వేయించారు. అనేక గ్రామఫోను రికార్డులు ఇచ్చి పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎవరూ, ఏ సంస్థా , ఏ ప్రభుత్వమూ చేయనంత కృషి సలిపారు. 1940లో మద్రాసులో ఆంధ్ర బాలానంద సంఘం స్థాపించారు. రేడియో కార్యక్రమాల అనంతరం అన్నయ్య చేపట్టిన మరో బృహత్కార్యం బాలల కోసం "బాల" పత్రిక ను ప్రచురించడం. అంతవరకూ పిల్లల కంటూ ఒక పత్రిక లేదు. "బాలకేసరి" అనే పత్రిక కొంతకాలం వచ్చినా అది వెంటనే ఆగిపోయింది. రేడియో అన్నయ్య పిల్లల పత్రిక అవసరం గుర్తించి 1945లో బాల పత్రిక స్థాపించి బాల సాహిత్యంలో అనేక ప్రయోగాలు చేశారు. అది అపారమైన ప్రభావాన్ని చూపింది. రేడియో



అన్నయ్య స్థాపించిన "ఆంధ్ర బాలానంద సంఘం" విజయభేరి మ్రోగించింది. 1956లో హైదరాబాదు లో బ్రాంచి కూడా వెలిసింది. అనంతరం ఈ విజయం గ్రహించి బాలబాలికల పత్రికల సంఘాల అవశ్యకతను గుర్తించి అనేక బాలానంద సంఘాలు ఏర్పడ్డాయి. బాలపత్రికలు ఎన్నో వెలిశాయి. జవహర్ బాలభవన్ (1966), ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ (1976) స్థాపనకు ఆయన విశేషమైన కృషి చేశారు. ఆ సంఘంలో అనేక చక్కని కార్యక్రమాలు ఇప్పటికీ జరుగుతున్నాయి. సంగీతం , నాట్యం, నాటకం, మేజిక్. హిప్నాటిజం రంగాల్లో కూడా శిక్షణనిస్తూ అదొక బాలల దైవ మందిరంగా అలరారుతోంది. బాలబాలికల ప్రగతికై పాటుబడిన న్యాయపతి రాఘవరావుకు సంతానంలేదు. రేడియో అన్నయ్య , అక్కయ్యల కున్న లక్షల ఆస్తిని ఆంధ్ర బాలబాలికలకే ధారాదత్తం చేసిన త్యాగ ధనులు. బాలబాలికల ఆటపాటలకు, వారిలో నిక్షిప్తమై ఉన్న సహజమైన కళాకౌశలానికి ప్రోత్సాహం అందించే వేదిక కోసం ప్రభుత్వంచే బాలల అకాడమీ స్థాపింప చేసి, ఆయన ఆశయాన్ని సాకారం రేడియో అన్నయ్య ధన్యులు. బాలానందం రేడియో అన్నయ్య 1984 ఫిబ్రవరి 24న పరమపదించారు. రేడియో అన్నయ్య శత జయంతి సందర్భంగా తపాలా శాఖా ఒక ప్రత్యేక కవరు విడుదల చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# ప్రజల మనిషి శ్రీపాద రావు - ఏప్రిల్ 13...శ్రీపాద రావు వర్ధంతి



దుద్దిళ్ళ శ్రీపాదరావు (మార్చి 2, 1935 – ఏప్రిల్ 13, 1999) సీనియర్ కాంగ్రెస్ శాసనసభ్యులు, శాసనసభ స్పీకరుగా పని చేశారు. 1935 సంవత్సరమలో మార్చి 2 న కాటారం మండల ధన్వాడ గ్రామానికి చెందిన మౌళి పటేల్ రాధా కిష్టయ్య, కమలా బాయి దంపతులకు జన్మించారు. అమ్మమ్మ వారు నివాసముండే నాగపూర్ లో పుట్టిన అయన ప్రాధమిక విద్య ధన్వాడ గ్రామంలో చేసి, ఎస్ ఎస్ సి వరకు మంథనిలోని బావ సువర్ణ చంటయ్య ఇంట్లో ఉండి పూర్తిచేశారు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్ లో చేసిన తరువాత ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతి ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం కొన్ని రోజులు చేశారు. ఆ తరువాత నాగపూర్ లో న్యాయవాదిగా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో ఎల్. ఎల్. బి. పూర్తి చేసి ప్రాక్టీసు పెట్టారు. తండ్రి మరణాంతరం స్వంత ఊరికి వచ్చిన శ్రీపాద వ్యవసాయమే వృత్తిగా చేసుకొని, గ్రామంలోనే ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామం నుండి సర్పంచ్ గా పోటీ చేయాలని ప్రజలు ఒత్తిడి చేశారు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాద రాజకీయాల్లోకి అడుగిడాలని స్నేహితులు, హితులు ప్రోత్సాహించారు. ఆ దిశగా అడుగులు వేస్తూ పోటి చేసి మొదటిసారి సర్పంచ్ గా ఎన్నుకో బడ్డారు. వరుసగా మరో మారు ఆయనకే ప్రజలు మద్దతు పలకడంతో రెండవ సారి ఎన్నికయ్యారు. మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ఎల్ ఎం బి ఛైర్మన్ పదవికి మంథని నుండి గెలిచారు. ఆయన రాజకీయ ఎదుగుదలకు ఎల్ ఎం బి బ్యాంకు ఛైర్మన్ ఎన్నిక ఎంతో సహకరించింది. దీంతో పూర్తిగా నియోజకవర్గానికే ఆయన సుపరిచితమైనారు. పదవివస్తే ముఖం చాటు చేసుకునే నాయకులకు భిన్నంగా అయన ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్ట, నష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగారు. 1984 ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుండి ఏమ్మెల్లెగా పోటి చేసే అవకాశం లభించింది. అప్పుడే పురుడు పోసుకున్న తెలుగు దేశం పార్టీ ప్రభావం, ఎన్టిఆర్ ప్రభంజనం ముందు శ్రీపాదరావు విజయం సాదించ గలుగుతారా? అనే అంశం పై స్వ, విపక్షాలలో చర్చ జరిగింది. తెలుగుదేశం, సంజయ్ విచార మంచ్ మధ్య ఎన్నికల ఒప్పందం కారణంగా మంథని శాసనసభ నియోజక వర్గం నుండి పోటిగా సంజయ్ విచార మంచ్ నుండి చంద్రుపట్ల రాజి రెడ్డి పోటీ పడ్డారు. వీరిద్దరి మధ్య గట్టి పోటి నెలకొనగా చివరకు శ్రీపాదరావు విజయం సాధించారు. కరీంనగర్ జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ తరపున మంథని ప్రాంత ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు పి. సి.సి. సభ్యునిగా స్థానం కల్పించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు శాసన సభ్యులుగా ఎన్నికైన ఆయనకు శాసనసభ స్పీకర్ గా అన్ని పార్టీల మద్దతుతో పదవి అలంకరించారు ఆ పదివికి వన్నె తెచ్చారని ఎంతో మంది ప్రముఖుల, రాజకీయ విశ్లేషకుల ప్రశంశలు పొందారు. ఒకవైపు స్పీకర్ పదవి బాధ్యతతో నిర్వహిస్తునే మరోవైపు తన స్వంత నియోజకవర్గ ప్రజలను మాత్రం మరిచిపోకుండా, మరింత దగ్గరయ్యారు. విమర్శలకు వెరవకుండా, పొగడ్తలను లెక్క చేయకుండా, అభివృద్ధిపై దృష్టి సారిస్తూ ముందుకు కదిలారు. ఒక సామాన్య కుటుంబం నుండి ఎదిగిన రాజకీయ నాయకుడు కావడంతో ప్రజల కష్ట, సుఖాలు తెలిసిన మహా మేధావి కనుక ప్రభుత్వ విధి – విధానాలపై అసెంబ్లీలో చురుకైన పాత్ర పోషించి, ఆ పదివికే వన్నె తెచ్చారని ఎంతో రాజకీయ విశ్లేషకులు కితాబిచ్చారు. 1994 ఎన్నికల ముందు నక్సల్స్, పోలీసుల మధ్య జరిగిన ప్రత్యక్ష పోరు తీవ్రంగా ప్రభావం చూపింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో శ్రీపాదరావు పరాజయం పాలయ్యారు. అయిన ఓటమి పాలయిన ప్రజలకు మాత్రం దూరం కాలేదు. వారి మధ్య లోనే ఉంటూ వారికి తన శక్తి మేరకు సేవ చేస్తూనే ఉంటూ వచ్చారు. తన ఓటమికి విమర్శ కూడా చేయకుండా హుందాగా వ్యవహరించి, తన ప్రజాభిమాన్ని మరింత చూరగొన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి బాగాగులను ఎల్లవేళలా యోచించే ఆయనను మృత్యువు నక్సల్స్ రూపంలో కబళించింది.1999 ఏప్రిల్ 13న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంతటా విషాద ఛాయలు అలుము కున్నాయి. మంథని ప్రాంతమంత శోక సాగరంలో మునిగి పోయింది. మహాదేవపూర్ మండలం అన్నారం కు తన అనుచర వర్గంతో వెళ్లి వస్తున్న క్రమంలో మార్గమధ్య లోని అడవుల్లో శ్రీపాదరావు వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలి తీసుకెళ్ళి తుపాకి తూటాలతో విగత జీవున్ని చేశారనే వార్త తెలవగానే ప్రజలలో నక్సల్స్ పై ఆక్రోశం ఒక్కసారిగా ఉప్పెనల బయటికి వచ్చింది. ప్రజా నాడి అయిన శ్రీపాదరావును హత మార్చిన విషయం తెల్సుకున్న ప్రజలు నక్సల్స్ ను ఎవరిపైన మీ యుద్ధం ప్రజల పైననా? ప్రజా హృదయం పైననా?" అంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఎన్నడు అపకారాన్ని తలపెట్టని నాయకున్ని నిష్కారణంగా హత మార్చిన నక్సల్స్ పై విమర్శలు వెల్లు వెత్తాయి. రాజకీయంగా అనిశ్చిత పరిస్థితి నెలకొంది. ప్రజల కోసం తుపాకులు పతి పోరు బాట పట్టినట్లు చెప్పుకొనే నక్సల్స్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం ప్రతి ఒక్కరు ప్రత్యక్షంగా విమర్శించారు. అప్పటి రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు సైతం హుటా హుటిన మార్చురీలో ఉన్న మృత దేహాన్ని చూసేందుకు తరలి వచ్చారు. నక్సల్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, వేల మందికి పైగా కన్నీటి పర్యంతమై శ్రీపాదరావు అంత్య క్రియల్లో పాల్గొన్నారు. అనంతరం పీపుల్స్ వార్ అగ్రనాయకత్వం, కేంద్ర కమిటీ సభ్యుడు సంతోష్, శ్రీపాదరావును హతమార్చడం నక్సల్స్ యొక్క చారిత్రాత్మక తప్పిదం అని పేర్కొన్నాడు . ఒక ప్రజా నాయకున్ని అన్యాయంగా చంపామంటూ తప్పు ను ఒప్పుకునారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# విలువల కోసం పాటు పడిన ధీరుడు బి.పి.మండల్ - ఏప్రిల్ 13... మండల్ వర్ధంతి

మనస్సాక్షిని వంచింపలేక, విలువలకై పరితపించి, తాము నమ్మిన సిద్ధాంతాల నుండి దూరం కాలేక, ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమై, కుల తత్వాన్ని ఎట్టి స్థితిలో నూ ప్రదర్శింపక భారత దేశ చరిత్ర లో ప్రత్యేక స్థానాన్ని పొందిన మాన వతా వాది బి.పి.మండల్ గా ప్రసిద్ధులైన బిందేశ్వర ప్రసాద్ మండల్. భారత పార్లమెంట్ సభ్యులుగా , బీహార్ ముఖ్య మంత్రిగా, వెనకబడిన తరగుతుల కమిషన్ చైర్మన్ గా, పదవి లేవైనా , లక్ష్య సిద్ధికై వాటిని తృణప్రాయంగా భావించి ఆదర్శనీయులు అయినా రాయన. ధనిక జమీందారీ కుటుంబంలో జన్మించినా, వెనక బడిన వర్గా ల అభ్యున్నతికి రాజీలేని సిద్ధాంత పర పోరాటాలు చేసి, బీ సీ ల బాంధవునిగా చిర స్థాయిగా నిలిచి పోయారు మండల్. 1918 ఆగస్టు 25 న బీహార్ లోని బనారస్ లో యాదవ భూస్వామ్య కుటుం బంలో జన్మించి మాధేపురా జిల్లాలో ని మోరో గ్రామంలో పెరిగిన మండ ల్ మండే పురంలో ప్రాథమిక విద్యను, దర్భాంగాలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. 1930లో పాట్నాలో ఇంటర్ పూర్తి చేసి, కలకత్తా ప్రసిడెన్సీ కళాశాలలో ఉన్నత విద్యాభ్యాసం కోసం చేరి, అనివార్య కారణాల వల్ల చదువు వదిలి పెట్టారు. 23వ ఏట జిల్లా కౌ కౌన్సిల్ కు , 1945 – 51 మధ్య మాధేపురాలో జీతం లేకుండా స్వచ్ఛందంగా జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గా పని చేశారు. జాతీయ కాంగ్రెస్లో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు . బీహార్ శాసనసభకు 1952లో ఎన్నికై, అధికార పార్టీలో ఉంటూ, బీహార్ లోని కుర్మీలనే బీసీలపై రాజపు త్రుల దాడిని నిరసించి, తమ నియోజక వర్గంలో పామా గ్రామంలో దళితులపై, మైనా రిటీలపై పోలీసుల అత్యాచారాల గురించి మాటాడాలని మండల్ భా వించారు. కాని అధికార పక్షంలో ఉండి మాటాడ కూడదని ని సిఎం ఆదేశిస్తే, నమ్మిన విలువల కోసం పార్టీ నుండి వైదొలిగి, రామ్ మనోహర్ లోహియా , జయప్రకాశ్ నారాయణ్ స్పూర్తి ద్వారా సంయుక్త సోషలిస్టు పార్టీలో చేరి, ప్రతిపక్ష పాత్ర పోషించ డానికి వెనకాడలేదు. 1967లో సోషలిసు అభ్యర్థుల ఎంపికపై ఆయన సల్పిన



కృషి, ప్రచారం కారణంగా 1962లో కేవలం 7 సీట్లకే పరిమితంగా ఉన్న పార్టీకి 1967 లో 69 సీట్లు రావడం ఆయన చిత్తశుద్ధికి తార్కాణం. బీహార్ ని ప్రప్రథమ కాంగ్రెసేతర ప్రభుత్వంలో ఎంపీ అయి ఉండీ, ఆరోగ్య మంత్రిత్వ బాధ్యతలు స్వీకరిం చారు. ప్రభుత్వంతో విభేదాల వల్ల కాంగ్రెస్ పార్టీ బయటి మద్దతు పొంది, 1968 ఫిబ్రవరి 1న ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ మద్దతు పొంది ఉన్నా, సీనియర్ కాంగ్రెస్ నేతల అవినీతిపై అయ్యర్ కమిషన్ ద్వారా విచారణ జరిపించడంలో వెనకాడలేదు. కమిషన్ నివేదికను బయట పెట్ట రాదనే నాటి ప్రధాని ఇందిర ఒత్తిడితో రాజీ పడక పోవడం మూలాన అవిశ్వాసం, ఫలితంగా రాజీనామా చేయాల్సి వచ్చినా వెరవలేదు. "ఓట్లు సంపాదించడానికి కులపర విజ్ఞపులు చేసినా, ప్రభుత్వ నిర్ణయాలలో కులతత్వం సహించేది లేదని" స్పష్టం చేసిన ధీశాలి, నిష్పక్షపాతి ఆయన. 1967 మార్చి 5న సోషిత్ దళ్ (అణ గారిన ప్రజల పార్టీ) స్థాపించి, 1967 నుండి 70 వరకు లోకసభ సభ్యుడిగా, 1972 లో తిరిగి ఎన్నికై, నాటి సిఎం పాండే, మిథిలా విశ్వవిద్యాలయంలో కింది స్థాయి ఉద్యోగం నుండి వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులానికి చెందిన వారిని నింపాలని ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1974లో శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి, జయ ప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో చేరి, అవినీతి వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషిం చారు. 1977లో జనతా పార్టీ పక్షాన లోకసభకు ఎన్నికై, 79 వరకు కొనసాగారు. ఎమర్జెన్సీ అనంతరం అధికారానికి వచ్చిన జనతా ప్రభుత్వం ఇందిరా గాంధీ పై కక్ష సాధింపును వ్యతిరేకించారు. ఇది మండల్ ఆదర్శ వ్యక్తిత్వ ఒక పార్శ్వం కాగా, సామాజిక, విద్య తదితర రంగాల్లో ఇతర వెకబడిన వర్గాల సమానత్వాన్ని ఆయన స్వప్న సాకారానికి అనన్య సామాన్య కృషి మరో పార్శ్వం. సామాజిక, ఆర్థిక, విద్యా మూలాలను కనుగొని, బీసీ కులాల వారు దేశంలో 52 శాతం ఉన్నారని, వారికి న్యాయ పరంగా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పిం చాలని కృపి చేశారు. 1979 జనవరి 1 న నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యులతో పౌర హక్కుల కమిషన్ నియమించగా, మండల్ చైర్మన్ గా, 1980 డిసెం బర్ 31న నివేదిక అందజేశారు. అన్ని ప్రభుత్వ, విద్యా సంస్థలు ఇతర వెనక బడిన తరగతులు బిసి) అభ్యర్థులకు రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించాలని సిఫార్సు చేశారు. రిజర్వేషన్లు 50శాతం, మించరాదనే సుప్రీం కారు ఆదేశాలను అనుసరించి, ఎస్సీ ఎస్టీ లతో కలిపి 49 శాతం ఉండేలా బీసీ లకు 27శాతం రిజర్వేషన్లు ఉండాలని కమిటీ ద్వారా సిఫార్సు చేశారు. తర్వాత వచ్చిన ఇందిర ప్రభుత్వం అమలు చేయక పో గా దశాబ్దం తర్వాత విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధాన మంత్రిత్వ పాలనలో అమలుకు నోచుకుంది. 1982 ఏప్రిల్ 13న మండల్ మరణించారు. భారత ప్రభుత్వం ఆయన గౌరవం ఒక పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. భారతీయ రాజకీయ, సామాజిక, చారిత్రిక నిర్మాణాలలో మండల్ కమిషన్ నివేదిక పాత్ర మరపు రానిది, చారిత్రక మైనది. మండల్ వర్ధంతి సందర్భంగా వెనక బడిన వర్గాల మార్గ దర్శకులైన మండల్ కు ఘనంగా నివాళి అర్పించాల్సిన అవసరం ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# లింగ నిర్ధారణ పరీక్షలు ఆగేనా?

సిరిసిల్ల : 'చందుర్తి మండలానికి చెందిన దంపతులు గర్భంలో ఉన్నది ఆడ, మగ తెలుసుకునేందుకు స్థానికంగా ఆర్ఎంపీ సాయం తీసుకున్నారు. ఆర్ఎంపీ వారిని వేములవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని స్కానింగ్ కేంద్రానికి తీసుకెళ్లాడు. స్కానింగ్‌లో గర్భంలో ఉన్నది ఆడ బిడ్డగా నిర్ధారించారు. ఆడపిల్ల పుట్టడం ఆ దంపతులకు ఇష్టంలేదు. గర్భస్రావంలో మగ బిడ్డ లక్షణాలు కనిపించాయి. స్కానింగ్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని ఆ దంపతులు గ్రామంలోని ఆర్ఎంపీతో గొడవకు దిగారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. బయట పడేవి చాలా తక్కువ.'

గర్భస్రావం.. వైద్యపరంగా ప్రమాదకరమైన పరిస్థితి. గర్భం దాల్చిన 20 వారాల తర్వాత గర్భస్రావం (అబార్షన్) చేయటం ప్రాణాలకే ముప్పు. ఈ చర్యలను కఠినతరం చేస్తూ ప్రభుత్వం చట్టం కూడా తీసుకొచ్చింది. గర్భిణి, కడుపులోని పిండానికి ఆరోగ్యసమస్యలు ఉంటే నిపుణులైన వైద్యుల సూచన మేరకు వారి పర్యవేక్షణలోనే గర్భస్రావాలు నిర్వహించాలి. కాగా జిల్లాలో ఇష్టారాజ్యంగా ఆడ.. మగ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ పలువురు గర్భస్రావాలకు పాల్పడుతున్నారు. దీని ప్రభావం ఎనిమిదేళ్లలో జిల్లా బాల బాలికల నిష్పత్తిని పరిశీలిస్తే స్పష్టమవుతోంది.

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లోని పలు ఆసుపత్రుల్లో తప్పుడు మార్గంలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మారుమూల గ్రామాలు.. తండాల నుంచి ఆర్ఎంపీలు, పీఎంపీల మధ్యవర్తిత్వంతో చాటుమాటుగా పరీక్షలు చేస్తున్నారు. మరికొందరు స్కానింగ్ కోసం జిల్లానుంచి కామారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల, కరీంనగర్‌లోని పలు



ఆసుపత్రులకు వెళ్తుండగా.. అక్కడి నుంచి జిల్లాకు వచ్చేవారు కూడా ఉన్నారు. ఇటీవల వైద్యఆరోగ్యశాఖ అధికారులు స్కానింగ్ కేంద్రాల రికార్డుల తనిఖీల్లో పక్క జిల్లాల గ్రామాల నుంచి వచ్చినవారి చిరునామాలు ఉన్నాయి. వాటిలో స్కానింగ్ చేసినందుకు మాత్రం స్పష్టమైన కారణాలేవీ పొందుపర్చక పోవడం అనుమానాలకు తావిస్తోంది.

జిల్లాలో 28 స్కానింగ్ కేంద్రాలున్నాయి. వీటిలో కొన్నింటిలో నిర్వాహకులు, స్త్రీవైద్య నిపుణులతో కలిసి పుట్టబోయేది ఆగ, మగ తెలుసుకుని మరీ గర్భస్రావాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కేంద్రాలకు పలువురు ఆర్ఎంపీలు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం రూ.40 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తగ్గుతున్న నిష్పత్తిజిల్లాలో 0-6 ఏళ్లలోపు బాలబాలికల నిష్పత్తిలో ఎనిమిదేళ్లలో భారీ తేడా వచ్చింది. 2017లో ప్రతీ వెయ్యి మంది బాలురకు 1014 మంది బాలికలున్నారు. ఇదే 2024 డిసెంబరుకు 904 మందికి చేరింది. పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో కొన్ని మండలాల్లో మరీ దయనీయ పరిస్థితులకు చేరుకునే అవకాశాలు లేకపోలేదు.

**నిరంతర తనిఖీలు**

జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, ప్రసవాలు జరిగే అసుపత్రులను నిరంతరం తనిఖీ చేస్తున్నాం. మధ్యవర్తులు, ఆర్ఎంపీలు, పీఎంపీలు లింగనిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించినట్లు గుర్తిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసుల సహకారంతో పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నాం. తప్పుడు స్కానింగ్ పరీక్షలు చేస్తూ పట్టుబడితే దాని తీవ్రతను బట్టి జరిమానా, జైలు శిక్షలు పడే అవకాశం ఉంది. రజిత, డీఎంహెచ్‌వో

# వాహనాల వేలమెప్పుడో!?

నల్గొండ: ఒకప్పుడు 104 వాహనాలు గ్రామాల్లోకి వస్తే చాలు.. వృద్ధులు.. మహిళలు.. గర్భిణులు.. చిన్నారులు ఆ వాహనం చుట్టుము ట్టి తమకు వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరేవారు. ఉచితంగా రక్తపోటు, మధుమేహం, దగ్గు, దమ్ము, ఆయాసం, కాలానుగుణ వ్యాధులకు సంబంధించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఔషధాలను అందించేవారు. 2022 సంవత్సరంలో వీటి సేవలను అప్పటి భారాస ప్రభుత్వం, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా రద్దు చేసి ఈ వాహనాలు వేలం వేసేందుకు నిర్ణయించారు. ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా అదనపు కలెక్టర్, జిల్లా రవాణాధికారి, ఎస్పీ సభ్యులుగా కమిటీని సైతం ఏర్పాటు చేశారు. వరసగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారిపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. జిల్లాలో మొత్తం గ్రామీణ వైద్య సంచార వాహనాలు 11 ఉండగా, అప్పటి ప్రభుత్వ నిర్ణయంతో ఇవీ మూలకు పడ్డాయి. వీటన్నింటిని నల్గొండ జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య కార్యాలయానికి ఇరువైపులా నిలిపివేశారు. ఈ



వాహనాలు ఎండకు ఎండుతూ, వానలకు తడుస్తూ తుప్పుపట్టిపోతున్నాయి. సంచార వైద్య కిట్ యూనిట్లతో ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ నిర్వహించేందుకు 104 వాహన సేవలను 2008 సంవత్సరంలో అప్పటి దివంగత సీఎం వైఎస్ ప్రారంభించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక, కాలానుగుణ వ్యాధులతో బాధపడే రోగులకు వారి గ్రామాలకు క్షేత్రస్థాయిలో వచ్చి నెల నెలా వైద్య పరీక్షలు నిర్వహించి, నెలకు సరిపడా ఔషధాలను ఒకే సారి 104 సంచార వైద్యసేవల వాహన పథకం ద్వారా అందించేవారు. ప్రతి నెలా మొదటి తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్దేశించిన మారుమూల, ఏజెన్సీ ప్రాంతాలకు ఈ వాహనాలు వెళ్లి క్షేత్రస్థాయిలో వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందించేవి.

ఈ సంచార వైద్య వాహనంలో ఒక వైద్యుడు, ఏఎన్ఎం, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, సహాయకుడు, డాటా ఎంట్రీ ఆపరేటరు ఉండేవారు. వారిని అసంక్రామిక వ్యాధుల నివారణ (ఎన్‌సీడీ) కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలకు బదిలీ చేశారు.

# మానవ వ్యర్థాల శుద్ధీకరణ



కరీంనగర్ : జిల్లాలో పురపాలికల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణాలుగా ప్రకటించారు. ఇప్పటికే ఓడీఎఫ్, ఓడీఎఫ్‌ం సర్టిఫికెట్ సాధించి ఆ దిశగా శుభ్రత వైపు అడుగులు వేశారు. కరీంనగర్ నగర పాలిక మాత్రం వాటర్ం ర్యాంకుతో ముందుంది. మానవ వ్యర్థాల శుద్ధీకరణకు ఎఫ్ఎస్‌టీపీలు (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మించేందుకు నాలుగేళ్ల కిందట ప్రతిపాదించారు. రెండేళ్ల కిందట స్థలాలు ఎంపిక చేసి అప్పగించగా నగరంలో ప్రస్తుతం పనులు ప్రారంభించారు. మిగతా రెండు చోట్ల పనుల ఊసే లేకుండాపోయింది.

**ఎరువు తయారీ..**

ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకుల నుంచి మానవ వ్యర్థాలను సెప్టిక్ క్లీనింగ్ వాహనాల ద్వారా శుద్ధి కేంద్రానికి తరలిస్తారు. యంత్రాలతో, గ్రావిటీతో వ్యర్థాలను వివిధ దశల్లో వేరు చేసి శుద్ధి చేస్తారు. ఘన, ద్రవ వ్యర్థాలు శుద్ధి చేసి నీటిని మొక్కలకు, చెరువులకు తరలిస్తారు. ఘన వ్యర్థాలతో ఎరువు తయారు చేస్తారు.

**మురుగునీరు శుద్ధి**

కరీంనగర్ నగర పరిధిలో భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం ఎంతో ఉపయోగపడుతోంది. చుట్టూ ఉన్న పురపాలికలు సైతం సెప్టిక్ ట్యాంకుల ద్వారా వచ్చే వ్యర్థాలు తీసుకొచ్చి వేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు మెరుగ్గా వస్తున్నాయి. నగరంలో 38 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించగా పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంలేదు. ప్రతీ ఇంటికి కనెక్షన్ ఇస్తే మురుగుకాలువల గుండా ప్రవాహమే కనిపించదు. రోజుకు రెండు ఎంఎల్‌డీల మేర మురుగునీరు వస్తుండటంతో శుద్ధి చేసి సమీప చెరువుల్లోకి పంపిస్తున్నారు. ఎరువు తయారు చేసే అవకాశమున్నా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.

**చకచకా పనులు** నగరంలోని యూజీడీ ఎస్టీపీ ప్లాంట్ పక్కనే రెండు ఎకరాల స్థలం కేటాయించారు. టెండర్ దక్కించుకున్న సంస్థ పనులు ప్రారంభించింది. వేగంగా పనులు చేస్తుండగా ఇప్పటికే ఇదే ఏజెన్సీ వేములవాడలో పూర్తి చేసింది. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఇంకేముంది చెత్తతో బయోగ్యాస్, మానవ వ్యర్థాలతో ఎరువుల తయారీ, మురుగునీటిని శుద్ధి చేయడం వంటి కార్యక్రమాలతో రానున్న రోజుల్లో నగరపాలిక దూసుకెళ్లనుంది.

# కల్తీ పదార్థాలు.. రోగాలు ఖరారు



గోదావరిఖని : బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్ల నిర్వాహకుల తీరు మారడం లేదు. డబ్బులకు ఆశపడి గడువు ముగిసిన ముడి పదార్థాలు, రెండురోజుల క్రితం నాటి ఆహార పదార్థాలను వినియోగిస్తూ ప్రజలకు అనారోగ్యాలు అంటగడుతున్నారు. కాల్చిన వంట నూనెలు, రుచి కోసం నిషేధిత పదార్థాలను వినియోగిస్తున్నట్లు సంబంధిత అధికారుల దాడుల్లో వెలుగుచూశాయి. జరిమానాలు విధించినా వారిలో మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో క్రమం తప్పకుండా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, బిర్యాని సెంటర్లపై దాడులు నిర్వహించాలని పురపాలక సంచాలకులు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. నాణ్యతాప్రమాణాలు పాటించిన దుకాణాలకు భారీగా జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు.

**మితిమీరిన రంగుల వాడకం**

: జిల్లాలోని పలు బేకరీలు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వంటశాలలను ఇరుకైన గదుల్లో నిర్వహిస్తున్నారు. ఏదైనా అనుకొని ప్రమాదం జరిగితే బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా గదులు ఉన్నాయి.

: ఉదయం వండిన ఆహారాన్ని తరచూ వేడి చేస్తూ రాత్రి వరకు సరఫరా చేస్తున్నారు. తాజాగా కనిపించేందుకు రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇటీవల రామగుండం నగరపాలక అధికారులు ఎన్టీపీసీ ప్రాంతంలోని ఓ రెస్టారెంటులో తనిఖీలు నిర్వహించినప్పుడు రెండు, మూడు రోజుల క్రితం వండిన ఆహారాన్ని పాలిథిన్ కవర్లలో సీల్ చేసి ఫ్రిడ్జిలో ఉంచడాన్ని గుర్తించారు. చికెన్ వ్యర్థాలతో కూడా ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు.

: రామగుండం నగరపాలిక ఆధ్వర్యంలో ఖని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, రెస్టారెంట్లు, మిఠాయి దుకాణాలు, బేకరీల్లో తనిఖీలు చేస్తూ ప్రతి నెలా దాదాపు రూ.2 లక్షల వరకు జరిమానాలు విధిస్తున్నారు.

**ఆ పదార్థాలతో వ్యాధులు**

రుచి, వాసన కోసం ఉపయోగించే పదార్థాలతో క్యాన్సర్, ఎలర్జీ, అస్తమా తదితర వ్యాధులు వచ్చే ప్రమాదముంది. రోజుల తరబడి మరిగిస్తున్న వంట నూనెలు, ఫ్రిడ్జిలో భద్రపరుస్తూ రసాయనాలు కలిసి సరఫరా చేసే ఆహార పదార్థాలు అనారోగ్యాన్ని తెచ్చిపెడతాయి. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. డా.అశోక్, ప్రొఫెసర్(జనరల్ మెడిసిన్), ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

**మార్పు రాకుంటే మూసివేస్తాం**

అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు హోటళ్లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహిస్తూ కల్తీ ఆహార పదార్థాల కట్టడికి యత్నిస్తున్నాం. మార్పు రాని వాటిని మూసివేయడంతో పాటు చర్యలు తీసుకుంటాం. లైసెన్సులు లేకుండా నిషేధిత, కాలం చెల్లిన రసాయనాలు వాడుతూ ప్రజారోగ్యాన్ని హరిస్తున్నారు. డి.కిరణ్, ఆరోగ్య సహాయకులు, రామగుండం నగరపాలిక

# ట్రామా.. తక్షణ వైద్యానికి ధీమా



కరీంనగర్ : ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్ (మొదటి గంట)లోపు తక్షణ వైద్యం అందించడానికి ట్రామా సెంటర్ ప్రాణవాయువుగా ఉపయోగపడుతుంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు కరీంనగర్ జిల్లా కేంద్ర ఆసుపత్రితోపాటు హుజూరాబాద్‌లో రెండు చోట్ల ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ రెండు ప్రాంతాలు ప్రధాన రహదారులపైనే ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్యం అందించే వీలు కలుగుతుంది.

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విధాన పరిషత్‌లోని ఆసుపత్రులు ఉన్నా ప్రమాదం బారిన పడిన వారికి అవసరమైన తక్షణ వైద్యం అందించే పరిస్థితి లేదు. ఆయా దవాఖానాల పరిధిలో ప్రమాదాలు జరిగితే వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్లలాంటి ప్రాంతాల నుంచి కూడా కరీంనగర్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపిస్తున్నారు. దీనిలో ఆర్థో విభాగానికి సంబంధించి వైద్యులు ఉన్నా న్యూరో విభాగ వైద్యులు లేకపోవడంతో తలకు తీవ్రగాయాలైనప్పుడు, ఇతర ప్రధాన సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వారిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ట్రామా సెంటర్ అందుబాటులో ఉంటే ఈ పరిస్థితి ఉండదు.

**ఇప్పటికే కరీంనగర్‌లో భవనం..**

కరీంనగర్‌లో ప్రమాదాల బారినపడిన వారికి తగిన వైద్యం అందించినా .. పూర్తి స్థాయి చికిత్సకు హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి వైద్య కళాశాల పరిధిలోకి మారింది. దానికి అనుగుణంగానే సేవలు పెంచాల్సి ఉంది.

జిల్లా ఆసుపత్రి ఆవరణలో 50 పడకలతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు భవన నిర్మాణం పూర్తి చేశారు. ఇదే కేంద్రంలో ట్రామా సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో వైద్య పరికరాలు నిర్ధారణ యంత్రాలు ఆర్థో, న్యూరో, కార్డియాలజీ, పల్మనాలజీ, తదితర విభాగాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు తగిన సిబ్బంది అవసరం అవుతారు. వీరి అవసరాల విషయమై జిల్లా ఆసుపత్రి నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే వారొస్తారు.

హుజూరాబాద్‌లో ఏర్పాటుకు నిర్ణయం

హుజూరాబాద్‌లో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. కరీంనగర్, వరంగల్ జిల్లాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న ఈ ఆసుపత్రిలో గతంలో ట్రామా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మార్గంలో చాలా ప్రమాదాలు జరుగుతుంటాయి. క్షతగాత్రులను ఘటనాస్థలం సమీపాని బట్టి కరీంనగర్‌కు, లేదా వరంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నారు. హుజూరాబాద్‌లో కూడా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ప్రమాద బాధితులను కాపాడినట్లవుతుంది.

# రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్..!

నల్గొండ : రిజిస్ట్రేషన్ల క్రయ విక్రయాలు ఇక నుంచి స్లాట్ బుకింగ్ ద్వారా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖపై తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో మార్పు వచ్చే అవకాశం కనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10 నుంచి భువనగిరి, చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మిగిలిన 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో త్వరలో స్లాట్ బుకింగ్ ద్వారా పునర్ వ్యవస్థీకరణ చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పూర్తి స్థాయిల్లో కసరత్తు ప్రారంభించింది. ఈ విధానం ద్వారా ఇకపై నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లో క్రయ విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. భూ భారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్ ఏర్పాటు చేసి నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచనున్నారు. ఒక వేళ రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నించినా క్షణాల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయానికి సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

**కొత్త విధానంతో..**

నూతనంగా స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్లు సులభతరం కానున్నాయి. ఉదయం 10:30 నుంచి 1:30 వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను స్కాన్ చేసి అదే రోజు సంబంధిత ఆస్తి కొనుగోలు దారుకు ఇస్తారు. పారదర్శకంగా, వేగవంతంగా స్లాట్ బుకింగ్ ఉపయోగించుకునేలా యంత్రాంగం



ఏర్పాట్లు చేస్తుంది.

**అక్రమాలకు అడ్డుకట్ట పడేనా..?**

జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా చేసే క్రయ విక్రయాలకు గజానికి రూ.150 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా.. కార్యాలయ ఖర్చులు అంటూ ఖాళీ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేస్తే రూ.2 వేలు, ఇల్లు రిజిస్ట్రేషన్ చేస్తే రూ.3 నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని దస్తావేజు లేఖరు 'న్యూస్‌టుడే'తో వాపోయాడు.

**పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు**

జిల్లాలో పారదర్శకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. నేటి నుంచి చౌటుప్పల్, భువనగిరిలో స్లాట్ బుకింగ్ అందుబాటులోకి వస్తుంది. ఒక్కో కార్యాలయానికి ఉదయం 48 స్లాట్ బుకింగ్‌లు, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ఐదు మాత్రమే నేరుగా రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఉంది. మధ్యవర్తుల ద్వారా గజానికి రేటు కట్టి వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎక్కడ అక్రమ వసూలు జరిగినా నేరుగా డీఆర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు. ప్రకాశ్, ఉమ్మడి జిల్లా

# మిల్లుల దారుల్లో.. సన్నాల బారులు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలోని నల్గొండ, సూర్యాపేట జిల్లాలో ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యాన్ని అధికంగా సాగు చేశారు. అయితే సన్నరకం ధాన్యాన్ని విక్రయించేందుకు ఆయా జిల్లాల్లోని రైతులు అధిక మంది మిర్యాలగూడలోని రైస్ మిల్లుల వద్దకు తరలివస్తున్నారు. దీంతో మిర్యాలగూడ ప్రాంతంలోని యాద్గార్‌పల్లి, గూడూరు, శెట్టిపాలెం, వెంకటాద్రిపాలెం సమీపంలోని మిల్లులకు సన్న ధాన్యం ట్రాక్టర్లు పోటెత్తుతున్నాయి. ముఖ్యంగా యాద్గార్‌పల్లి రోడ్డులోని మిల్లుల ఎదుట భారీగా ధాన్యం లోడ్లు నిలిచిపోతుండడంతో తరచూ ట్రాఫిక్ నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సన్నరకం ధాన్యంలో జేఎస్ఆర్ చింట్లు రకానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ధాన్యం మొత్తం ఒకే సారి విక్రయానికి రావడంతో మిల్లర్లు నాణ్యత సాకుతో ధరలో కోత విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.2,320 సైతం వేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింట్లు రకానికి పలువురు మిల్లర్లు రూ.2,150 నుంచి రూ.2,250 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని, గతంలో ఇదే ధాన్యానికి రూ.2,800 వరకు ధర ఇచ్చారని దీంతో పోల్చితే భారీగా నష్టపోతున్నామని అన్నదాతలు చెప్తున్నారు.

ప్రత్యేక అధికారులను నియమించినా..

మిల్లుల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వారికి మద్దతు ధర దక్కేలా ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ప్రతి మిల్లుకు ఒక ప్రత్యేక అధికారిని మంగళవారం నియమించారు. అయినప్పటికీ ం రైతులకు మద్దతు ధర ఎక్కడా లభించకపోవడం గమనార్హం.

**గంటల తరబడి ఎదురుచూపులే..**

మిల్లుల వద్దకు సాయంత్రం సమయంలో వచ్చిన ధానాన్ని సైతం మిల్లర్లు మరుసటి రోజు మధ్యాహ్నం వరకు కోనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్, మునగాల, నడిగూడెం, నేరేడుచర్ల, చిలుకూరు తదితర మండలాల నుంచి అనేక మంది రైతులు తెల్లవారుజామున నాలుగు గంటలకే మిల్లుల వద్ద లైన్లలో ట్రాక్టర్లను ఉంచి పడిగాపులు గాస్తున్నారు. అనేక మంది అలసిపోయి ట్రాక్టర్ల పైనే నిద్రిస్తూ తమ వంతు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఐకేపీ కేంద్రాల్లో కొనట్లేదు

ప్రభుత్వం సన్నాలు సాగు చేయాలని ప్రోత్సహించడంతో సాగు చేశాం. అయితే ఐకేపీ కేంద్రాల్లో సన్న ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో మిర్యాలగూడలోని మిల్లుల వద్దకు వచ్చాను. వరి కోసి తెల్లవారుజామున నాలుగు గంటలకు తీసుకొచ్చాను. చింట్లు రకానికి గతంలో ధర బాగానే పలికింది. కానీ ప్రస్తుతం మద్దతు ధర సైతం అందించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కీత శ్రీను, మర్రికుంట, గరిడేపల్లి మండలం, సూర్యాపేట జిల్లా.

# విడిదిల్లు.. విందులతో చిందు

మొయినాబాద్ : 'మత్తు.. మజా.. కలిపితే ముజ్రా'.. రాజధాని శివారులో మరోసారి సాగుతున్న రేవ్‌పార్టీలను మించిన సరికొత్త అశ్లీల నృత్య వినోదం వెలుగు చూసింది. సైబరాబాద్ ఎస్‌వోటీ బృందం నిఘా లోపాన్ని ఎత్తి చూపుతోంది. శివారుల్లో విడిదిళ్లు (ఫాంహౌస్‌లు), వ్యవసాయక్షేత్రాలు, రిసార్టులలో రేవ్ పార్టీలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నా పట్టుకునే నాథుడే కరవయ్యారనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది పోలీసులు తెరవెనుక సహకారమందిస్తూ ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 5 వరకు జరిగే ఈ తంతులో యువతులు పాటలకు అనుకూలంగా నాట్యం చేస్తూ హద్దులు దాటుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాళ్లు రాజధాని శివార్లకు వచ్చి మరీ విందులు చేసుకుంటున్నారు.

**కమిషనర్ ఆగ్రహంతోనే..** సైబరాబాద్ కమిషరేట్ పరిధి ఇంజినీరింగ్



కళాశాలల ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వెలుగు చూస్తోంది. కమిషనర్ ఆగ్రహంతోనే పోలీసులు నిఘా పెంచి ముజ్రాపార్టీని భగ్నం చేశారనే ప్రచారం జరుగుతోంది.

**పోలీసుల అదుపులో 20 మంది..** మొయినాబాద్ మండలం ఎత్బార్‌పల్లిలోని 'హాలిడే హెూం' ఫాంహౌస్‌లో బోరబండకు చెందిన అబ్దుల్ లుక్మన్(35) పుట్టినరోజు సందర్భంగా స్నేహితులకు విందు ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాతనగరం, బాగ్‌లింగంపల్లి, మాసబ్‌ట్యాంక్, బోయిన్‌పల్లి, లింగంపల్లి, ఖైరతాబాద్, గోల్కొండ, ఆసిఫ్‌నగర్, జీడిమెట్ల, యూసుఫ్‌గూడ, బోరబండ ప్రాంతాలకు చెందిన 13 మంది స్నేహితులతోపాటు సికింద్రాబాద్, రాజేంద్రనగర్, రాంనగర్, మెహిదీపట్నంకు చెందిన ఏడుగురు యువతులను విందుకు ఆహ్వానించారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు దాడి చేసి 20 మందిని అదుపులోకి తీసుకొని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. యువతుల్లో ఇద్దరు గతంలో ముజ్రాపార్టీలో పాల్గొని పోలీసులకు చిక్కారు. పార్టీ నిర్వహణలో వారికి అనుభవం ఉండటంతోనే అబ్దుల్ లుక్మన్ వారిని సంప్రదించారని ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గంజాయి, హుక్కా, విదేశీ మద్యం సీసాలతోపాటు కండోమ్ ప్యాకెట్లు దొరకడం గమనార్హం. డీజేసౌండ్ సిస్టం, చరవాణులు, కార్లతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు.

# సహాయ ఆచార్యుల పోస్టులు 'ఈసీ'గా భర్తీ

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో ఆరు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల పోస్టులను భర్తీ చేసేందుకు విశ్వవిద్యాలయ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. పోస్టులను భర్తీ చేసేందుకు న్యాయపరంగా, సాంకేతికంగా కార్యనిర్వాహక కమిటీలు (ఈసీ)లు ఉండాలి. నగరంలోని 6 వర్సిటీల్లో ఒక్క విశ్వవిద్యాలయంలోనూ పూర్తి స్థాయిలో ఈసీలు లేకపోవడంతో తొలుత వీటిని నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పూర్తిస్థాయి కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నత



విద్యామండలి వీసీలను ఆదేశించింది. దీంతో వర్సిటీల్లో పరిపాలనా విభాగంలో విధులు నిర్వహించిన ఆచార్యులు, విద్యానిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల పేర్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఉస్మానియా, సురవరం ప్రతాపరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహిళా విశ్వవిద్యాలయం వీసీలు, రిజిస్ట్రార్లు వేర్వేరుగా ఈసీలో సభ్యుల నియామకాలపై సీనియర్ ప్రొఫెసర్లతో చర్చించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సభ్యుల ఎంపికను వీలైనంత వేగంగా పూర్తిచేయాలని, విద్యానిపుణులు, అనుభవజ్ఞులకు ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించారు. సభ్యుల ఎంపిక పూర్తయ్యాక జాబితాను ఉన్నత విద్యామండలికి పంపి ఆమోదం పొందనున్నారు.

# మిల్లుల్లోకి ఆమె..!

మిర్యాలగూడ :గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. మహిళా సమాఖ్యలకు రైస్ మిల్లులు నిర్మించి ఇస్తామని అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల మహిళా సమాఖ్యలను గుర్తించి వారికి రైస్ మిల్లులు నిర్మించి ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పౌరసరఫరాలు, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించగా ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**జిల్లాలో పరిస్థితి** నల్గొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో నిర్మించాలని నిర్ణయించారు. దీనికి ప్రభుత్వ భూమి ఒకటిన్నర ఎకరాలు అందుబాటులో ఉన్న చోట ఎంపిక చేసి ఉచితంగా అందించనున్నారు. మిర్యాలగూడ, నల్గొండ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ , నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలిస్తున్నారు. నాలుగు మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన మిల్లు నిర్మాణానికి రూ.3.50 కోట్లు, యంత్ర సామగ్రికి రూ.1.10 కోట్లు, సార్టెక్స్ యంత్రానికి రూ.75 లక్షలు ( మట్టి పెళ్లలు, రాళ్లు బెరుకులు తొలగించే యంత్రం)తో నిర్మించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నల్గొండ జిల్లాలో 31 మండలాలు ఉండగా 32 మండల మహిళా సమాఖ్య, ఒక జిల్లా సమాఖ్య ఉంది. వీటిలో మంచిగా చేస్తున్న మండల సమాఖ్యలను నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంపిక చేసి రైస్‌మిల్లుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ పరిశీలించి స్థలం ఎంపిక చేసిన తర్వాత విజయవంతంగా నిర్వహిస్తున్న మహిళా సమాఖ్యలను ఎంపిక చేయనున్నారు. మిల్లుల నిర్వహణకు, ధాన్యం కొనుగోళ్ల పెట్టుబడులకు నాబార్డు రుణాలు తీసుకుంటే మహిళా సంఘాలకు ఆస్తులు తనఖా పెట్టాల్సిన అవసరం లేకుండానే ప్రభుత్వం భరోసా ఇస్తుంది. ఐకేపీ ధాన్యం, కస్టమ్ మిల్లింగ్ నిధులు, వ్యాపారంలో లాభాల ఆధారంగా రుణాలు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత అర్హత కలిగిన మండల సమాఖ్యలను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు.

# పొదుపు పాటిద్దాం.. వేసవి దాటేద్దాం



హైదరాబాద్:ఎండలు మండిపోతుండటంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇంట్లో ఫ్యాన్‌లు, ఏసీలు, కూలర్లు గంటల తరబడి వినియోగిస్తుండటంతో మీటర్ గిర్రున తిరుగుతోంది. నెలాఖరులో బిల్లు చూసి గొల్లుమనడం సామాన్యుడి వంతవుతోంది. గ్రేటర్‌లో ఫిబ్రవరిలో సగటు డిమాండ్ 2,715 మెగావాట్లు, మార్చిలో 3,714కు పెరిగింది. మేలో 5వేలకు చేరుకోనుందని అధికారుల అంచనా. వినియోగంలో జాగ్రత్తలు, పొదుపుమంత్రం పాటించకపోతే జేబుకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

**పెరుగుతున్న విద్యుత్ డిమాండ్..**

వెస్ట్‌మారేడ్‌పల్లిలో ఉండే కుమార్ ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఏసీ కొనుగోలు చేశాడు. రోజుకు 8గంటల చొప్పున నెల రోజుల వినియోగించారు. మార్చి నెలలో రూ.2,880 కరెంట్ బిల్లు వచ్చింది. ఒక్కసారిగా అంత బిల్లు రావడంతో ఆందోళన చెందిన కుమార్.. మే నెలాఖరు వరకు ఎలా నెట్టుకు రావాలనే అయోమయంలో పడ్డాడు. గది ఉష్ణోగ్రతను ప్రభావితం చేసే ఎలక్ట్రిక్ ఉపకరణాలు టీవీ, రిఫ్రిజిరేటర్, ఓవెన్ వంటివి వాడకూడదు.

నిర్వహణను విస్మరించడంతో ఏసీల్లో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఫిల్టర్లు మార్చకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎల్ఈడీ బల్బుల వినియోగం, ఇన్వర్టర్ ఏసీలు, గదిలోకి రాగానే గుర్తించి వెలిగేలా సెన్సర్లు ఏర్పాటు చేసుకోవాలి.

ఏసీని వినియోగిస్తున్నప్పుడు గది ఉష్ణోగ్రతను లెక్క చేయకుండా 16 నుంచి 18 డిగ్రీలు పెట్టడంతో లోడ్ పెరిగి ఎక్కువ విద్యుత్ ఖర్చవుతోంది. అందుకు 24 డిగ్రీల ఉష్ణోగ్రత గదిలో ఉండేలా చూసుకోవాలి. గది చల్లబడే వరకు ఫ్యాన్ వేస్తే గది త్వరగా చల్లబడి ఏసీపై భారం తగ్గుతుంది.

వినియోగం తగ్గించే పరికరాలు..

విద్యుత్ వినియోగం తగ్గించుకునేందుకు అనేక రకాల ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. 'పవర్ సేవర్' పేరుతో అందుబాటులో ఉన్నాయి. సాకెట్‌లో వీటిని బిగించగానే విద్యుత్‌లోడ్ హెచ్చుతగ్గులను క్రమబద్ధీకరిస్తున్నాయి.

స్మార్ట్ ప్లగ్ - రాత్రి ఏసీ ఆన్ చేస్తే ఉదయం వరకు నడుస్తూనే ఉంటుంది. గది చల్లబడినా వినియోగం పెరుగుతోంది. నియంత్రించేందుకు మార్కెట్‌లోకి 'స్మార్ట్‌ప్లగ్' అందుబాటులోకి వచ్చింది. ఏసీ, ప్రధాన సాకెట్‌కి అనుసంధానం చేయడంతోపాటు యాప్‌తో చరవాణికి అనుసంధానించొచ్చు. యాప్‌లోని 'షెడ్యూల్ ఆన్-ఆఫ్' ఫీచర్‌తో రోజువారీ వినియోగాన్ని సగానికి తగ్గిస్తుంది.

# పల్లె మురిసె.. ఖ్యాతి మెరిసె!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలబెట్టే విధంగా పలు గ్రామ పంచాయతీలు ఆదర్శనీయ పంథాను చూపించాయి. ఏడు పల్లెలు జాతీయ స్థాయిలో పురోగతి సూచికలో ముందువరుస (ఫ్రంట్ రన్నర్) విభాగంలో మంచి మార్కులను సాధించాయి. కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసిన ర్యాంకులలో రాష్ట్రస్థాయిలో తొలి 25 స్థానాలున్న జాబితాలో మన పల్లెలే ఏడు ఉండటం గమనార్హం.

**వసతుల్లో అ'ద్వితీయం'**

మండల కేంద్రమైన తిమ్మాపూర్ రాష్ట్ర స్థాయి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించిన గ్రామాల జాబితాలో 82.79 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వైకుంఠధామం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ప్రభుత్వ, ప్రైవేటు బడులు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండటంతో ఈ గ్రామం మెరుగైన మార్కులను పొందింది. ఉపాధి అవకాశాలున్న పంచాయతీగా సూచికలో ముందు వరుసలో నిలిచింది.

**గంద్రపల్లి ఉత్తమంగా..**కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గంద్రపల్లి గతంలోనూ ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. పరిసరాల శుభ్రతతోపాటు ఇంటింటికీ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునే విషయంలో ప్రత్యేకతను చాటిన పల్లెగా గుర్తింపు పొందింది. 1500 జనాభా కలిగిన ఈ చిన్న పల్లె వంద శాతం సీసీరోడ్ల నిర్మాణంతోపాటు స్వచ్ఛతకు లోగిలిగా గుర్తింపు అందుకుంది. గత పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధతో పల్లె ప్రకృతి వనాలతోపాటు క్రీడా ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దారు. 2021-22లోనూ పూర్తిస్థాయిలో నీటి సౌకర్యం ఉన్న గ్రామంగా జిల్లాస్థాయిలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ వికాస్ పురస్కారాన్ని ఈ గ్రామం అందుకుంది.


**ఉపాధి కల్పన ఊరుగా..**

పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లి గ్రామ జనాభా 1,597 కాగా.. ఉపాధి హామీ పనులను వీలైనంత ఎక్కువ మందికి కల్పించడంతో గ్రామస్థుల ఆర్థికాభ్యున్నతికి దోహదపడింది. గ్రామంలో అభివృద్ధి పనులకు ఉపాధి హామీని వరంగా మలుచుకున్నారు. చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతుతో కూలీలకు వేతనం అందించే విధంగా పంచాయతీ సభ్యులు చొరవ చూపించారు. 398 గడపలున్న ఈ పల్లెలో మంచినీటికి కొరత రాకుండా ప్రత్యేకమైన ప్రణాళికతో తాగునీటిని ఇంటింటికి అందించడంలో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. గ్రామం అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబడాలనే తపన ఇలా సుస్థిర అభివృద్ధి ప్రగతి రూపంలో సాకారమైంది.

**ఆరోగ్యపరమైన అంశంలో..**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లి గ్రామం ఆరోగ్య పరమైన అంశంలో మంచి పురోగతిని అందుకుంది. 2,500 జనాభా కలిగిన ఈ గ్రామంలో మొత్తం 690 కుటుంబాలున్నాయి. ఇక్కడ గ్రామ పంచాయతీ ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చే చర్యలు తీసుకుంది. మురుగు కాల్వలను శుభ్రపర్చడంతోపాటు చెత్తాచెదారం నిల్వ ఉంచకుండా చేస్తూ పరిసరాల శుభ్రతతో ఆరోగ్యానికి బాటలు వేశారు. వచ్చిన నిధులను ప్రణాళిక ప్రకారంగా సద్వినియోగపర్చుకోవడంలో ప్రత్యేక చొరవను చూపించి పల్లెను ఆదర్శంగా నిలబెట్టారు.

# అందని 'పట్టా' పాసుపుస్తకం



ధర్మపురి : భూపట్టా పాసు పుస్తకాలు సకాలంలో అందక రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. ధరణిలో స్లాట్ బుక్ చేసుకుని భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పాసు పుస్తకాలు భూపరిపాలన ముఖ్య కార్యాలయం పోస్ట్ ద్వారా పంపిస్తోంది. ఇప్పటివరకు 30 నుంచి 120 రోజుల మధ్య పుస్తకాలు రైతులకు అందుతుండేవి. కాని అయిదు నెలలుగా అందడం లేదు. జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉన్నాయి. చిన్న మండలాలు మినహా పెద్ద మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో రోజుకు కనీసం పది నుంచి పదిహేను మాత్రమే భూరిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వీరిలో వందల మంది రైతులు పాసుపుస్తకాల కోసం ఎదురుచూస్తున్నారు.

**ప్రయోజనాలు దూరం**

పాసు పుస్తకాలు సకాలంలో రాకపోవడంతో రాయితీ ఎరువులు, ప్రభుత్వ పథకాలు, రుణాలకు రైతులు దూరం అవుతున్నారు. గతంలో కూడా ఇదే పరిస్థితి ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం చాలామంది రైతులు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు భరోసా వంటి పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోతోంది.

**ముద్రణలో నాణ్యత లేక ఇబ్బందులు**

పాసుపుస్తకం ఉన్నవాళ్లు భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఉన్నదాంట్లోనే ప్రింట్ వస్తోంది. ప్రింట్ సరిగ్గా కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిరాక్స్ తీయిస్తే ప్రింట్ కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనే ముద్రణ సామగ్రిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థికభారం, ఉదాసీనతతో ప్రింటింగ్‌కు సంబంధించిన సామగ్రి కొనుగోలు చేయకపోవడంతో సమస్య ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు.

**నాలుగు నెలలుగా..**

నా భర్త చనిపోతే 14 గుంటల భూమిని నాలుగు నెలల కిందట విరాసత్ చేయించుకున్నాను. పాసు పుస్తకం ఇప్పటికీ రావడం లేదు. అధికారులను అడిగితే వస్తుందని చెబుతున్నారు. పాసు బుక్కు రాకపోవడంతో పలు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోలేక పోతున్నాను.దాసాండ్ల నీలమ్మ, నేరెల్ల

**కచ్చితంగా వస్తాయి**

పాసు బుక్కులు తప్పనిసరిగా వస్తాయి. ఆలస్యమవుతుండవచ్చు కానీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరికి పాసు పుస్తకం పోస్ట్ ద్వారా అందుతోంది.కృష్ణచైతన్య, తహసీల్దార్, ధర్మపురి

# సొమ్ము వచ్చేసింది..!

భువనగిరి : జిల్లాలోని ఆయిల్‌పాం సాగు చేసిన రైతులకు మంచి రోజులు వచ్చాయి. ప్రభుత్వ పరంగా వచ్చే ప్రోత్సాహం, రాయితీ డబ్బుల కోసం నాలుగేళ్లుగా వారి ఎదురు చూపులు ఫలించాయి. ఎట్టకేలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం, రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవనున్నట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి. సంబంధిత వివరాలు క్లుప్తంగా..

**ఉపాధిహామీతో గుంతలు, రాయితీపై మొక్కలు..** జిల్లాలో 2021-22 సంవత్సరం నుంచి ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు ఆయిల్‌పాం సాగును ప్రారంభించారు. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు ఉపాధిహామీ పథకం కింద తీయించడంతో పాటు రాయితీపై మొక్కలను ప్రభుత్వం అందించింది. మొక్కలకు నీరందించేందుకు బిందుసేద్యం పరికరాలు కూడా రాయితీపై అందించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 4,107 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్నారు. ఈ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం మొక్కల సరఫరా, సంరక్షణ, అంతర పంటల సాగు, యాజమాన్య నిర్వహణ ఖర్చులు ఇలా అన్నీ కలిపి ఎకరాకు రూ.58,918ల చొప్పున ప్రోత్సాహకంగా అందిస్తామని అప్పట్లో ప్రభుత్వం తెలిపింది.

# మొరాయిస్తున్న సర్వర్.. లబ్ధిదారుల ఒక్కట్లు

కోనరావుపేట: ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్ఠాత్మకంగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. కాగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి ఈ-పోస్ యంత్రాల సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బియ్యం తీసుకునేందుకు పలుమార్లు రేషన్ దుకాణాలకు రావాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పాత రేషన్‌కార్డులు-1,73,728, కొత్తగా మంజూరైన కార్డులు 9,731 ఉన్నాయి. జిల్లాలో 12 మండలాలు, రెండు పురపాలికల్లో మొత్తం 345 చౌక ధరల దుకాణాలు ఉండగా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో సుమారు ఐదు లక్షలకు పైగా ఉన్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున నెలకోటా సుమారు 3,300 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. సాంకేతిక లోపం కారణంగా ఈ-పోస్ యంత్రం పనిచేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. లోపాన్ని సరిదిద్ది బియ్యం సక్రమంగా పంపిణీ చేసేలా



అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**నాలుగు సార్లు వచ్చా**

మా కుటుంబంలో నలుగురికీ కలిపి 24 కిలోల బియ్యం వస్తాయి. ప్రభుత్వం అందించే సన్నబియ్యం తీసుకోవడానికి రేషన్ దుకాణానికి నాలుగుసార్లు వచ్చాను. ఈ-పోస్ యంత్రంపై వేలిముద్ర వేయాల్సి ఉండగా సర్వర్ పనిచేయడం లేదు. దీంతో రేషన్ బియ్యం కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. సాంకేతిక అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తే బాగుంటుంది.

**మెండె లక్ష్మి, లబ్ధిదారు, నాగారం**

20 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ

నాకు సుమారు 90 క్వింటాళ్లకు పైగా బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రెండు విడతలుగా బియ్యం సరఫరా చేశారు. మొదటి విడత 20 క్వింటాళ్లు, రెండవ విడత 70 క్వింటాళ్ల మేర వచ్చాయి. ఐదారు రోజులుగా ఈ-పోస్ యంత్రంలో సర్వర్ మొరాయించటంతో సాంకేతిక సమస్య తలెత్తుతోంది. ఉదయం, సాయంత్రం కొద్ది సమయమే సర్వర్ పనిచేస్తోంది.

సైండ్ల అంజయ్య రేషన్ దుకాణదారుడు నాగారం


అధికారుల దృష్టికి సమస్య

బియ్యం పంపిణీకి ఈ-పోస్ యంత్రంలో తరచూ సర్వర్ మొరాయించటం, సాంకేతిక సమస్య వస్తున్నట్లు రేషన్ దుకాణదారులు మా దృష్టికి తీసుకువచ్చారు. గతంలో బియ్యం పంపిణీ సజావుగానే కొనసాగింది. ప్రభుత్వం ఈ-పోస్ యంత్రంలో నూతన సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసింది. ఒకటి, రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. నరేశ్ ఈ-పోస్ యంత్రం సాంకేతిక సహాయకులు

# పొదుపుతోనే 'గృహలక్ష్మి'

జగిత్యాల : జగిత్యాల పట్టణానికి చెందిన శేఖర్ 200లోపు యూనిట్లు వాడుతుండటంతో గృహలక్ష్మి(జీరోబిల్లు) లబ్ధి పొందారు. మార్చిలో విద్యుత్తు వాడకం 201 యూనిట్లు ఉండడంతో రూ.1028 బిల్లు వచ్చింది. దీంతో గృహలక్ష్మి లబ్ధి అందలేదు. ఇలా జిల్లాలో దాదాపు 10 నుంచి 20 వేలకు పైగా లబ్ధిదారులు విద్యుత్తు వినియోగం పెరిగి జీరోబిల్లుకు దూరమయ్యారు.

ప్రభుత్వం నిరుపేదల కోసం ఉచిత విద్యుత్తు(గృహలక్ష్మి) పథకాన్ని ప్రవేశపెట్టినా వినియోగం 200 యూనిట్లు దాటడంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గుతోంది. జిల్లాలో మొత్తం 5,04,252 విద్యుత్తు కనెక్షన్లు ఉండగా 3,56,526 గృహ కనెక్షన్లు ఉన్నాయి. గతేడాది అక్టోబరులో పరిశీలిస్తే 1,94,544 మంది లబ్ధిదారులు ఉచిత విద్యుత్తు పథకం కింద రూ.7.47 కోట్లు లబ్ధిపొందగా నవంబరులో 1,93,996



మందికి రూ.7.78 కోట్లు లబ్ధికలిగింది. డిసెంబరులో చలికాలం కావటంతో వాడకం తగ్గి 2,01,340 మంది రూ.5.56 కోట్లు మాత్రమే లబ్ధిపొందారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలోనూ 2 లక్షలకుపైగా లబ్ధిపొందారు. ఏప్రిల్ నెలలో ఎండలు ముదరటంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గినట్లు తెలుస్తోంది. ఈ నెలఖరుకు బిల్లుల నమోదు పూర్తయితే లబ్ధిదారుల సంఖ్య లక్షా ఎనభై వేలకు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వేసవి ప్రారంభంలో ఎండలు మండిపోతుండటంతో విద్యుత్తు వాడకం బాగా పెరిగి ఉచిత విద్యుత్తు పథకానికి లబ్ధిదారులు దూరమవుతున్నారు. పొదుపుగా 200 యూనిట్లలోపు వాడుకుంటే ఉచిత విద్యుత్తు పథకానికి అర్హులని ఎస్ఈ సాలియా నాయక్ వినియోగదారులకు సూచిస్తున్నారు. ఉక్కపోత పెరగడంతో ఉదయం 9 గంటల నుంచే కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు. ఇనుప కూలర్లు వాడితే విద్యుత్తు వాడకం బాగా పెరుగుతుందని, నాణ్యమైన ఐఎస్ఐ కంపెనీ కూలర్లు వాడాలని సూచిస్తున్నారు. ఏసీలు 26 డిగ్రీలు ఉండాలని, ఎల్ఈడీ బల్బులు, నాణ్యమైన ఐఎస్ఐ గుర్తింపుఉన్న ఫ్యాన్లు వాడాలని పేర్కొంటున్నారు. యాసంగి కోతలు మొదలైన నేపథ్యంలో రైతులు మోటార్ల వద్ద ఆటో స్టార్టర్లు తొలగించుకోవాలని కోరారు.

చురకలు

ఆదివారం 13 ఏప్రిల్ 2025

# భగీరథ.. ఇదేం వ్యథ

నిర్మల్ : ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ సమయంలో ప్రధాన రహదారులతోపాటు కాలనీలకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున పైప్‌లైన్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఇందుకోసం రహదారుల పక్కన, మధ్యలో నుంచి తవ్వకాలు జరిపారు. తవ్విన ప్రాంతాల్లో సిమెంటుతో మరమ్మతులు చేయాల్సిన గుత్తేదారులు అధిక శాతం ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఏళ్ల కాలం ఉండాల్సిన రోడ్లు ప్రస్తుతం అధ్వానంగా మారాయి.

**ఇష్టారీతిన..**మున్సిపాలిటీల పరిధిలో పనులు చేపట్టే సమయంలో కనీస ప్రమాణాలు పాటించకపోవడం, భవిష్యత్తులో ఎదురయ్యే ఇక్కట్లను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. అడుగడుగునా గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు చెడిపోవడంతోపాటు వెన్నెముక సంబంధిత వ్యాధుల బారినపడే పరిస్థితులు ఎదురయ్యాయి. కొన్ని చోట్ల కొత్తగా వేసిన సీసీ రోడ్లను సైతం తవ్వి వదిలేశారు. మురుగుకాలువలు కూడా దెబ్బతిని పరిసరాలు పాములు, తేళ్ల వంటి విషపురుగులకు ఆవాసంగా మారి స్థానికులు భయాందోళనల మధ్య జీవనం సాగించాల్సి వస్తోంది.



అధికారులు చొరవ తీసుకుని కనీస మరమ్మతులు చేయించి సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మల్‌లోని బేస్తవార్‌పేట్, బంగల్‌పేట్, బ్రహ్మపురి వెళ్లే మార్గం దుస్థితి ఇది. పైప్‌లైన్ కోసం తవ్వి వదిలేయడంతో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. రోడ్డు మధ్య, పక్క భాగంలో తవ్వకాలు జరిపి కొన్ని చోట్ల సిమెంటు వేసినా వాటితోపాటు చుట్టుపక్కల దెబ్బతిని ప్రయాణానికి సమస్యలు తెచ్చిపెడుతోంది. ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అడుగుకు ఒకటి చొప్పున ఉన్న గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఎదుర్కొనే ఇక్కట్లు వర్ణనాతీతం. ఈ ఒక్క చోటే కాకుండా పలు ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. నిర్మల్ పట్టణం మంజులాపూర్ 19వ వార్డు అంబేడ్కర్ కాలనీలో పలు చోట్ల సీసీ రోడ్లు స్పీడ్ బ్రేకర్లుగా మారాయి. పైప్‌లైన్ కోసం తవ్విన వాటిని పూడ్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పంచాయతీగా ఉన్న సమయంలో సుమారు రూ.5 లక్షలకు పైగా వ్యయంతో ఓ ప్రాంతంలో సీసీ రోడ్డు, మురుగుకాలువ నిర్మించారు. దానిని సైతం పగులగొట్టి పైపులు వేశారు. వాటికి మరమ్మతులు ఇప్పటి వరకు చేపట్టలేదు. గత్యంతరం లేని చోట స్థానికులే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. మురుగుకాలువలు దెబ్బతినడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి చెప్పలేని ఇబ్బందులు పడుతున్నారు.

# ఎండుతున్న పంటలు.. అన్నదాతకు తంటాలు


నిర్మల్ : స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు సాగుచేస్తున్న వరి పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. నిన్నమొన్నటి వరకు పంట చేతికొస్తుందని సంబరపడ్డారు కానీ నిరంతర విద్యుత్తు సరఫరాతో పాటు ఇసుక అక్రమ రవాణాలో భూగర్భజలాలు పడిపోయి బోర్లలో నీరు రాక పంటలు ఎండిపోతున్నాయి. స్వర్ణ వాగు నీటిని నమ్ముకొని చించోలి(ఎం), వంజర్, బోరిగాం, అలూరు, వెంగ్వాపేట్, తల్వేద, చిట్యాల్, జాఫ్రాపూర్, మాదాపూర్ గ్రామాల రైతులు వరి సాగుచేశారు. ప్రస్తుతం ఒక తడి నీరందితే పంట చేతికొచ్చే అవకాశం ఉంది.

**అడుగంటుతున్న జలం**

నిరంతర విద్యుత్తు సరఫరా.. వాగులు, ఒర్రెల, నదుల నుంచి నిరంతరంగా ఇసుక తవ్వకాలతో భూగర్భజలం కిందకు దిగజారిపోతో ంది. ఇసుక తవ్వకాలపై అధికారులు 'మామూలు'గా చూడటంతో పంటలపై ప్రభావం చూపుతోంది. బోర్లలోనూ నీరు రావడం ఆగిపోతోంది. ఈ సీజన్‌లో జిల్లాలో సాగవుతున్న 2.72 లక్షల ఎకరాల్లో 75 వేల ఎకరాలకు బోర్లు, బావులే ఆధారం. నిరంతర విద్యుత్తు సరఫరాతో చాలాచోట్ల అవసరమున్నా లేకున్నా పంపుసెట్లను నడిపిస్తున్నారు. మోటారు నిలిపివేస్తే బావిలో ఊటలు తరలిపోతాయనే భావనే ఇందుకు కారణం. ఫలితంగా భూగర్భజలాలు పడిపోతున్నాయి.

**పట్టింపు లేకపోవడమే..**

వాగులు, వంకలు, ఒర్రెల నుంచి అనుమతుల్లేకుండా ఇసుక తీయడం నేరం. కానీ జిల్లాలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. పెంబి, రాజురా ప్రాంతాల్లో ఉన్న వాగులు, ఒర్రెలు, నిర్మల్, సారంగాపూర్ మండలాల్లోని స్వర్ణవాగు, భైంసా, కుంటాల, లోకేశ్వరం, నర్సాపూర్(జి) మండలాల్లోని సుద్ధవాగు నుంచి, సోన్, లక్ష్మణచాద, మామడ, ఖానాపూర్



మండలాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తూనే ఉన్నారు. వీటితోపాటు అనుమతుల్లేకుండా ఇష్టారీతిన బోర్లు తవ్వించడం భూగర్భజలాలు తగ్గిపోవడానికి మరో కారణంగా చెప్పొచ్చు. ఎక్కడైనా ఒక బోరు వేయించాలంటే భూగర్భజల, రెవెన్యూశాఖల అనుమతి తప్పనిసరి. అయితే ఇదెక్కడ అమలు కావడం లేదు. ఇసుక అక్రమ రవాణాతో పాటు అనుమతి లేని బోర్ల తవ్వకాలపై సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటే కొంతవరకైనా భూగర్భజలాలు కాపాడుకునే అవకాశం ఉంటుంది.ఎండుతున్న ఈ వరి చిట్యాల్–తల్వేద గ్రామాల మధ్యలోనిది. భూగర్భజలాలు అడుగంటి బోర్లు వట్టిపోయాయి. సమీపంలోని స్వర్ణవాగులోనూ నీరు లేకపోవడంతో భూగర్భజలాలు పడిపోయి బోర్ల ద్వారా నీరు రావడం లేదని రైతు గడ్డం నర్సారెడ్డి తెలిపారు. స్వర్ణ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తే కొంతవరకైనా భూగర్భజలాలు పెరిగి బోర్ల ద్వారా నీరొచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. కుభీరు మండలం పార్డి(కె) గ్రామానికి చెందిన సుంకరి రఘు రెండెకరాల్లో జొన్న, ఎకరంలో మొక్కజొన్న సాగు చేశారు. వారం క్రితం వరకు రెండు బోర్లు ద్వారా నీరందిస్తూ వస్తున్నారు. ఒక్కసారిగా భూగర్భజలాలు పడిపోయి ఒక బోరు వట్టిపోయింది. మరో బోరులో సన్నని ధారగా నీరొస్తుంది. చేతికొచ్చిన జొన్న పంటకు నీరందక ఎండిపోతోంది.

# పెరగాలి వేగం.. చేరాలి లక్ష్యం



పెద్దపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో రవాణా కష్టాలు తీర్చేందుకు జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన సిమెంటు రహదారుల నిర్మాణానికి ఓ వైపు గడువు సమీపిస్తుండగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రతి సంవత్సరం మార్చిలో నిధులు విడుదలయ్యేవి. ఈ ఏడాది ముందస్తుగా జనవరిలో కేటాయించినా ఆశించిన మేర ప్రగతి లేదు. గతేడాది చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యంతో గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 20 రోజుల సమయమే ఉండటంతో గడువులోగా పనులు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ పెంచారు.

**అదనపు కేటాయింపులతో ఆలస్యం**

జిల్లాలో తొలి విడతలో 104 రోడ్లకు రూ.6.17 కోట్లు మంజూరయ్యాయి. అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలకు రూ.11.30 కోట్లు కేటాయించారు. అయితే గడువులోగా భవనాల నిర్మాణం సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం ఆ నిధులను సిమెంటు రహదారులకు మళ్లించింది. మరో రెండు విడతల్లో 113 పనులకు అనుమతి లభించింది. ఈ సారి ముందస్తుగా నిధులు రావడంతో సంపూర్ణ ప్రగతే లక్ష్యంగా నిర్మాణాల్లో వేగం పెంచారు. భవనాలకు కేటాయించిన నిధులను సీసీ రోడ్లకు మళ్లించడంతో అదనపు పనులు ఆలస్యమవుతున్నాయి.

**త్వరగా బిల్లులు చెల్లిస్తేనే ఫలితం**

గత తప్పిదాలు పునరావృతం కాకుండా అధికారులు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

ఒకే గుత్తేదారు పలు చోట్ల పనులు చేపట్టడంతో కూలీలు, సామగ్రి కొరత ఏర్పడింది.

పనుల ప్రగతి ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తే త్వరితగతిన పూర్తి కానున్నాయి.

పనులు పూర్తయిన చోట కూడా ఇప్పటివరకు పైసా చెల్లించకపోవడంతో మిగతా చోట్ల ఆలస్యమవుతోంది.

ప్రగతిపై నిరంతర సమీక్ష

పల్లెల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రగతిపై నిరంతరం సమీక్షిస్తున్నారు. జిల్లాలో మొత్తం 217 రోడ్లకు 152 చోట్ల పనులు ప్రారంభించారు. వీటిలో 62 మాత్రమే పూర్తయ్యాయి. మరో 65 పనులు ప్రారంభించాల్సి ఉంది. ధర్మారంలో 24 పనులకు 11, పెద్దపల్లిలో 25కు 10 రోడ్లు పూర్తయ్యాయి. లోపాలను గుర్తించి అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన ఇరవై రోజుల్లో 155 పనులు పూర్తి కావాల్సి ఉంది. హడావుడిగా పనులు చేస్తుండటంతో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. గడువు సమీపించిన నేపథ్యంలో పనులు మన్నికగా జరిగేలా పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

**గడువులోగా పూర్తి చేస్తాం**

జిల్లాలో సిమెంట్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాం. అదనంగా మంజూరైన నిధులకు సంబంధించి త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రారంభిస్తున్నాం. లోపాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పూర్తయిన పనులకు వెంటది వెంట బిల్లులు చెల్లించేందుకు ఆన్‌లైన్ చేస్తున్నాం. గిరీశ్‌బాబు, పంచాయతీరాజ్ ఈఈ

# మరణ ధ్రువీకరణ.. ఆలస్యంగా విచారణ



కరీంనగర్ : జిల్లాలోని పురపాలికలు, నగరపాలికలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతోంది. ఆసుపత్రుల నుంచి వచ్చే నివేదికల ఆధారంగా ఆన్‌లైన్‌లో రికార్డులు ఉంటే ఎలాంటి సమస్యలు ఉండటం లేదు. రికార్డుల్లో లేకుండా ఆన్‌లైన్ లేని వాటికి అన్ని రకాల పత్రాలు తీసుకొని దరఖాస్తు చేసే వరకు దరఖాస్తుదారులు ముప్పు తిప్పలు పడుతున్నారు. ముఖ్యంగా మరణ ధ్రువీకరణ పత్రం పొందాలంటే రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

ఇంటి వద్ద అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన వారు మార్గమధ్యలో చనిపోతే ఆసుపత్రి రికార్డులో ఉండదు. వీటికి నేరుగా నగర, పురపాలికల్లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దీనికోసం ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల వాంగ్మూలం, నోటరీ, చనిపోయిన వారి ఆధార్‌కార్డు, దరఖాస్తుదారుడి ఆధార్‌కార్డులపై గెజిటెడ్ సంతకం చేసి, దరఖాస్తు పూరించి నగర పాలికల్లో అయితే ఇన్‌వార్డులో ఇవ్వాలి. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాత రికార్డులో నమోదు చేస్తారు.

**ఆన్‌లైన్ నమోదులో జాప్యం..**

నగర పాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లకు 60 మంది వార్డు అధికారులు ఉన్నారు. ఆయా డివిజన్లకు సంబంధించిన అన్ని పనులు వీరే చూడాల్సి ఉంటుంది. నెల రోజుల నుంచి మరణ ధ్రువీకరణల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతోపాటు విలీన గ్రామాలకు సంబంధించినవి కూడా ఆయా ఇన్‌ఛార్జి వార్డు అధికారులే పరిశీలించాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.నెలకు సుమారు 300 దరఖాస్తులు మరణ ధ్రువీకరణలకు దరఖాస్తులు వస్తుండగా, ఇందులో డివిజన్‌కు అయిదారు ఉంటాయని చెబుతున్నారు. కొందరు వార్డు అధికారులు ఇన్‌వార్డులో వచ్చిన దరఖాస్తులు తీసుకెళ్లి విచారణ చేయడంలేదు. ఒకవేళ చేసినా అందులో కావాల్సిన పత్రాలను నామమాత్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఒక్కో దరఖాస్తు రోజుల తరబడి పెండింగ్ ఉంటుండగా, ఆన్‌లైన్‌లోకి నమోదు చేయడానికి పది రోజుల సమయం పడుతుందని తెలిసింది.

**ఎన్నాళ్లీ అవస్థలు**వార్డు అధికారులకు మరణ ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు కొందరికి అవగాహన లేకపోవడంతో దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో నగరవ్యాప్తంగా మొత్తం ఏడుగురు జవాన్లు ఉండగా ఏ రోజుకారోజు విచారణ చేసి జనన, మరణ ధ్రువీకరణ విభాగంలో అప్పగించే వారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోనే వారం రోజుల్లోనే మీసేవ ద్వారా మరణ ధ్రువీకరణ తీసుకోవడానికి వీలు ఉండేది. ప్రస్తుతం అలా లేకపోవడం, వార్డు అధికారి ఎవరో డివిజన్ ప్రజలకు తెలియకపోవడం, విచారణలో జాప్యం చేస్తున్నారు.

**వార్డు అధికారులను ఆదేశించాం**

వార్డు అధికారులు ఆయా డివిజన్లలో మరణ ధ్రువీకరణ దరఖాస్తులు వెంటనే తీసుకెళ్లి విచారణ చేయాలని ఆదేశించాం. వారం రోజుల్లోనే జారీ చేయాల్సి ఉంటుందనే విషయాన్ని వారికి వివరించాం. ఎమ్మెల్సీ ఎన్నికల విధులు ఉండటంతో జాప్యం జరిగింది.మల్లీశ్వరి, ఏఎస్‌వో, కరీంనగర్ నగరపాలిక

# వినియోగం పెరిగి.. నియంత్రికలు కాలి

భానుపురి : వేసవికి ముందే జిల్లాలో నియంత్రిక కాలిపోతున్నాయి. ఫిబ్రవరి నెలలో ఎండలు పెరిగిన నేపథ్యంలో జిల్లావాసులు విద్యుత్తును అధికంగా వినియోగించారు. ఈ కారణంగా నియంత్రికలపై భారంపడి కాలిపోయాయి. అధికారులు వాటిస్థానంలో ఎప్పటికప్పుడు కొత్తవి ఏర్పాటు చేశారు. సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

**వెంటనే మరమ్మతులు**జిల్లాలో వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు అధికారులు నియంత్రికల ను సిద్ధంగా ఉంచారు. గ్రామాలు, పట్టణాలు, వ్యవసాయ బావుల వద్ద కాలిపోయిన చోట వెంటనే ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు కావాల్సిన ఉంటే వారికి వెంటనే సిద్ధం చేస్తున్నారు. వేసవి ముగిసే వరకు విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. కాలిపోయిన నియంత్రికలను శాంతినగర్‌లోని మరమ్మతు కేంద్రంలో వెంటనే చేయిస్తున్నారు. జిల్లాలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా ఎప్పటిప్పుడు చర్యలు తీసుకుంటామని ఎస్ఈ బి.ఫ్రాంక్లీన్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**ఇదీ పరిస్థితి..**

జిల్లాలో 4,51,501 గృహ, 1,40,584 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. గత నెలలో భానుడు ప్రతాపం చూపటడంతో జిల్లాలో



విద్యుత్తు వినియోగం పెరిగింది. ఫిబ్రవరి చివరి నాటికి రోజువారీగా కలుపుకొని మొత్తం 327 మిలియన్ యూనిట్లు వినియోగించారు. ఈ కారణంగా 296 నియంత్రికలు కాలిపోయాయి. వీటిలో 3పీహెచ్ 208, 1పీహెచ్ 88 నియంత్రికలు కాలిపోయాయి. వ్యవసాయానికి కాల్వ నీరు రాకపోవడంతో చాలామంది రైతులు బోర్లపై ఆధారపడ్డారు. పడావు పడిన బోర్లను కూడా మరమ్మతు చేయించి వ్యసాయానికి వినియోగించారు. ఈ కారణంగా విద్యుత్తు నియంత్రికలపై భారం పడి కాలిపోయాయి. విద్యుత్తు అధికారులు ఎక్కడా సరఫరాలో అంతరాయం లేకుండా కాలిపోయిన నియంత్రికల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు.

# వన్యప్రాణులకు ప్రత్యేక వంతెనలు

ఆదిలాబాద్ : మనుషుల అవసరాల కోసం అడవుల మధ్య నుంచి రోడ్లు వేసుకుంటే.. జంతువులకు ఇబ్బంది కదా! అందుకే వాటి తోవలను వాటికి వదిలేస్తూ.. రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో రోడ్లు దాటుతున్న సమయంలో వాహనాలు తగిలి వన్యప్రాణులు చనిపోతున్నాయని గుర్తించిన ప్రభుత్వం జంతువులు ఎక్కువగా దాటే జాతీయ రహదారులపై ఓవర్‌పాస్, అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతోంది. ఇలాంటి వంతెనలు తెలంగాణలో తొలిసారిగా మంచిర్యాల–చంద్రాపూర్(63), జగిత్యాల – భీవండి(61) జాతీయ రహదారులపై జంతువుల కోసం ప్రత్యేకంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

**జంతువుల సంరక్షణే ధ్యేయంగా..**

మహారాష్ట్ర నుంచి తెలంగాణ అటవీ ప్రాంతానికి జంతువుల రాకపోకలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి మీదుగా జంతువులు వెళుతుంటాయి. ఇందులో భాగంగా వన్యప్రాణుల రాకపోకలతో పాటు వాటికి ప్రమాదం జరగకుండా ఉండేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా మంచిర్యాల – చంద్రాపూర్ జాతీయ రహదారిపై వాంకిడి సమీపంలో రూ.30 కోట్ల వ్యయంతో పర్యావరణ వంతెన(ఓవర్‌పాస్ ఎకో బ్రిడ్జి) నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కింది నుంచి వాహనాలు వెళ్తుంటే పైనుంచి జంతువులు వెళ్లేలా దీన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మహారాష్ట్రలోని భీవాండి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిపై జంతువుల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని ఖానాపూర్ పరిధిలో అండర్‌పాస్ వంతెనల నిర్మాణం జరుగుతోంది.

ఏటా 3 వేల జంతువుల మరణం

రోడ్డు దాటే సమయంలో చనిపోతున్న జంతువులపై మహారాష్ట్రకు చెందిన అశ్వమేధ ప్రతిష్ఠాన్ అనే సంస్థ సర్వే నిర్వహించింది. జాతీయ



రహదారి పొడవునా మహారాష్ట్రలోనే మూడు వేల జంతువులు చనిపోతున్నాయని గుర్తించినట్లు సంస్థ అధ్యక్షుడు అవినాష్ తెలిపారు. మృతి చెందిన వాటిలో చిరుత, ఎలుగుబంట్లు, జింకలు 20కిపైగా ఉండగా, మిగిలినవి చిన్న చిన్న జంతువులని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో నిర్మాణమయ్యే జాతీయ రహదారులపై ఏయే ప్రాంతాల్లో అండర్‌పాస్ వంతెనలు అవసరమనేది నివేదించినట్లు ఆయన తెలిపారు.

**నాలుగు చోట్ల..**

మహారాష్ట్ర భీవండి నుంచి నిర్మల్ మీదుగా జగిత్యాల వరకు 758 కి.మీ దూరం జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తెలంగాణలో 57 కి.మీ దూరం పొడవునా, నిర్మల్, ఖానాపూర్, మల్లపురం, రాయికల్, జగిత్యాల వరకు జరిగే జాతీయ రహదారి పనుల్లో ఖానాపూర్ సమీపంలో అటవీ ప్రాంతం నుంచి వెళుతుంది. గతంలో ఉన్న రోడ్డు దాటే సమయంలో వన్యప్రాణులకు హాని కలగడం, రోడ్డు దాటే జంతువుల కారణంగా కొద్ది దూరంలో ఆగి వేచిచూడటం, కొన్ని సార్లు జంతువుల దాడికి గురైన సందర్భాలు ఉన్నాయి. జంతువుల సంరక్షణను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం అటవీశాఖ అధికారుల ప్రతిపాదనల మేరకు వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా, పైనుంచి వాహనాలు, కింది నుంచి జంతువులు వెళ్లేందుకు వీలుగా రూ.42 కోట్ల వ్యయంతో నాలుగు ప్రాంతాల్లో అండర్ పాస్ వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు చోట్ల కి.మీ పొడవునా, మరో రెండు చోట్ల తక్కువ దూరంతో బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోంది.

# అడవుల జిల్లా ఆకాంక్ష.. విశ్వవిద్యాలయం

నిర్మల్ : అభివృద్ధిలో అట్టడుగున ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇతర ప్రాంతాలతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉంది. ముఖ్యంగా చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన ఈ ప్రాంతంలో ఉన్నత విద్యావకాశాలు లేకుండా పోతున్నాయి. ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయ ఏర్పాటు ఇప్పటికీ తీరని కలగా మారింది. ఎప్పటికప్పుడు పాలకులు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని ప్రకటిస్తున్నా ఆచరణలో విఫలమవుతున్నారు.

**నీరుగారుతున్న లక్ష్యం**

ప్రతీ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని 2007లో నేషనల్ నాలెడ్జ్ కమిషన్ సూచించింది. ఈ మేరకు శ్రీ జ్ఞానసరస్వతి విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ నిర్ణయం తీసుకున్నారు. కానీ రాజకీయ పరిణామాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి యూనివర్సిటీ ఏర్పాటుకోసం ఉద్యమాలు సాగుతూనే ఉన్నాయి. విశ్వవిద్యాలయ సాధనసమితి ఆధ్వర్యంలో కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ, పలువురు ముఖ్యమంత్రులతో పాటు ఉన్నత విద్యామండలికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండాపోయింది.

**ప్రణాళిక దశలో నిలిచిన సీఎం హామీ**

గత ప్రభుత్వం జిల్లాలో విశ్వవిద్యాలయ ఏర్పాటును విస్మరించింది. కాంగ్రెస్ కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు జిల్లా పర్యటనకు వచ్చినపుడు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. తర్వాత ఉన్నత విద్యాశాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో కొత్తగూడెంలో మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చేందుకు నివేదిక రూపొందించాలని ప్రభుత్వం తాజాగా ఉన్నత విద్యామండలికి ఆదేశాలు జారీచేసింది. అదే సమయంలో ఆదిలాబాద్ విషయం మాత్రం పక్కన పెట్టేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్రంగా కలత చెందుతున్నారు.

**ఈ సమావేశాలే కీలకం**1991లో నిర్మల్ పట్టణంలో ప్రారంభమైన కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలను ఉన్నతీకరించేందుకు గతంలోనే ప్రతిపాదించి, అనుమతించి, నిధులు మంజూరు చేసినా స్థానిక నేతల వైఫల్యంతో కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో సానుకూల ప్రకటనలు చేసిన తరుణంలో నిర్మల్ కళాశాలను ఉన్నతీకరణకు అవకాశాలు సుగమమయ్యాయి. దీనికోసం ప్రస్తుతం జరగబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో తగిన నిధులు కేటాయించడం కీలకంగా మారనుంది. ప్రభుత్వం చొరవచూపి బడ్జెట్ కేటాయిస్తే శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరణ జరుగుతుంది. ఇక్కడ సాధ్యం కాని పక్షంలో ఉమ్మడి జిల్లాలో ఇతర ప్రాంతంలోనైనా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు వచ్చే బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని, ఇది అత్యవసరమే కాదు జిల్లావాసులకు ఎంతో ఆవశ్యకమని శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితి అధ్యక్షుడు నంగె శ్రీనివాస్ పేర్కొన్నారు. **విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భాజపా శాసనసభాపక్షనేత, నిర్మల్**విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. ఉమ్మడి జిల్లాలో విద్యారంగ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు అంతంతే. యూనివర్సిటీ ఏర్పాటు అందరి కల. గత పాలకులు విస్మరించారు. ఉట్నూరు కేంద్రంగా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తామన్నా ఆచరణలోకి రాలేదు. నిర్మల్‌లోని యూనివర్సిటీ పీజీ కళాశాల ఉన్నతీకరణ నిలిచిపోయింది. ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క సొంత జిల్లాకే ప్రాధాన్యమిస్తు న్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సహకరించాలి. **నిధులు కేటాయించాలి అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన జిల్లాను విస్మరించడం సరికాదు.

# అక్రమార్కులు.. ఆటవిక తవ్వకాలు

నంద్యాల : గనులకు నిలయమైన డోన్ ప్రాంతంలో ఖనిజాల అక్రమ తవ్వకాలకు అంతే లేకుండాపోతోంది. అక్రమార్కులు అటవీ భూములను ఇష్టానుసారం తవ్వేసి ఖనిజాలు కొల్లగొడుతున్నారు. భారీ యంత్రాలను పెట్టి తవ్వకాలు సాగిస్తున్నా అటవీ, మైనింగ్, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అక్రమార్కులకు రాజకీయ అండ ఉండటంతో అధికారులు చర్యలకు వెనకాడుతున్నారు. దీంతో ఖనిజాల దోపిడీ పక్కా ప్రణాళికతో సాగుతోంది.

**నిషేధిత ప్రాంతంలో దందా**

డోన్ అటవీ ప్రాంతంలో డోలమైట్, క్వార్ట్జ్, వైట్‌క్లే, ఇనుప ఖనిజం, తెల్లసుద్ద అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా ఖనిజాలు వెలికితీస్తున్నారు. డోన్, ప్యాపిలి మండలాల్లోని నిషేధిత అటవీ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా ఈ దందా కొనసాగుతోంది. డోన్ మండలం కొచ్చెరువు అటవీ ప్రాంతంలో డోలమైట్, తెల్లసుద్ద ఖనిజాలను వెలికితీస్తున్నారు. ధర్మవరం- కమలాపురం గ్రామాల మధ్య, కన్నప్పకుంట సమీపంలో ఎర్రమట్టిని కొల్లగొడుతున్నారు. వెంకటనాయనిపల్లె సమీపంలో జోరుగా తవ్వకాలు సాగుతున్నాయి.

ప్యాపిలి మండలం కొమ్మెమర్రిలో వైట్‌క్లేను దోచుకునేందుకు పెద్దఎత్తున గుంతలు తవ్వారు.

**అక్రమాలకు గేట్లెత్తిన వైకాపా**

గతంలో ప్రభుత్వ ఆధీనంలో పర్మిట్లు ఇచ్చిన సమయంలో రవాణా చేసే వాహనాలకు జియోట్యాగింగ్ కచ్చితంగా ఉండేది. దీంతో ఈసీ, ఇతర అనుమతులు లేని క్వారీల నుంచి ఖనిజాల ఎగుమతులకు అధికారులు అనుమతించేవారు కాదు. గత వైకాపా ప్రభుత్వంలో



వసూళ్ల బాధ్యతను ఓ సంస్థకు అప్పగించారు. ఇదే అదనుగా ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్న అక్రమార్కులు అక్రమంగా తవ్విన ఖనిజాన్ని దొడ్డిదారిన రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**మోసాల్లో ఘనులు**

అక్రమార్కులు మోసాల్లో ఆరితేరారు. అటవీ ప్రాంతాల్లో తవ్విన ఖనిజాన్ని పక్కనే ఉన్న ప్రైవేటు భూముల్లో నిల్వ చేస్తున్నారు. ఒకవేళ అధికారులు ప్రశ్నిస్తే లీజు ప్రాంతంలో వెలికి తీసినదని బుకాయిస్తున్నారు. ప్యాపిలి మండలం కొమ్మెమర్రిలో అటవీ భూములు అనుకుని సర్వే నంబరు 763లో 42 ఎకరాల ప్రైవేటు భూమి ఉంది. ఇందులో పెద్దఎత్తున వైట్‌క్లేను నిల్వ చేస్తున్నారు. అధికారులు తనిఖీ చేసినా ఇబ్బందులు రాకుండా మొదట ఇక్కడ నిల్వ చేసి అవసరమైన మేరకు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

డోన్, ప్యాపిలి మండలాల్లో తవ్విన వైట్‌క్లేను డోన్ నియోజకవర్గంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఎర్రమట్టిని ప్రైవేటు వెంచర్లు, లేఅవుట్లకు, గుంతలు పూడ్చడానికి ఉపయోగిస్తున్నారు. తెల్లసుద్దను పౌడర్ పరిశ్రమలకు రవాణా చేస్తున్నారు.

తవ్వకాలు అక్కడ.. చూపేది ఇక్కడ

అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న వారు డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో ఏళ్లుగా అనుమతులున్న క్వారీలను నిర్వహిస్తున్నారు. క్వారీల పేరుతో అటవీ భూముల్లో తవ్వకాలు సాగిస్తున్నారు. అక్రమంగా తవ్విన ఖనిజాన్ని లీజు ఉన్న ప్రాంతాల్లో తవ్వినట్లు చూపుతూ రవాణా చేస్తున్నారు. అధికారుల కళ్లుగప్పి పరిశ్రమలకు చేరవేస్తున్నారు. గతే ఏడాది ప్యాపిలి మండంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా తవ్విన ఐరన్‌ఓర్‌ను వైకాపా నాయకులు ప్రైవేటు స్థలాల్లో పెద్ద ఎత్తున నిల్వ చేశారు. ఎన్నికల ఫలితాలకు కొద్దిరోజుల ముందు ఈ నిల్వలను హడావుడిగా తరలించి సొమ్ము చేసుకున్నారు.

# మారిన నేల.. మారని ఖాతా

కర్నూలు : కల్లూరు మండలం దూపాడు గ్రామ పరిధిలో సర్వే నంబరు-85ఏలో స్థిరాస్తి వెంచరు వేసి ప్లాట్లు విక్రయించారు. రెవెన్యూ దస్త్రాల్లో మాత్రం సాగు భూమిగానే ఉంది. 12 సబ్ డివిజన్లు చేశారు. కేవలం రెండింటికి " 3 లక్షల ఖాతాలు ఇవ్వగా.. ఒక సబ్ డివిజన్ వివాదాస్పదంగా ఉందని 2 లక్షల ఖాతా ఇచ్చారు. ఓ మహిళ పేరున 4.08 ఎకరాలను ఆరు సబ్ డివిజన్లు చేశారు. పచ్చని పొలాలు వెంచర్లుగా మారుతున్నాయి. రంగు రంగు రాళ్లు పాతి ప్లాట్లు విక్రయిస్తున్నారు. భూమార్పిడి చేయకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో ఉమ్మడి జిల్లా ఉంది. కుడా అనుమతి లేకనే స్థలాల విక్రయాలు జరుగుతున్నాయి. ఆయా సర్వే నంబర్లు రెగ్యులర్ ఖాతాలుగానే వెబ్‌ల్యాండ్‌లో ఉంటున్నాయి. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తుల పేర్లు సాగుదారులుగా ఉండిపోతున్నాయి. పంట నమోదు.. రుణాలు, పెట్టుబడి సాయం.. ఇతర వ్యవసాయ రాయితీ పథకాలను రియల్టర్లు పొందుతున్నారు. వాస్తవంగా వ్యవసాయ భూముల విస్తీర్ణం తగ్గిపోతున్నప్పటికీ రెవెన్యూ రికార్డులు, వెబ్‌ల్యాండ్‌లో అలానే ఉంటున్నాయి.

**ఎనిమిది వేల ఎకరాలు**గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాయకుల అనుయాయులు పెద్దఎత్తున స్థిరాస్తి వ్యాపారాలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి భూ మార్పిడి ఫీజు చెల్లించకుండా.. కుడా అప్రూవల్ లేకుండా లేఅవుట్లు వేసి దోచుకున్నారు. నాలుగేళ్ల కిందట 600కుపైగా అనధికారిక లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో 2 వేలకుపైగా అనధికారిక లేఅవుట్లు ఉన్నట్లు సమాచారం. ఎకరా రూ.కోటికిపైగా పలుకుతోంది. స్థిరాస్తి వ్యాపారులు రూ.కోట్ల విలువ చేసే భూములను కొనుగోలు చేసి కుడా అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు.

అనధికారిక లేవుట్ల కారణంగా 3 శాతం ఫీజు రూపంలో రావాల్సిన రూ.60 కోట్లకుపైగా నిధులు ప్రభుత్వ ఖజానాకు జమకాకుండా పోయింది. **'కూటమి' ప్రభుత్వం దృష్టి**

ప్రభుత్వ మార్కెట్ విలువ ఆధారంగా భూమార్పిడికి సంబంధించి గతంలో గ్రామాల్లోని భూములకు 2 శాతం, పట్టణాల్లో మూడు శాతం ఫీజు ఉండేది. దానిని వైకాపా ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో 5 శాతానికి పెంచింది. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సచివాలయం, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే అవి తహసీల్దారు లాగిన్‌కు వెళ్తాయి. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆర్డీవో, సబ్ కలెక్టర్‌కు పంపుతారు. నిబంధనలకు అనుగుణంగా ఉంటే వారు ఆమోదించాలి. లేదంటే తిరస్కరించాలి. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల గడువులోగా ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే అట్టి దరఖాస్తులు డీమ్డ్ అప్రూవ్డ్ అవుతాయి. దీంతో కొనుగోలు చేసిన భూములతోపాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములు, పంట కాల్వలు, పోరంబోకు భూములు ఆటోమేటిక్‌గా రియల్టర్ల పరమవుతాయి.

# రవాణా.. కాలయాపన



ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలేనికి చెందిన ఓ రైతు గత ఏడాది రబీలో తాను పండించిన 65 బస్తాల ధాన్యం సొంత వాహనంలో ఆర్ఎస్‌కే ద్వారా మిల్లుకు పంపించారు. ధాన్యంలో తేమ ఉందని.. తూకంలో తేడా వచ్చిందని.. దిగుమతి చేసుకోవడానికి నానా ఇబ్బందులు పెట్టారు. విసుగు చెందిన ఆ రైతు చివరకు దళారులకు విక్రయించాడు.

ఐ.పోలవరం మండలం కేశనకుర్రులో గత ఖరీఫ్ సీజన్‌లో బొంతు దుర్గారావు కొనుగోలు కేంద్రాన్ని సంప్రదించగా రవాణా వాహనం సమకూర్చుకోవాలని చెప్పారు. ఆ ఇబ్బందులు పడలేక గిట్టుబాటు ధర కంటే బస్తాకు రూ.200 తక్కువకు దళారులకు విక్రయించాడు. 50 బస్తాలకు రూ.10 వేల వరకు ఆయన నష్టపోవాల్సి వచ్చింది.

అన్నదాతకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వైకాపా పాలనలో నిబంధనలు అటకెక్కించారు. మిల్లర్లు, దళారులదే పైచేయిగా నిలిచేది. కూటమి వచ్చాక గత ఖరీఫ్ సీజన్ నుంచి కొనుగోలు సులభతరం చేసింది. 48 గంటల్లో రైతులకు డబ్బులు వేస్తున్నారు. రవాణా వాహనాల విషయంలో మాత్రం మిల్లర్ల మాయ కొనసాగుతోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తరలింపునకు వాహనాల ఏర్పాటుపై అధికారులు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాల్సి ఉంది.

**కూటమి అధికారంలోకి వచ్చాక..**

కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో మార్పులు చేసింది. రైతులు కోరుకున్న మిల్లులకే ధాన్యం విక్రయించవచ్చు. 48 గంటల్లో ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. రవాణా వాహనాలను సమకూర్చడంలో సమస్యలను పరిష్కరిస్తే మరింత ప్రయోజనం.

**దళారులను ఆశ్రయించి..**

ఆర్ఎస్‌కేల ద్వారా రైతుల నుంచి సరకు కొనుగోలు చేసినా వాటిని మిల్లులకు తరలించడానికి వాహనాలు పంపించడం లేదు. రైతులే వాహనాలు ఏర్పాటు చేసుకోవాల్సి రావడంతో ఆ పాట్లు పడలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. ఎక్కడైనా రైతు ధైర్యం చేసి సొంతంగా వాహనంతో మిల్లులకు తరలిస్తే అక్కడ సరకు దించేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంబంధంగా పనిచేసే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) ద్వారా సంచులు, హమాలీ, రవాణా వాహనాలను సమకూర్చాల్సి ఉంది. ఈ ప్రక్రియ క్షేత్ర స్థాయిలో సక్రమంగా జరగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బస్తాకు రూ.200కు పైగా తగ్గించి దళారులకు విక్రయిస్తున్నారు.

**వాహనాలు సిద్ధం చేస్తున్నాం..-ఎం.బాలసరస్వతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు**

రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రవాణా వాహనాలను ఏర్పాటు చేస్తున్నాం. రైతు సేవా కేంద్రాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను బట్టి వాహనాలు, గోనె సంచులు అందుబాటులో ఉంచుతున్నాం. ఎవరైనా రైతులు సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకుని ఆర్ఎస్‌కేల్లో నమోదు చేసి మిల్లులకు తరలిస్తే రవాణా ఛార్జీలు చెల్లిస్తాం.

**జిల్లాలో పరిస్థితి...**

రబీలో సాగు విస్తీర్ణం: 1.64 లక్షల ఎకరాలు

దిగుబడి అంచనా: 6.17 లక్షల టన్నులు

కొనుగోలు లక్ష్యం: 3.22 లక్షల టన్నులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు: 404

# అత్యవసరమే.. కాస్త ఆలోచించండి!



కొవ్వూరు : తూర్పు గోదావరి జిల్లాలో 50 పడకలతో ఉన్న ఏకైక సామాజిక ఆరోగ్య కేంద్రం కొవ్వూరు. దీనిని ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయి పెంచుతారని పదహారేళ్లుగా ఎదురు చూస్తున్నా ఆ ప్రక్రియ పట్టాలెక్కడం లేదు. జిల్లా ఆసుపత్రిగా (150 పడకలు) తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత, అత్యవసరం ఉన్నా ఆ దిశగానూ అడుగు పడడం లేదు. ప్రజాప్రతినిధుల ప్రకటనలు, అధికారుల విశ్లేషణలు నివేదికలకే పరిమితమవుతున్నాయి. జిల్లాల పునర్విభజనతో జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి కార్యాలయం కొవ్వూరు రావడం తప్ప ఈ ఆసుపత్రికి ఒరిగిందేమీ లేదు. రెండేళ్లలో జరిగే పుష్కరాల కార్యాచరణలోనైనా జిల్లా ఆసుపత్రి కల సాకారం కావాలని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

**హంగులన్నీ ఉన్నా..**

తూర్పు గోదావరికి ప్రస్తుతం ప్రాంతీయ ఆసుపత్రి లేదు. ఒకవేళ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆ స్థాయి ఇవ్వాలంటే అన్ని సౌకర్యాలు, అనువైన పరిస్థితులు ఉన్నది కొవ్వూరు సీహెచ్‌సీకి మాత్రమే. 50 పడకలతో ఉన్న సేవలందించేందుకు 100 పడకలు సిద్ధంగా ఉన్నాయి. వైద్య సేవలు, పాలన, శస్త్రచికిత్సలు, ఇతర అవసరాలకు సరిపడా భవనాలు, గదులు, సువిశాల ప్రాంగణం ఉంది.

**అత్యవసర సేవల కోసం..**

కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో జాతీయ రహదారి ఉంది. నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గోదావరి ఉండటంతో గల్లంతులు, ఆత్మహత్యలు, ప్రమాదాలు జరుగుతుంటాయి.

**ఆ భవనాలన్నీ ఆసుపత్రివే..**

సీహెచ్‌సీకి రెండు అంతస్తుల భవనాలు, అధునాతన రీతిలో సౌకర్యాలు ఉన్నాయి. డీసీహెచ్ఎస్ కార్యాలయ భవనం, పీపీ యూనిట్ ఇతర విభాగాలున్న భవనాలన్నీ ఆసుపత్రికి చెందినవే.

**జిల్లా స్థాయికి పెంచితే..**

కొవ్వూరు సీహెచ్‌సీకి నెలకు సుమారు 5 వేల మంది ఓపీ, 500 మంది ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఏడుగురికిగాను అయిదుగురే ఉన్నారు. జిల్లా స్థాయికి మారితే 16 మంది వస్తారు. ఇంకా అనేక మంది సమకూరడానికి అవకాశం ఉంది. ః చర్మవ్యాధులు, ఈఎన్‌టీ, మానసిక, అనస్తీషియా, రేడియాలజీ వైద్య నిపుణులు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఐసీయు, ట్రామాకేర్ వంటి పరీక్షలు, సేవలతోపాటు రక్త నిధి కేంద్రం సౌకర్యాలు ఒనగూరతాయి.

**ఇప్పటికే పలు మార్లు నివేదించారు..- డాక్టర్ ఎం.పద్మ, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారిణి**

50 పడకలతో ఉన్న కొవ్వూరు సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రికిగా మార్చాల్సిన అవశ్యకతపై గతంలో ఉన్నతాధికారులకు పలుమార్లు నివేదించాం. సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

# ఎత్తిపోతలు.. ఉత్త చేతలు

బొబ్బిలి: జిల్లాలోని మెట్ట భూములకు ఖరీఫ్‌లో కన్నీరే మిగులుతోంది. వీటిని సాగులోకి తీసుకువచ్చేందుకు తలపెట్టిన ఎత్తిపోతల పథకాలు నీరుగారిపోతున్నాయి. వీటిని గాడిలోకి తీసుకొస్తామని గత అయిదేళ్లు ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. కూటమి ప్రభుత్వంలోనైనా పథకాలపై దృష్టి పెట్టాలని రైతులు విన్నవిస్తున్నారు. తెర్లాంలోని తోటపల్లి ప్రధాన కాలువల వద్ద, బొబ్బిలి మండలం రాముడువలసలోని కాలువపై ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి గత తెదేపా హయాంలోనే దాదాపు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. ఆపై వచ్చిన వైకాపా గాలికి వదిలేసింది. ఈ సమస్యను ఇటీవల ఎమ్మెల్యే బేబినాయన అసెంబ్లీలో ప్రస్తావించారు. రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద వేగావతి నది ఒడ్డున ఉన్న పథకం మూడేళ్లుగా పనిచేయడం లేదు. సుమారు 400 ఎకరాలకు ఆధారం. బీ బాడంగి మండలం వాడాడలో వేగావతి ఒడ్డున నిర్మించిన పథకం ద్వారా 200 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. నీటి లభ్యత ఉన్నా నిర్వహణ సక్రమంగా లేదు. ఎస్.కోట మండలం వేములాపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా 300 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఇది పని చేయలేదు. రైతుల ఫిర్యాదు మేరకు ఇటీవల మరమ్మతులు చేపట్టినా ప్రైవేటు పొలాల్లో విద్యుత్తు స్తంభాలు వేయడంతో వివాదం రేగి, వినియోగంలోకి రాలేదు. గజపతినగరం మండలం లింగావలస పథకం మోటార్లు తుప్పుపట్టాయి. 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సి ఉన్నా.. ఏనాడూ పనిచేయలేదు. దీని పరిధిలోని రైతులు కరవు పరిస్థితులను చవిచూస్తున్నారు. ఏడొంపులగెడ్డ పరివాహకంలో నిర్మించారు. **కమిటీల ఏర్పాటు గాలికి..**

వాస్తవానికి ఆయకట్టు రైతులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను అప్పగించాలి. అలా చేయకుండా గాలికి వదిలేయడంతో మోటార్లు పాడవుతున్నాయి. నదుల్లోకి వరద వస్తే మోటార్లు కొట్టుకుపోతున్నాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యుత్తు ఛార్జీలు బకాయి ఉన్నాయి. ఆయకట్టు కమిటీలు నిర్వహణకు అయ్యే 20 శాతం ఖర్చు భరిస్తే మిగిలిన 80 శాతం ప్రభుత్వం భరించాల్సి ఉంది. కానీ అధికారులు దీనిపై రైతులకు అవగాహన కల్పించడం లేదు.

# ఎలుకల మందు.. గుత్తేదారు విందు

కర్నూలు : " నిత్యం 3 వేల మంది ఓపీ.. మూడు వందల మంది (ఐపీ).. చికిత్స పొందుతున్న సర్వజన ఆసుపత్రిలో 428 మూషికాలు రూ.60 లక్షలు తినేశాయి.. అవును మీరు చదివింది నిజమే..!"కర్నూలు సర్వజన వైద్యశాలలో క్రిమికీటకాల నియంత్రణకు సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ (ఎస్ఎస్‌పీ)ని 2015 నుంచి అమలు చేస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందే రోగులకు ఎలుకలు, దోమలు, పాముల బెడద లేకుండా చూడటమే ఎస్ఎస్‌పీ ప్రధాన లక్ష్యం. ఇందుకు ద్రావణాల పిచికారీతోపాటు ఎలుకలు, పాములు తదితరాలు రాకుండా గుత్తేదారుడు చర్యలు తీసుకోవాలి. ఫాగింగ్, స్ప్రే ట్యాంకర్ల ద్వారా ఎప్పటికప్పుడు ద్రావణాలు పిచికారీ చేస్తూ ఉండాలి. 2019 నుంచి హైదరాబాద్‌కు చెందిన సాయి సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు ఎస్ఎస్‌పీ నిర్వహణ బాధ్యతలను సర్వజన ఆసుపత్రి అధికారులు అప్పగించారు. సదరు గుత్తేదారు మూషికాలు పట్టుకొన్నట్లు దొంగ లెక్కలు రాసుకొని రూ.లక్షలు వెనకేసుకొంటున్నారు. గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 428 ఎలుకలు పట్టుకున్నట్లు.. ఒక్కోదానికి రూ.14 వేలు ఖర్చు చేసినట్లు గుత్తేదారుడు చూపడం గమనార్హం.

**ప్రతి నెలా రూ.5.90 లక్షలు**

వైఎస్సార్ జిల్లాకు చెందిన వెంకటయ్య అనే ఉప గుత్తేదారుడు ఎస్ఎస్‌పీ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇందుకు ప్రతినెలా రూ.5.90 లక్షల వరకు వెచ్చిస్తున్నారు.

సిబ్బంది నిత్యం ఫాగింగ్ చేస్తుండాలి. రోగుల చెంతకు ఎలుకలు, పాములు లాంటివి రాకుండా పర్యవేక్షిస్తూ 19 రకాల మందులను వినియోగించాలి. పురుగు మందుల పిచికారీ తదితరాలను హెల్త్ ఇన్‌స్పెక్టర్ల నిర్వహణలో మధ్యాహ్నం వరకు చేయాలి.

ఆసుపత్రి అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి నిత్యం గుత్తేదారుడు అందించే సేవలకనుగుణంగా మార్కులు వేయాలి. వాటి ఆధారంగా గుత్తేదారుడికి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.

**ఏడాదిగా పనిచేయని యంత్రం**

ఆసుపత్రి స్టోర్ గదిని పరిశీలిస్తే ఒక్క ర్యాట్‌ప్యాడ్ మాత్రమే ఉండగా ఒక లీటరు లీథల్, రెండు ప్యాకెట్ల పెస్ట్‌లో కలిపే పౌడర్ మాత్రమే ఉండటం గమనార్హం.

ఫాగింగ్ చేయాల్సిన యంత్రం ఏడాదిగా పనిచేయకపోయినా ఎవరూ పట్టించుకోలేదు. కేవలం రెండు స్ప్రే ట్యాంకర్లతో నామమాత్రంగా పిచికారీ చేయిస్తున్నారు. హెల్త్ ఇన్‌స్పెక్టరు గోవిందు మాట్లాడుతూ ఏడాదిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా.. ఇంతవరకు పురుగు మందుల స్టాక్, ర్యాట్‌ప్యాడ్స్‌ను గుత్తేదారుడు ఇచ్చిన దాఖలాలు లేవు. సిబ్బంది.. రెండు నీళ్ల ట్యాంకులతో వచ్చి శుభ్రం చేస్తున్నారన్నారు.

**రెండేళ్లుగా మొక్కుబడి సేవలు**

ఆసుపత్రి ఆవరణలో ప్రస్తుతం పలు నిర్మాణాలు జరుగుతున్నాయి. మురుగు కాల్వల వ్యవస్థ అధ్వానంగా ఉంది. రోగుల, వారి సహాయకులు ఆహార పదార్థాల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. దీంతో ఎలుకలు, దోమలు పెరిగాయి. వీటి కట్టడికి గత రెండేళ్లుగా గుత్తేదారుడు నామమాత్రంగా చేపడుతున్నారు. అయినా అధికారులు రూ.కోటికిపైగా నిధులను అప్పనంగా చెల్లించారు.

గతేడాది 428 ఎలుకలను పట్టుకున్నట్లు గుత్తేదారుడు పుస్తకాల్లో రాసినప్పటికీ అధికారుల సంతకాలేవీ లేకపోవడం గమనార్హం. ఎస్ఎస్‌పీ నిర్వహణకుగాను గుత్తేదారుడు తమ సిబ్బందికి నెలకు వేతనాల రూపంలో రూ.లక్ష, పురుగు మందులకు సుమారు రూ.30 వేలు ఖర్చు చేసి మిగిలినదంతా మిగుల్చుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. గుత్తేదారుడు బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం లేదన్న ఉద్దేశంతో గత మూడు నెలలుగా బిల్లులు ఆపేశాం. టెండరు కాలపరిమితి ముగిసిందని గుత్తేదారుడు పట్టించుకోవడం లేదు. అతడిని పిలిపించి చర్యలు తీసుకుంటామని" ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

# స్లాట్ స్వీటు

కర్నూలు : కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ సేవలకు ఆదరణ పెరుగుతోంది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎంపిక చేసుకునే రోజుల్లో నిర్ణీత సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం స్లాట్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 4వ తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. తొలివిడతగా జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభించారు. ఇక్కడ నిత్యం 80కిపైగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి.

**పెరిగిన ఆదాయం** కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆదాయం పెరిగింది. వైకాపా ప్రభుత్వ పాలనలో స్థిరాస్తి వ్యాపారం క్షీణించిన నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యాలయానికి రూ.59.48 కోట్ల ఆదాయమే వచ్చింది. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కిందటరాగా.. 2024-25లో రూ.85.45 కోట్ల ఆదాయం లభించడం విశేషం. దీనిని పరిశీలిస్తే గత ఆర్థిక సంవత్సరానికన్నా



రూ.25.97 కోట్ల ఆదాయం అధికంగా వచ్చినట్లు స్పష్టమైంది. స్థిరాస్తి వ్యాపారం పుంజుకుంటున్న నేపథ్యంలో భవిష్యత్తులో స్లాట్ బుకింగ్‌కు మరింత ఆదరణ పెరిగే అవకాశాలున్నాయి.

**విస్తృత ప్రచారం**

స్లాట్ బుకింగ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కర్నూలు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్, ఉద్యోగులు వివిధ రూపాల్లో ప్రచారం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా 39 మంది ఈ విధానంలో తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. నిత్యం సగటున 9 మందిపైగా రిజిస్ట్రేషన్ చేసుకుంటన్నారు. కొత్త విధానంపై జనానికి అవగాహన లేకపోవడం.. చిన్నచిన్న సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో కొంత జాప్యం జరుగుతోంది. అతి కొద్దిరోజుల్లోనే ఇది సమసిపోతుందని అధికారులు భావిస్తున్నారు. నిర్ణీత సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకోనివారు సాయంత్రం 5.30 తర్వాత సాధారణ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంది. లేకుంటే మళ్లీ స్లాట్ బుకింగ్ రీషెడ్యూల్ చేసుకునేందుకు అదనంగా రూ.200 చెల్లించాల్సి ఉంది. నిత్యం ఉదయం 10.30 నంచి సాయంత్రం 5.30 వరకు 72 స్లాట్లకు అనుమతి ఇస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు స్లాట్ విధానాన్ని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు.

# ష్ఛే.. ఇంకా బలహీనమే!

అనకాపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పౌష్ఠికాహారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. కోట్లు ఖర్చుచేస్తున్నాయి. అయినా పిల్లల్లో పోషకాహార లోపాలు కనిపిస్తూనే ఉన్నాయి. వయసుకు తగ్గ ఎత్తు పెరగడం లేదు. ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. నెలనెలా పోషణ్ ట్రాకర్ ద్వారా పిల్లల పోషకాహార స్థితిని అంచనా వేస్తుంటారు. లోపాలను సరిదిద్దుకుని పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఈ విషయంలో గతేడాది ఆగస్టుతో పోల్చితే అల్లూరి జిల్లా కాస్తనయం అనిపించగా, అనకాపల్లి జిల్లా ఇంకాస్త వెనుకబడటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో ఆరేళ్లలోపు చిన్నారులు 4.23 లక్షల మంది పైగా ఉన్నారు. మైదాన ప్రాంతంలో పిల్లలకు బాల సంజీవని, మన్యంతో లబ్ధిదారులకు బాలసంజీవని ప్లస్ పేరుతో పోషకాహారం అందిస్తున్నారు. అయితే ఈ ఆహారం పంపిణీ నుంచి వినియోగం వరకు సక్రమంగా జరగక పోవడంతో తల్లులు, పిల్లల్లో పోషకాహార లోపాలు వెలుగుచూస్తున్నాయి. పైగా ఆహారపు అలవాట్లు,



జీవనశైలిలో మార్పుల కారణంగా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ఈ నివేదికలపై చర్చించారు. బరువు తక్కువ, ఎదుగుదల లోపం వంటి అంశాల్లో గతంలో కంటే అల్లూరి జిల్లా కొంత మెరుగైన ఫలితాలు సాధించినా రాష్ట్రం సగటుతో ఇంచుమించు సమానంగానే నిలవడం ఆందోళన కలిగిస్తోంది. అనకాపల్లి జిల్లాలో గతంలో కంటే పరిస్థితులు కాస్త అదుపు తప్పినట్లు స్పష్టమవుతోంది.

**ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం:** పిల్లల పోషకాహార స్థితిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వాటి లోటు ఉన్నవారికి అదనపు పోషకాహారం అందించేలా కుటుంబ సభ్యులకు సూచిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పోషకాహారం లబ్ధిదారులు మాత్రమే తినాలి. కొన్నిచోట్ల వారి ఆహారాన్ని కుటుంబం మొత్తం కలిసి తినడం కూడా వారి ఎదుగుదలలో లోటుపాట్లకు కారణమవుతోంది.
కె.అనంతలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

# అనుమతులుండవ్.. అడ్డంగా కట్టేయడమే!

మునగపాక : మునగపాక మండలంలో స్థిరాస్తి వ్యాపారుల దందాకు అడ్డు, లేకుండా పోతోంది. సాగునీటి కాలువ గట్లను సైతం ఆక్రమించి లేఅవుటుగా మార్చేశారు. మునగపాక ఎన్టీఆర్ కాలనీని ఆనుకొని వంద అడుగుల వెడల్పు ఉండే అనకాపల్లి ఆవకాలువకు ఆవల ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు దారి ఏర్పాటు కోసం రెవెన్యూ, జలవనరులశాఖ అధికారుల అనుమతులు తీసుకోకుండానే కాలువను పూడ్చి వంతెన నిర్మిస్తున్నారు. వంతెన నిర్మాణంపై ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నా సమాధానం లేదు. కాలువను పూడ్చివేసి నిర్మిస్తున్న వంతెన కారణంగా 500 గృహాలతో ఉన్న ఎన్టీఆర్ కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదముందని భాజపా, తెదేపా నాయకులు బద్దెం సూర్యనారాయణ, మొల్లేటి సత్యనారాయణ, ఆవకాలువ సాగునీటి సంఘం అధ్యక్షుడు



ఆడారి సన్యాసినాయుడు తదితరులు బుధవారం మునగపాకలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమంగా వంతెన నిర్మిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు జలవనరులశాఖ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. వర్షాకాలంలో తమ పంటపొలాలకు ముంపు ఏర్పడే ప్రమాదముందని సాగునీటి సంఘం అధ్యక్షుడు సన్యాసినాయుడు తెలిపారు. వంతెన నిర్మాణానికి అనుమతి ఇచ్చారా? అని అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించగా.. తాము ఇవ్వలేదని వారు స్పష్టం చేశారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# కాలువ మారాలి.. కలత తీరాలి

రాజమహేంద్రవరం : వైకాపా అయిదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాగునీటి పారుదల వ్యవస్థను దశలవారీగా చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుటుంది. ఈ నెల 16 నుంచి కాలువలకు నీటి విడుదల నిలిపివేస్తున్న నేపథ్యంలో క్లోజర్‌లో చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించింది. తక్కువ సమయంలో పెద్ద పనులు చేపడితే టెండర్లు, ఇతర ప్రక్రియల వల్ల సకాలంలో పూర్తికాని పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం నిర్వహణకే ప్రాధాన్యమిచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 18 నియోజకవర్గాల్లో 972 పనులు చేపట్టేందుకు సుమారు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. తొలుత ఒక్కో నియోజకవర్గం నుంచి రూ.10 కోట్ల విలువైన పనులకు రూపొందించారు. సాధ్యాసాధ్యాల పరిశీలన తరువాత స్థానిక పనుల ప్రాధాన్యం ఆధారంగా నియోజకవర్గానికి రూ.2 కోట్ల వరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న సూచనల మేరకు జలవనరుల శాఖ మళ్లీ సిద్ధంచేసి పంపించింది. **సంఘాల ఆధ్వర్యంలో..** ఉమ్మడి జిల్లా పరిధిలోని కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు, స్లూయిస్‌ల నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తీత చేపట్టనున్నారు. ఒక్కో పని రూ.10 లక్షలలోపు అంచనా విలువతో నిర్ణయించి, నామినేషన్ విధానంలో సాగునీటి సంఘాల ప్రతినిధుల పర్యవేక్షణలో చేపడతారు. జగన్ పాలనలో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ఏటా కనీస నిర్వహణ పనులు సైతం జరగలేదు. ఇప్పుడు వీరి పర్యవేక్షణలోనే చేయడం వల్ల ఏడాది పొడవునా బాధ్యతాయుతంగా నిర్వహణ చేయడంతోపాటు, సమస్య ఉన్న ప్రాంతాల్లో దృష్టి సారించే అవకాశం ఉంటుంది.

# స్థలాలు పంచుకొని.. ఆస్తులు పెంచుకొని



విశాఖపట్నం : వైకాపా ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు లెక్కేలేదు. స్థానిక నాయకుల అవకతవకలకు అంతేలేదు. ఇందుకు పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలోని 'ఒక సెంటు' లేఅవుట్‌లోని కాలనీలో జరిగిన అవకతవకలే నిదర్శనం. గత ప్రభుత్వం చేసిన ఇళ్ల కేటాయింపుల్లో వైకాపా నేతలు చక్రం తిప్పి వారి అనుయాయులకు భారీగా లబ్ధి చేకూర్చారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని అర్హుల జాబితాలను మార్చేశారు. అప్పట్లో అధికారులు కళ్లుమూసుకున్నారు తప్ప పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన విజిలెన్స్ విచారణ జరిగింది. గత ప్రభుత్వంలో పెందుర్తి మండలంలో పనిచేసిన కీలక అధికారే మళ్లీ ఇక్కడికి రావడంతో అవకతవకలు బయటకు రాలేదని సమాచారం.

**ఆ లేఅవుట్‌లో:** జెర్రిపోతులపాలెం లేఅవుట్ కోసం గత ప్రభుత్వం రైతుల నుంచి 64 ఎకరాలు సమీకరించింది. ఇందులో 43 ఎకరాల్లో లబ్ధిదారులకు ఒక సెంటు/సెంటున్నర ప్లాట్లు, రైతులకు పరిహారంగా ఇచ్చేందుకు 21 ఎకరాలు కేటాయించారు. 43 ఎకరాల్లో 1,579 ప్లాట్లను సెక్టార్ ఏ, సెక్టార్ బి, సెక్టార్ సిలో అభివృద్ధి చేశారు.

**ఆక్రమించేసి..:** జెర్రిపోతులపాలెంకు సమీప ఇప్పిలవానిపాలెం పంచాయతీలో స్థానిక వైకాపా నేతలు ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన స్థలానికి అదనంగా మరికొంత ఆక్రమించి ఇళ్లు నిర్మించేశారు. ఓ నేతకు సెంటున్నర స్థలం ప్లాటు కేటాయిస్తే దాని చుట్టూ నాలుగు ప్లాట్లను కలిపేసుకొని రెండు అంతస్తుల్లో భారీ నిర్మాణం చేపట్టారు. వీటిల్లో ఒకటి, రెండు ప్లాట్లను బినామీల పేరుతో రాయించుకున్నట్లు సమాచారం. మరో నేత అయిదు సెంట్లలో నిర్మించేశారు. ప్లాట్ల కబ్జాపై కొద్ది రోజుల కిందట కలెక్టరు, ఇతర అధికారులకు ఫిర్యాదులు అందినా ఎవరూ కన్నెత్తయినా చూడలేదు.

**కట్టబెట్టారు:** ఇక్కడ సుమారు రెండొందల మంది వరకు అనర్హులకు ఒక సెంటు ప్లాట్లు కట్టబెట్టారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఉన్నారు. స్థానిక నేతలను ప్రసన్నం చేసుకున్నారు. ఈ క్రమంలో డబ్బులు చేతులు మారినట్లు సమాచారం.

ఓ దరఖాస్తుదారు ప్రభుత్వ ఉద్యోగి. వారి కుటుంబానికి గ్రామంలో రెండతస్తుల ఇళ్లు రెండు ఉన్నాయి. మళ్లీ ఒక సెంటు స్థలాలు మూడు కేటాయించారు.

2018లో నాటి ప్రభుత్వం పది మందికి ఇళ్లు కేటాయించింది. మళ్లీ వారు ఒక సెంటు లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించేసుకున్నారు.

ఓ దరఖాస్తుదారు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి. ప్రభుత్వం నుంచి అతనికి ప్రతి నెలా పింఛను అందుతుంది. అదే కుటుంబానికి ఆర్‌సీసీ పైకప్పులు కలిగిన మూడు ఇళ్లున్నాయి. అయినా ఇళ్ల కేటాయింపుల జాబితాల్లో పేర్లను చేర్చారు.

మొత్తం కేటాయింపుల్లో 12 మంది వరకు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు మరో పది మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. లబ్ధిదారుల్లో సుమారు 50 మందికి గతంలోనే ఆర్‌సీసీ పైకప్పు కలిగిన రెండు, మూడు అంతస్తుల ఇళ్లున్నాయి.

# నిర్లక్ష్యపు మోత.. పంపిణీలో కోత



పుట్టపర్తి : ముదిగుబ్బ మండలంలోని 54 చౌకదుకాణాల పరిధిలో 19,238 కార్డులున్నాయి. 55శాతమే బియ్యం పంపిణీ జరిగింది. బఫర్ సమస్యతో ఈసారి కోత విధించారు. సుమారు 100 క్వింటాళ్లు తక్కువ వచ్చాయి. కార్డుదారులను వెనక్కి పంపిస్తున్నారు. ముదిగుబ్బలోని టీచర్స్ కాలనీ, సిరిగారిపల్లిలో పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదు.

తాడిమర్రి మండలంలో 31 చౌక దుకాణాల పరిధిలో 10,800 కార్డులున్నాయి. ఇక్కడ 25 శాతం పంపిణీ చేయాల్సి ఉంది. దీంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో పౌరసరఫరాల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బఫర్ పేరుతో బియ్యంలో సగానికి పైగా కోత విధిస్తున్నారు. కొన్ని చోట్ల 60 క్వింటాళ్లు ఇవ్వాల్సి ఉండగా 20 క్వింటాళ్లు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. కార్డుదారులకు బియ్యం అందకపోతే ఏమి చేయాలి? ఇచ్చిన దాంతోనే సరిచేయండి. ఆ మాత్రం మేనేజ్ చేయలేరా అంటూ కొందరు సీఎస్‌డీటీలు సమాధానాలు ఇస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం దీనిపై స్పందించడం లేదు. ఏదైనా ఉంటే మీరు, మీరు చూసుకోండి అంటూ చేతులు సలహాలు ఇస్తున్నారు. జిల్లాలకు అవసరమైన మేర బియ్యం చేరలేదా? ఎంఎల్‌ఎస్ పాయింట్లకు తక్కువగా ఇచ్చారా? లేదంటే పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అసలు బఫర్ పేరుతో కోత ఎందుకు విధిస్తున్నారు అనే ప్రశ్నలపై సమాధానం దాటవేస్తున్నారు.

**ప్రజాప్రతినిధులు ఆగ్రహించినా...**

బియ్యంలో కోత విధించడంతో ప్రజాప్రతినిధులు కలగజేసుకోవాల్సి వచ్చింది. కళ్యాణదుర్గం, రాయదుర్గం, రాప్తాడు, అనంతపురం ఎమ్మెల్యేలు పౌరసరఫరాల అధికారులను పిలిపించి మాట్లాడారు. వారికి కూడా అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు. కంటితుడుపు చర్యగా కొన్ని దుకాణాలకు మాత్రమే సర్దుబాటు చేశారు. మిగిలిన చోట్ల సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదని తెలుస్తోంది. ఎమ్మెల్యేలంతా కలిసి విషయాన్ని ఇరు జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులతో పాటు పౌరసరఫరాల శాఖ మంత్రికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# ఫైబర్‌నెట్.. సేవలు ఫట్




అచ్యుతాపురం : ఫైబర్ కనెక్షన్ ఎప్పుడు పనిచేస్తుందో? ఎప్పుడు ఆగిపోతుందో? తెలియదు. సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉన్నారా? లేదా? వినియోగదారులు ఫోన్లు చేసి అడుగుతున్నారు? ఎప్పుడు వస్తుందో? దయచేసి చెప్పండి ఇదే విషయం వారికి నచ్చచెబుతాం. కొందరు ఫోన్ చేసి మండిపడుతున్నారు. ఇది మాడుగుల కేబుల్ నిర్వాహకుడు వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన సందేశం
రెండు నెలలుగా క్షేత్రస్థాయి సిబ్బందికి వేతనాలు ఇవ్వలేదు. రాకపోకలు సాగించడానికి కనీసం ఛార్జీలను సైతం చెల్లించడం లేదు. అందుకే ఎటువంటి సమస్య ఎదురైనా వారు పట్టించుకోవడంలేదు. కేబుల్ సేవలు ఎప్పుడు పనిచేస్తాయో? చెప్పే వారు లేరు. ఇదే విషయాన్ని వినియోగదారులకు తెలియజేయండి.

**ఇది మరో ఆపరేటర్ ఆవేదన** జిల్లాలో ఫైబర్ సేవలు అధ్వానంగా మారాయి. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లు ఈ సేవలను నిర్లక్ష్యం చేసింది. విశాఖ జిల్లాలో 95 వేల మంది వినియోగదారులు అవస్థలకు గురవుతున్నారు. సామాన్యులకు సైతం అంతర్జాలం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఫైబర్‌నెట్ సేవలను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. కేవలం రూ. 250లకే అన్ని ప్రైవేటు టీవీ ఛానళ్లతో పాటు 10 ఎంబీపీఎస్ వేగంతో పరిమితి లేని అంతర్జాలం అందించింది. తక్కువ ధరకే టీవీ, నెట్ అందుబాటు లోకి రావడంతో పల్లె జనాలు, విద్యార్థులు ఈ కనెక్షన్లు పొందడానికి ఉత్సాహం చూపారు. ఫైబర్ నెట్ ధరలు ప్రైవేటు సంస్థల కంటే తక్కువగా ఉండడం, నెట్‌తోపాటు టీవీ ఛానళ్లు రావడంతో దీనిని పొందడానికి పట్టణ, గ్రామీణ ప్రజలు ఆసక్తి చూపించారు. కొత్త కనెక్షన్లు ఇవ్వాలని కేబుల్ ఆపరేటర్లను కోరుతున్నా ఇప్పుడు ఉన్నవారికే సేవలు అందించలేకపోతున్నామని ఆపరేటర్లు చేతులెత్తేస్తున్నారు.

**ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరు:** సేవలపై ఎన్నిసార్లు చెప్పినా ఉపయోగం లేదు. ఎప్పుడు వస్తుందో? ఎప్పుడుపోతుందో? తెలియడంలేదు. వినియోగదారుల నుంచి ప్రతినెల డబ్బులు వసూళు చేస్తున్నామే తప్ప పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాం. కష్టమర్‌కేర్ ఫోన్ చేసినా ప్రయోజనం లేదు. గతంలో వచ్చే ఉచిత ఛానెన్లు ఇప్పుడు రావడంలేదు. ఆడారి శివ, కేబుల్ ఆపరేటర్, తిమ్మరాజుపేట**కేబుల్ సేవలు గాల్లో దీపం:** అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిపై కనీసం పర్యవేక్షణ లేదు. ఉగాది రోజున సాయంత్రం 5 గంటలకు పోయి 48 గంటల తరవాత వచ్చింది. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి. శరగడం శ్రీను, కేబుల్ ఆపరేటర్, హరిపాలెం

# పిల్ల కదలదు.. సాగు పెరగదు

కాకినాడ : వరుసగా వెంటాడుతున్న ప్రతికూల పరిస్థితులు ఆక్వా పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వ్యాధులు.. పడిపోతున్న ధరలు.. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో సతమతమవుతుండగా.. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల దెబ్బ మరింత కుంగదీస్తోంది. ఆ దేశానికి ఎగుమతి అవుతున్న సముద్ర ఉత్పత్తుల్లో 90 శాతం రొయ్యలే. విదేశీ సుంకం పెంచేయడంతో ఎగుమతులు తగ్గి ఈ ప్రభావం పరోక్షంగా హేచరీలపై పడింది. మార్కెట్లో ప్రతికూలతతో రైతులు రొయ్య పిల్లలు కొని సాగుకు వెనుకాడుతున్నారు. దీంతో చిన్న హేచరీలు మూసేసే పరిస్థితి నెలకొంది.

**అనిశ్చితితో సంక్షోభం..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆక్వా సాగు 21,103 హెక్టార్లలో ఉంది. రైతులు 1,03,003 మంది ఉన్నారు. రొయ్యల హేచరీలు 201, ప్రాసెసింగ్ యూనిట్లు 13, ఫీడ్ మిల్లులు 4 ఉన్నాయి. వీటి ద్వారా 3 లక్షల మందికి ఉపాధి దక్కుతోంది. ఆక్వా సంక్షోభం



వీరందరిపైనా ప్రభావం చూపుతోంది. నాలుగు లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తికి అవసరమయ్యే రొయ్య విత్తనాన్ని (ఆక్వా సీడ్) మన హేచరీలు అందిస్తున్నాయి. పీఎల్ 12 (పోస్టు లార్వా) పిల్లలను చెరువులో వేస్తారు. 12 రోజుల పిల్లలను నాలుగు నెలలు పెంచుతారు. 0.25 మిల్లీ గ్రాముల రొయ్య పిల్ల.. 20 నుంచి 25 గ్రాముల వరకు ఎదిగాక ఎగుమతి చేస్తారు. మార్కెట్లో ధరలేక సాగుకు రైతులు రావడంలేదు. దీంతో రొయ్య పిల్లల ఉత్పత్తి తగ్గింది. ఎగుమతులు తగ్గి హేచరీల యజమానులు ఉత్పత్తి తగ్గిస్తే.. కార్మికుల పనిగంటలు తగ్గిపోతాయి. చెరువుల నిర్వహణ, హేచరీల్లో పనులకు వచ్చే లక్షల మంది కార్మికులు ఇబ్బందిపడే పరిస్థితి రానుంది.

# రొయ్య విత్తనం.. సుంకాల పెత్తనం

కాకినాడ : వరుసగా వెంటాడుతున్న ప్రతికూల పరిస్థితులు ఆక్వా పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వ్యాధులు.. పడిపోతున్న ధరలు.. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో సతమతమవుతుండగా.. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల దెబ్బ మరింత కుంగదీస్తోంది. ఆ దేశానికి ఎగుమతి అవుతున్న సముద్ర ఉత్పత్తుల్లో 90 శాతం రొయ్యలే. విదేశీ సుంకం పెంచేయడంతో ఎగుమతులు తగ్గి ఈ ప్రభావం పరోక్షంగా హేచరీలపై పడింది. మార్కెట్లో ప్రతికూలతతో రైతులు రొయ్య పిల్లలు కొని సాగుకు వెనుకాడుతున్నారు. దీంతో చిన్న హేచరీలు మూతపడే పరిస్థితి నెలకొంది.

**అనిశ్చితితో సంక్షోభం..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆక్వా సాగు 21,103 హెక్టార్లలో ఉంది. రైతులు 1,03,003 మంది ఉన్నారు. రొయ్యల హేచరీలు 201, ప్రాసెసింగ్ యూనిట్లు 13, ఫీడ్ మిల్లులు 4 ఉన్నాయి. వీటి ద్వారా 3 లక్షల మందికి ఉపాధి దక్కుతోంది. ఆక్వా సంక్షోభం వీరందరిపైనా పడుతోంది. నాలుగు లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తికి అవసరమయ్యే రొయ్య విత్తనాన్ని (సీడ్) మన హేచరీలు అందిస్తున్నాయి. పీఎల్ 12 (పోస్టు లార్వా) పిల్లలు చెరువులో వేస్తారు. 12 రోజుల పిల్లలను నాలుగు నెలల పాటు పెంచుతారు. 0.25 మిల్లీ గ్రాముల రొయ్య పిల్ల.. 20 నుంచి 25 గ్రాముల వరకు ఎదిగాక ఎగుమతి చేస్తారు. మార్కెట్లో ధరలేక సాగుకు రైతులు రావడంలేదు. దీంతో రొయ్య పిల్లల ఉత్పత్తి తగ్గింది. ఎగుమతులు తగ్గి హేచరీల యజమానులు ఉత్పత్తి తగ్గిస్తే.. కార్మికుల పనిగంటలు తగ్గిపోతాయి. చెరువుల నిర్వహణ, హేచరీల్లో పనులకు వచ్చే లక్షల మంది కార్మికులు ఇబ్బందిపడే పరిస్థితి రానుంది.

30 శాతం నిలిచిపోయాయి– ఎస్.హరినారాయణరావు, వైస్ ఛైర్మన్, కాకినాడ జిల్లా హేచరీస్ అసోసియేషన్

అమెరికా సుంకాల ప్రభావం ఆక్వా మార్కెట్‌పై పడింది. ధర పలుకుతుందా..? లేదా..? అనే అనిశ్చితి. ఈ ప్రభావం పరోక్షంగా హేచరీలపై ఉంటుంది. 30 శాతం చిన్న హేచరీలు నిలిచిపోయాయి. ఒక్కో హేచరీపై 40 మంది బతుకుతున్నారు. వీరికి పనులు కష్టమే. సరైన ధర లేక, ఎగుమతుల్లేక ఇబ్బంది పడుతున్న రైతులు కొద్ది రోజులుగా సీడ్ కొనేందుకు వెనుకంజ వేస్తున్నారు. పరిస్థితులు చక్కదిద్దేలా ప్రభుత్వం చొరవచూపాలి.

# ప్రచారం.. ప్రాణాలు పణం

రావులపాలెం : ప్రధాన కూడళ్లలో ఏడాది పొడవునా ఏదో ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ, పుట్టినరోజు, వర్ధంతి, ఇతర సందర్భాల్లోనూ ఎక్కడికక్కడ వెలుస్తున్నాయి. వీటి కారణంగా గొడవలు సైతం జరుగుతున్నాయి. రహదారి చెంత ఏర్పాటు చేయడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. కోనసీమ ముఖద్వారం రావులపాలెం కూడలి. ఈ ప్రాంతం మీదుగానే అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. స్థానిక కళా వెంకట్రావు కూడలిలో నిత్యం పది, పదిహేను ఫ్లెక్సీలు ఉంటున్నాయి. మడికి నుంచి గోపాలపురం వరకు జాతీయ రహదారి వెంబడి, కొత్తపేట కూడలి నుంచి అమలాపురం వరకు ప్రధాన రహదారిపై పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

**గాలులకు చిరిగిపోయి..**

ఆకట్టుకునే విధంగా ఫ్లెక్సీలు పెట్టడం వల్ల రహదారిపై ప్రయాణించే వారు వాటిని చూస్తూ ప్రయాణాలు చేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా కూడళ్లలో గత మూడు నెలల కాలంలో సుమారు 50 నుంచి 60 వరకు చిన్నాపెద్దా ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో పరిస్థితి తీవ్రతను తెలుసుకోవచ్చు.

**అనుమతులు లేకుండానే..**

ఎక్కడైనా ఫ్లెక్సీ పెట్టాలంటే ముందుగా ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీ అనుమతి తీసుకోవాలి. నిబంధనల ప్రకారం నగదు చెల్లించాలి. ఎక్కడా ఇది అమలు కావడం లేదు. రాజకీయ నాయకుల ప్రమేయంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వీటి ఏర్పాటుపై కేసులు నమోదైన సంఘటనలు కూడా ఉన్నాయి. దీనిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో రాజు తెలిపారు.

# గృహోపకారం

కర్నూలు : ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తామని ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా గొప్పలు చెప్పింది.. పట్టణాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు ఇచ్చింది. అరకొరగా సాయం అందించడంతో చాలామంది నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. పునాదులు వేసి వదిలేశారు. అసంపూర్తిగా నిలిచిన పనులు పూర్తి చేసేందుకు 'కూటమి' ప్రభుత్వం అదనపు సాయం ఇవ్వాలని నిర్ణయించింది.

**వీరికి రిక్తహస్తమే**

ఆప్షన్-3 కింద గుత్తేదారులు నిర్మించే ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఈ అదనపు సాయం వర్తింపజేయలేదు. అప్పట్లో నిర్ణయించిన ప్రకారం ఒక్కో ఇంటికి రూ. 1.80 లక్షలతోపాటు లబ్ధిదారు సొంతంగా రూ. 35 వేలు కలిపి మొత్తం రూ. 2.15 లక్షలను గుత్తేదారులకు చెల్లించాల్సి ఉంది. గతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన మేరకే గుత్తేదారులు ఇళ్లు నిర్మించాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో 1,622 మంది, నంద్యాల జిల్లాలో 18 మంది కలిపి ఉమ్మడి జిల్లాలో 1,640 మందికి ప్రభుత్వం ప్రకటించిన ఈ అదనపు సాయం వర్తింపజేయడం లేదని గృహ నిర్మాణశాఖ ఇంజినీర్లు తెలిపారు.

**సాయానికి కోత పెట్టిన వైకాపా**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99,969 ఇళ్లు నిర్మిస్తున్నట్లు వైకాపా ప్రకటించింది. జగనన్న కాలనీల్లోనే 52,149 గృహాలు మంజూరు చేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఒక్కో ఇంటికి కేంద్రం రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ తన వాటా రూ. లక్ష కలిపి రూ. 2.50



లక్షలు అందించాల్సి ఉంది. కానీ వైకాపా ప్రభుత్వం కేంద్రం వాటాకు అదనంగా రూ. 30 వేల చొప్పున ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలే మంజూరు చేసింది.

**దృష్టి సారించిన 'కూటమి' ప్రభుత్వం**

నివాసయోగ్యం కాని చోట్ల స్థలాలు ఇవ్వడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మౌలిక వసతులు కల్పించడంలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయా సమస్యలపై దృష్టి సారించింది. ముందుగా ఆయా కాలనీల పేరును పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌లుగా మార్చడంతోపాటు గృహ నిర్మాణానికి అదనపు సాయం అందించేలా నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అసంపూర్తిగా మిగిలిపోయిన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. అర్హులను ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలుగా విడగొట్టింది. ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలు రూ. 75 వేలు, ఆదివాసీ గిరిజనులు రూ. లక్ష, చేనేత కార్మికులు రూ. 50 వేలు, ఇతర బీసీ వర్గాలకు రూ. 50 వేల చొప్పున అందించనుంది.

# ఖాతా తెరుచుకో.. కమీషన్ తీసుకో

ఉంగుటూరు : గతంలో పెద్ద టోర్నీలకు పరిమితమైన క్రికెట్ బెట్టింగ్‌లు క్రమేపీ గల్లీ క్రికెట్ టోర్నీల వరకు పాకాయి. పోలీసులకు కంటపడకుండా ఉండేందుకు నగదు లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారు. ఈ క్రమంలో క్రికెట్ బుకీలకు ఆన్‌లైన్ లావాదేవీలు జరిపేందుకు బ్యాంకు ఖాతాలు అనివార్యమయ్యాయి. దీనిని కొందరు వ్యాపారంగా మలుచుకుని రూ. లక్షలు సంపాదిస్తున్నారు. క్రికెట్ బుకీలకు ఇచ్చేందుకు కమీషన్ ఎర చూపి సామాన్యులతో కరెంట్ బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. బెట్టింగ్‌ల ద్వారా ఆయా ఖాతాల్లో రోజుకు రూ. లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నాయి. కమీషన్‌కు ఆశ పడి యువత, గృహిణులు కరెంట్ బ్యాంకు ఖాతాలు తెరిచి బెట్టింగ్‌లో భాగస్వాములవుతున్నారు. ఇలాంటి ఖాతాలు ఉంగుటూరు మండలం నారాయణపురంలో వందకు పైగానే ఉన్నట్లు తెలిసింది.

**ఆశ చూపి.. ఖాతాలు తెరిపించి..**

నారాయణపురానికి చెందిన పలువురు యువకులు హైదరాబాదు వెళ్లి క్రికెట్ బుకీ వద్ద పని చేశారు. అక్కడ బుకీలు లావాదేవీలు అన్నీ ఆన్‌లైన్ చేయడం, అందుకు కరెంట్ బ్యాంకు ఖాతాలు అవసరమని గుర్తించారు. స్వగ్రామంలో ఉండి డబ్బు సంపాదించుకోవచ్చని నారాయణపురం వచ్చేశారు. టూరింగ్‌పేట, ఎన్టీఆర్, వైఎస్ఆర్




కాలనీల్లో తమకు తెలిపిన వాళ్లకి కరెంట్ ఖాతాలు తెరిచి ఆ వివరాలు తమకిస్తే వారం వారం ఒక్కో ఖాతాకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు కమీషన్ ఇస్తామన్నారు. దీంతో కష్టపడకుండానే వారం వారం నగదు తమ ఖాతాలో వచ్చి పడుతుందని చాలా మంది ఆశ పడ్డారు. ఖాతాలు తెరవడం ప్రారంభించారు. కొందరికి కమీషన్లు వస్తున్నాయి.

**వెలుగులోకి ఇలా..**

నారాయణపురంలో జాతీయ రహదారి పక్కన ఓంకారేశ్వరి పాస్ట్‌ఫుడ్ సెంటర్ అండ్ కూల్ డ్రింక్స్ పేరిట దుకాణం ఉంది. ఇటీవల ఉండి మండలం కోలమూరులోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో కరెంట్ ఖాతాకి సంబంధించి చెక్‌బుక్, ఏటీఎం కార్డు పోస్టులో వచ్చాయి. తాము ఖాతా తెరవకుండా ఇది ఎలా సాధ్యమని దుకాణం నిర్వాహకులు అవాక్కయ్యారు. పోస్టు కవర్‌పై ఉన్న చరవాణి నంబరుకు ఫోన్ చేసి గట్టిగా అడిగితే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దుకాణం పేరిట వారికి తెలియకుండా తాను కరెంట్ ఖాతా తెరిచినట్లు అవతలి వ్యక్తి ఒప్పుకొన్నాడు. ఈ వ్యవహారాన్ని చేబ్రోలు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విధంగా గ్రామంలో యజమానులకు తెలియకుండా వారి దుకాణాలు, హోటళ్లు పేరిట తాడేపల్లిగూడెం, ఏలూరు, కోలమూరు తదితర ప్రాంతాల్లోని బ్యాంకుల్లో వందకు పైగా కరెంట్ ఖాతాలు తెరిచారు. పోలీసులు విచారణ ప్రారంభించడంతో ఇద్దరు యువకులు గ్రామం విడిచి వెళ్లిపోయినట్లు సమాచారం.

# గ్లకోమా.. జాగ్రత్త సుమా!



అనంతపురం : కంటి చూపును హరించే అదృశ్య శత్రువు గ్లకోమా (నీటికాసులు వ్యాధి). దీన్ని ఏమాత్రం నిర్లక్ష్యం వహిస్తే అంధకారమే అని కంటి వైద్యులు హెచ్చరికలు చేస్తున్నారు. ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే నియంత్రించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ నెల 12వ తేదీ గ్లకోమా డేను పురస్కరించుకుని.. నీటికాసుల వ్యాధి ఎందుకు వస్తుంది.. నివారణకు ఎలాంటి వైద్య చికిత్సలు పొందాలి..? వ్యాధి నిర్ధారణకు ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి..? జిల్లాలో దాని తీవ్రత ఎలా ఉందో వివరిస్తూ కథనం.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్లకోమా వ్యాధి బారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో ప్రస్తుత ఏడాది నమోదైన కేసులను గత ఏడాది కేసులతో పోలిస్తే అధికంగా ఉంది. సకాలంలో నీటికాసుల వ్యాధిని గుర్తించకపోవడంతో పలువురు కంటిచూపును కోల్పోతున్నారు. తమకు వ్యాధి సోకిందనే విషయాన్ని బాధితులు గుర్తించలేకపోతున్నారు. కంటి నొప్పి, కళ్లు ఎర్రబడడం లాంటి లక్షణాలు ఉండవు. లోలోపలే చూపు తగ్గడం మొదలై కంటి చుట్టు పక్కల నుంచి చూపు తగ్గుతూ వచ్చిన తరువాత బాధితులు తమను సంప్రదిస్తున్నారని సర్వజన ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి, పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గుర్తించిన కేసులను అనంతపురం సర్వజన ఆసుపత్రికి పంపుతున్నారు. ఇక్కడ వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

**ఈ లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాల్సిందే..**

40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలి. తరచూ కంటి అద్దాలు మార్చాల్సి రావటం.. ఏదైనా లైట్ చుట్టూ వలయాలుగా కనపడటం.. చూపు మసకబారటం.. తలనొప్పి వంటి లక్షణాలుంటే తప్పక నీటికాసుల వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వంశపారంపర్యంగా ఈ వ్యాధితో బాధపడే వారి కుటుంబ సభ్యులు కచ్చితంగా పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. అధిక మోతాదులో స్టెరాయిడ్స్ వాడటం వల్ల ఈ వ్యాధి వస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు.

**ఆధునిక చికిత్సలు**

గ్లకోమా వ్యాధికి సంబంధించి గోనియోస్కోపి, ఐవోపీమెజర్‌మెంట్, విజువల్ పీల్స్ తదితర నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉచితంగా చేస్తున్నాం. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ఆధునిక లేజర్ చికిత్సలు అందించటంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నాం. డాక్టర్ వె.ఎం.ఎస్.ప్రసాద్, కంటి వైద్య విభాగం, ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, అనంతపురం

**ప్రజల్లో అవగాహన లేకనే..**

గ్లకోమాపై ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల అంధత్వం బారిన పడుతున్నారు. 40 ఏళ్లు పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకోవడం మంచిది. కంటిచూపు తగ్గినప్పుడు వెంటనే కంటి పరీక్షలు చేయించుకుంటే నీటికాసుల వ్యాధిని గుర్తించి చికిత్సలు అందించవచ్చు. గ్లకోమాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నా వంతుగా ఏటా వారం రోజులపాటు అవగాహన సదస్సులు నిర్వహించి ఉచితంగా చికిత్సలు అందిస్తున్నాను. డాక్టర్ నరసింహులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ విశ్రాంత అధికారి, ధర్మవరం

# శాశ్వత తాగునీటి పథకానికి గ్రహణం



మడకశిర : మడకశిర నగరపంచాయతీలో శాశ్వత తాగునీటి పథకం పనులు ముందుకు సాగడం లేదు. మడకశిర చెరువు నుంచి తాగునీటిని పంపింగ్ చేసే కేంద్రం ఏర్పాటు చేసి ట్యాంకుల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో 2018లో ప్రభుత్వం రూ. 64.18 కోట్లు విడుదల చేసింది. (ఏషియన్ ఇన్‌ఫ్రా ఇన్వెస్టిమెంట్ బ్యాంకు) 70శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 30శాతం నిధులు విడుదల చేశాయి. అయితే 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేయడంతో ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి చేయలేదు. ఈ పథకం పూర్తయి ఉంటే నగర పంచాయతీ పరిధిలోని 20వార్డుల్లో 6వేల ఇళ్లకు తాగునీరు సరఫరా చేసేందుకు అవకాశం ఉండేది. చెరువులో శుద్ధనీరు తయారు చేసే కేంద్రం, పక్కనే కొండపై పంపింగ్ కేంద్రం పనులు 35శాతం చేసి ఆపేశారు. ప్రజలు ఈ పథకం ఎపుడు పూర్తి చేస్తారా అని ఆశతో ఎదురుచూస్తున్నారు.

**ఆరేళ్లవుతున్నా 20 శాతమే..**

గుత్తేదారులకు గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిపివేశారు. ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అందించడానికి 24 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా పట్టణంలో 26వేల జనాభా ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా 50లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసే విధంగా ట్యాంకుల నిర్మాణం చేయాల్సి ఉంది. ఆరేళ్లు అవుతున్నా 20శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. 2024 మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉండగా పూర్తి చేయలేకపోయారు.

**పూర్తి కాని ట్యాంకుల నిర్మాణం..**

మడకశిర చెరువు కట్టపై నీటి శుద్ధి చేసేందుకు 6ఎంఎల్‌డీ సామర్థ్యం గల ట్యాంకు నిర్మించి అక్కడి నుంచి పక్కనే ఉన్న కొండపై ఎత్తు ప్రాంతంలో పంప్‌హౌస్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి ట్యాంకుల ద్వారా కుళాయిలకు నీరు సరఫరా చేసేలా పనులు చేపట్టాల్సి ఉంది. నీటి సరఫరా కోసం 7 పెద్ద ట్యాంకులు నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో 5 లక్షల లీటర్లు ఒకటి, 3 లక్షల లీటర్లు 3, ఒకటిన్నర లక్షల లీటర్ల సామర్థ్యం గల 3 ట్యాంకులు పూర్తికావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పనులు 50శాతంకూడా పూర్తి కాలేదు.

ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందిమురళీధర్, ఏఈ, మడకశిర గతంలో ఉన్న రూ. 64కోట్ల నిధులు ప్రస్తుత ధరలకు అనుగుణంగా సరిపోవడం లేదు. ప్రస్తుతం రూ. 81కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం.

నీటి సరఫరా లక్ష్యం : 40లక్షల లీటర్లు
కుళాయిల ఏర్పాటు : 7వేలు
నిధుల మంజూరు : రూ. 64.18 కోట్లు
5ఏళ్లలో ఖర్చు : రూ. 10 కోట్లు

# బాలికా విద్యకు భరోసా




అనకాపల్లి : కస్తూర్బా విద్యాలయాలను జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించారు. విద్యార్థుల వసతి సమస్యను మాత్రం పట్టించుకోలేదు. నాడు నేడులో కొన్ని భవనాలు మంజూరు చేసినా నిధులివ్వక మధ్యలోనే నిలిచిపోయాయి. తాజాగా వాటిని పూర్తిచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. కేజీబీవీల్లో అదనపు భవనాలకు భారీగా నిధులు మంజూరు చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించి బాలికా విద్యకు భరోసానిస్తోంది.

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 39 కస్తూర్బా బాలిక విద్యాలయాలున్నాయి. దశల వారీగా వీటన్నింటినీ జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఒక్కో తరగతిలో సగటున 40 మంది విద్యార్థినులున్నారు. వీరందరికీ తగిన వసతి లేక ఇరుకు గదుల్లోనే సర్దుబాటు చేసుకునే పరిస్థితి నెలకొంది. గత అయిదేళ్లలో అదనపు భవనాలు కాదుకదా అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు కూడా చేయలేకపోయారు. ఈ పరిస్థితిని గుర్తించిన కూటమి ప్రభుత్వం బాలికల ఇబ్బందులను గట్టెక్కించేలా చర్యలు చేపట్టింది. అనకాపల్లి, అల్లూరి జిల్లాలోని 29 కేజీబీవీల్లో అదనపు భవనాల కోసం రూ. 46.4 కోట్లకు పైగా కేటాయించింది. ఒక్కో విద్యాలయానికి సగటున రూ. 1.6 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం టెండర్లు జరుగుతున్నాయి. ప్రతి పాఠశాలలో 6 డార్మెటరీ గదులు, రెండేసి మరుగుదొడ్ల బ్లాక్‌లను నిర్మాణం చేయనున్నారు.

**ఏయే కేజీబీవీలకు**

అనకాపల్లి: మాకవరపాలెం, కశింకోట, కోటవురట్ల, నాతవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, అచ్యుతాపురం, మాడుగుల, ఎస్. రాయవరం, రావికమతం, రోలుగుంట, దేవరాపల్లి, నర్సీపట్నం.

అల్లూరి: గంగవరం, ఎటపాక, కూనవరం, మారేడుమిల్లి, కొయ్యూరు, జి.కె.వీధి, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, డుంబ్రిగుడ, పెదబయలు, చింతపల్లి, అడ్డతీగల, హుకుంపేట

**రూ. 9.5 కోట్లతో మౌలిక సదుపాయాలు**

అదనపు భవనాలు నిర్మిస్తూనే ఇతర మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం నిధులు ఖర్చుచేస్తున్నారు. ఒక్కో కేజీబీవీలో రూ. 18.5 లక్షలతో కంప్యూటర్ గది, రూ. 23.10 లక్షలతో గ్రంథాలయం, రూ. 18.5 లక్షలతో ఆర్ట్, క్రాఫ్ట్ రూమ్‌తో పాటు మేజర్, మైనర్ రిపేర్లు, రక్షణ గోడలను నిర్మిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో రూ. 7.75 కోట్లు, అల్లూరి జిల్లాలో 1.5 కోట్లు వీటి కోసం వెచ్చిస్తున్నారు.

**సమస్యలన్నీ పరిష్కారం..**

కస్తూర్బా పాఠశాలలకు ప్రభుత్వం భారీగా నిధులిచ్చింది. వీటితో వచ్చే విద్యాసంవత్సరంలోగా అదనపు భవనాలు అందుబాటులోకి తెచ్చి వసతి సమస్య పరిష్కరించేలా చూస్తాం. కంప్యూటర్, లైబ్రరీలకు డబ్బులు ఇచ్చారు. వీటితో నాణ్యమైన విద్యను అందించడానికి అవకాశం ఉంటుంది. డా. స్వామినాయుడు, ఏపీసీ, సమగ్ర శిక్ష, అల్లూరి జిల్లా

# ప్రకాశానికి సౌరశక్తి

తాళ్లూరు : ప్రకాశం.. ఓ వెనుకబడిన ప్రాంతం. ప్రభుత్వ భూములు విస్తారం. సద్వినియోగం చేసుకుంటే వనరులూ పుష్కలం. పాలకుల దూరదృష్టి లోపమే ఓ శాపం. ఈ పరిస్థితులను అధిగమించేలా 2014-19 కాలంలో తెదేపా ప్రభుత్వం పరిశ్రమలు, సౌర పార్కుల ఏర్పాటుకు కొన్ని అడుగులేసింది. ఆ తర్వాత అధికారంలోకి వైకాపా వాటన్నింటినీ అయిదేళ్లపాటు మూలకు నెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిరిగి వనరుల సద్వినియోగం.. అభివృద్ధి మరింత ఊపందుకునేందుకు అవసరమైన చర్యలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా జిల్లా ప్రకాశానికి మరింత సౌర శక్తిని ఇవ్వాలనే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. దొనకొండ మండలంలోని రుద్రసముద్రం, కనిగిరి నియోజకవర్గం సీఎస్‌పురం ప్రాంతాల్లో సౌర పార్కులను ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విద్యుత్తు శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం శాసనసభలో ఈ మేరకు ప్రకటించారు. వంద గిగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తికి వీలుగా నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. దీంతో జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**అవకాశాలకు తెరుచుకుంటున్న తలుపులు:** ఒక్కో సోలార్ పార్క్ ఏర్పాటుకు సుమారు 5,500 ఎకరాల వరకు భూములు అవసరం. దొనకొండ మండలంలో ప్రభుత్వ భూములు సుమారు 25,063 ఎకరాలున్నాయి. రుద్రసముద్రం పరిసర ప్రాంతాల్లోనే సుమారు 5,700 ఎకరాల వరకు లభ్యమవుతాయి. సీఎస్‌పురం మండలం



పెదగోగులపల్లి, ముసునూరు పరిసరాల్లోనూ అయిదు వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములున్నాయి. సాధారణంగా ఒక పరిశ్రమ ఏర్పాటైతే చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలొస్తాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో చిన్నాచితకా వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. అభివృద్ధి వేగవంతమవుతుంది. ఆయా చోట్ల భారీ పెట్టుబడులతో సోలార్ పార్కులు ఏర్పాటైతే జిల్లాకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ దిశగా మంత్రి అసెంబ్లీలో ప్రకటన చేయడంపై జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**అల్లినగరంలో భూముల పరిశీలన**

సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం అల్లినగరం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను తహసీల్దార్ డి. భాగ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 523లోని 6.70 ఎకరాల ప్రభుత్వ భూములను మండల సర్వేయర్ సిలార్ ఖాన్, వీఆర్వో రమణయ్య, సర్వేయర్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి ఆమె సందర్శించారు. దస్త్రాలు పరిశీలించారు. నివేదికను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

# ఎత్తిపోతల రాగి ఎత్తుకెళ్లారు..!

ఆమదాలవలస : జిల్లాలో ఎత్తిపోతల పథకాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు ఉపకేంద్రాల్లోని నియంత్రికలకు సంబంధించిన రాగి, ఇతర పరికరాలు చోరీకి గురవుతున్నాయి. వరుస ఘటనల నేపథ్యంలో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారుతోంది. సబ్‌స్టేషన్లు పని చేయకపోవడంతో పథకాల ద్వారా సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ కాపలా ఉండదని తెలిసి చోరీలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అచ్చెన్న చొరవతో ఏర్పాటు..**

టెక్కలి, కోటబొమ్మాళి, చిన్నసాన, మదనగోపాలపురం, సుభద్రాపురం, తొగిరి, టెక్కలిపాడు ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాల ఉపకేంద్రాల నియంత్రికల్లోని కాపర్, ఆయిల్ గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఖరీఫ్ సాగుకు ఇబ్బంది లేకుండా సాగునీరు సరఫరా చేయడానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ తీసుకుని సుమారు రూ. 80 లక్షలు మంజూరు చేయించారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు కొత్త



సామగ్రి ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ ఈసర్లపేట వద్ద బొడ్డేపల్లి రాజగోపాలరావు అక్కులపేట ఎత్తిపోతల పథకం సబ్‌స్టేషన్‌లోని నియంత్రికలో గుర్తు తెలియని వ్యక్తులు కాపర్, ఆయిల్ కాజేశారు. మంగళవారం సర్పంచి బొడ్డేపల్లి గౌరీపతిరావు, రైతులు పథకాన్ని పరిశీలించడానికి వెళ్లారు. ఉపకేంద్రం చుట్టూ కంచె తొలగించి ఉండటంతో విద్యుత్తు శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి తనిఖీ చేశారు. చోరీకి గురైన సామగ్రి విలువ రూ. 10 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. సర్పంచి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బాలరాజు చెప్పారు. కోటబొమ్మాళి మండలం నారాయణపురం, జలుమూరు మండలం రామచంద్రాపురం, నౌతళ ఎత్తిపోతల పథకాల ఉపకేంద్రాల్లోనూ గతంలో ఈ తరహా చోరీలు జరిగాయి. పథకాలు పని చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**నిధులు మంజూరు చేయిస్తాం..**

– కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

ఆమదాలవలస మండలం అక్కులపేట బొడ్డేపల్లి రాజగోపాలరావు ఎత్తిపోతల పథకం గత ఐదేళ్లు సక్రమంగా పని చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. రూ. 5 లక్షలు మంజూరు చేయడంతో మరమ్మతులు చేపట్టి ఖరీఫ్‌లో సాగునీరు అందించాం. ఉపకేంద్రం నియంత్రికలో సామగ్రి చోరీకి గురవడంతో ఖరీఫ్‌లో నీరందించాలంటే రూ. 10 లక్షలు అవసరమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తాం.

**చోరులను పట్టుకుంటాం..**

– వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల నియంత్రికల్లో సామగ్రి చోరీలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. చోరులను పట్టుకునేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. గతంలో పలువురిని అరెస్టు చేశాం. చోరీలు జరగకుండా నిఘా పెడతాం.

# ‘బైబై’జూస్

చిత్తూరు : మేనమామని.. అన్నీ చూసుకుంటా అంటూ నాటి వైకాపా ప్రభుత్వ అధినేత జగన్ పలికిన బీరాలు నేతిబీర చందంలా మారాయి.. నాటి పాలకుల అనాలోచిత నిర్ణయాలు, అంతకుమించి నిర్లక్ష్యం విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సింది పోయి కొందరిని వ్యసనాలకు లోనయ్యేలా చేసింది.. నానా హడావుడి చేసి బైజూస్ సాంకేతిక పరిజ్ఞానం పేరిట అందించిన ట్యాబులకు నేడు బైబై చెప్పాల్సి వచ్చింది.. ఆ సాంకేతికత నేడు పూర్తిగా కనుమరుగైంది. వైకాపా హయాంలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు బైజూస్ ట్యాబ్‌లను ఉచితంగా అందజేశారు. అరకొర



పాఠ్యాంశాలను ఆర్భాటంగా అందులో అప్‌లోడ్ చేశారు.

**అరకొర కంటెంట్..** బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నా అన్ని సబ్జెక్టులను ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయకపోవడం, చేసిన సబ్జెక్టుల్లో కొన్ని పాఠ్యాంశాలను పొందుపరచక పోవడం, నమోదు చేసిన పాఠ్యాంశం పూర్తి స్థాయిలో లేకపోవడం విద్యార్థులకు అశనిపాతంగా పరిణమించింది. ఫలితంగా అరకొర బోధనే సాగింది. పాఠ్యాంశాలు కూడా విపులంగా వివరించకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉన్న కంటెంట్ కూడా ఓ దశలో ఓపెన్ కాకపోవడంతో నానా తిప్పలు పడ్డారు.

**ట్యాబ్‌తో ఆటలు..**

పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థులు పుస్తకాలను పక్కన పడేసి వీటితో ఆడుకోవడం అలవాటుగా మారింది. ఆన్‌లైన్ గేమ్స్ డౌన్‌లోడ్ చేసుకుని ఆడటమే కాక డబ్బులు పెట్టి ఆడటం.. ఇలా ఎంతో విలువైన సమయాన్ని వీటితో దుర్వినియోగం చేసుకుంటున్నారు. నాడు మొదటగా వీటిని పొందిన విద్యార్థులే ఈ నెల 17 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు.

# విలీనం..సేవలు ఘనం

చిత్తూరు : సచివాలయాల సేవల్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హేతుబద్ధీకరణకు నిర్ణయించింది. ఇందులో భాగంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించనున్నారు. ఈ మేరకు విధివిధానాలు రూపొందించాలని పాలనా విభాగం, మండల పరిషత్తులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది.

గ్రామ సచివాలయాల్లో 11 మంది, పురపాలక/నగర పాలక పరిధిలో తొమ్మిది మంది చొప్పున సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం వీరిని పలు విభాగాలుగా విభజించనున్నారు. బహుళార్థక విభాగంలో నాలుగు కేటగిరీల ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ సహాయకులు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఉంటారు. సర్వే పనులు వీరు నిర్వహిస్తారు. ఇతర సేవలు క్లస్టర్ స్థాయిలో అందిస్తారు. సాంకేతిక విభాగంలో వ్యవసాయ, ఉద్యాన, ఇంజినీరింగ్, ఆరోగ్య, పశు సంవర్ధక, విద్యుత్తు సహాయకులు సర్వేయర్లు ఉంటారు. ఆస్పిరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ప్రవేశం ఉన్న ఉద్యోగులను




గుర్తించి ఈ విభాగంలో చేర్చనున్నారు. వీరిని ఐటీ అవసరాలకు వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రెవెన్యూ విభాగంలో వీఆర్వోలు, సర్వేయర్లు ఉంటారు. మహిళా పోలీసులను ఐసీడీఎస్, పోలీసు స్టేషన్లలో నియమిస్తారు.

సచివాలయాలు :612

ప్రతిపాదిత క్లస్టర్లు: 310

ఉద్యోగులు : 4,432 మంది

**మండల అధికారుల పర్యవేక్షణలో..**

ప్రతి మండలంలో సమీపంలోని సచివాలయాలను క్లస్టర్లుగా పరిగణిస్తారు. సచివాలయాలు సరి సంఖ్యలో ఉంటే సగం క్లస్టర్లు ఏర్పాటవుతాయి. బేసి సంఖ్యలో ఉంటే ఒక క్లస్టరు పరిధిలోకి మూడు సచివాలయాలు తీసుకొస్తారు. బహుళార్థక విభాగంలో జనాభా ప్రాతిపదికన, సాంకేతిక విభాగంలో క్లస్టరు పరిధిలో ఉద్యోగులను గుర్తిస్తారు. వీరు రెండేసి సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంటుంది.

# యువతకు ‘సౌర’భం

నాయుడుపేట : ప్రీమియర్ ఎనర్జీ సంస్థ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆహ్వానం మేరకు మేనకూరు పారిశ్రామికవాడలో రూ.1,700 కోట్లతో సౌర ప్లాంటు ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. ఇందుకు 169 ఎకరాలు కేటాయించారు. ఈ ప్లాంటు ద్వారా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు వేల మంది ఇంజినీరింగ్ యువతకు ఉపాధి లభించనుంది.

నాలుగు గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమలో సౌర సెల్, మాడ్యూల్ తయారీకి అవసరమైన సిలికా ఇసుక, కార్బన్ వంటి ముడి సరకులు కూడా దగ్గరగా ఉండటం మేనకూరు ప్రాంతంలో ప్రీమియర్ ఎనర్జీ ప్లాంటుకు అనుకూలంగా మారింది. సౌర ప్లాంటు పరిశ్రమలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, మెకానిక్ ఇంజినీరింగ్ విభాగాల్లో బీటెక్, డిప్లొమా, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన యువతకు రెండు వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. గృహ, వాణిజ్య పరిశ్రమల్లో 60 శాతం వరకు సౌర విద్యుత్తును వినియోగించి.. మిగిలిన 40 శాతం థర్మల్ పవర్ వినియోగించే సంకల్పంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతులకు చెందిన బీడు భూములు, ఇతర భవనాలు పరిశ్రమల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల ద్వారా సౌర పలకలు ఏర్పాటుకు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లోనూ సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచాలని ప్రభుత్వం యత్నిస్తోంది.

వచ్చే ఏడాది జూన్ నాటికి ఉత్పత్తులు ప్రారంభించే అవకాశం ఉంది. మేనకూరు పారిశ్రామిక వాడలో గ్రీన్‌టెక్, టీవీఎస్ ఆటో మొబైల్స్ కంపెనీలు ఉండగా ఎలక్ట్రికల్ రంగంలో ప్రైమ్ ఎలక్ట్రికల్ కంపెనీ ఉంది. తాజాగా సౌర ప్లాంటు ద్వారా ఎలక్ట్రానిక్ పరిశ్రమ కూడా ఏర్పాటు కానుంది.

# చదువు సంతకెళ్తోంది..!



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వం బైజూస్ కంటెంట్ పేరుతో పంపిణీ చేసిన ట్యాబులు దుర్వినియోగం కారణంగా విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన యాప్‌లతోపాటు సినిమాలు, ఆన్‌లైన్ గేమ్స్ ఆడే అప్లికేషన్లను వాడుతూ కొందరు విద్యార్థులు చదువును పూర్తిగా పక్కనపెట్టి రోజంతా ట్యాబుల్లోనే మునిగిపోతున్నారు. పాఠశాలల్లో విరామ సమయాల్లో, ఇంటి వద్ద సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల మధ్యలో వినోద కార్యక్రమాలు చూస్తూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. రెండేళ్ల కిందట ట్యాబులు తీసుకున్న 8వ తరగతి విద్యార్థులు ప్రస్తుతం 10వ తరగతిలో ఉన్నారు. వాటి కారణంగా పరీక్షలపై దృష్టి పెట్టకుండా కాలక్షేపం చేస్తుండటంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అలవాటు పడిపోతున్నారు**

గత వైకాపా ప్రభుత్వం 2022లో ఉమ్మడి జిల్లాలోని 8, 9, 10 తరగతులకు చెందిన 82 వేల మంది విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఒక్కో ట్యాబుకు రూ.12,800తోపాటు బైజూస్ కంటెంట్‌కు రూ.20వేల వరకు వెచ్చించారు. ట్యాబులో ‘ఏపీ ఈ-పాఠశాల’, బైజూస్ ప్రీమియం, డ్యూలింగో, థింక్ అండ్ లెర్న్ వంటి యాప్‌ల ద్వారా విద్యార్థులకు కంటెంట్ అందించేవారు. మిగతా యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకుండా రక్షణ కల్పించినట్లు అప్పట్లో ప్రభుత్వం పేర్కొంది. సాఫ్ట్‌వేర్‌లో లోపాల కారణంగా సాంకేతిక పరిజ్ఞానం ఉన్న విద్యార్థులు స్వయంగా ట్యాబ్‌లో రీసెట్ చేసుకున్నారు. మరికొందరు మొబైల్ సెంటర్ల వద్దకు వెళ్లి రక్షణ వ్యవస్థను తొలగించుకున్నారు. ఇంటి వద్ద తల్లిదండుల వైఫైతో అనుసంధానం చేసుకుని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తోపాటు వివిధ రకాల ఆటలను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకుంటున్నారు. కొంతమంది అంతర్జాలంలోని అశ్లీల కంటెంట్‌కు ఆకర్షితులైనట్లు ఉపాధ్యాయులు గుర్తించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల నుంచి ట్యాబులు తీసుకుని వినోద యాప్‌లను తొలగించి తిరిగి ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి.

**రీల్స్ చూస్తూ సమయం వృథా..**

లాకింగ్ వ్యవస్థలో లోపాల కారణంగా విద్యార్థులు ట్యాబుల్లో వినోద యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని చూస్తున్నారు. తమ పిల్లలు ఎక్కువగా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తూ సమయాన్ని వృథా చేసుకుంటున్నట్లు కొందరు తల్లిదండ్రులు పేర్కొన్నారు. పాఠశాలల్లోనూ విరామ సమయాల్లో ఆటలు ఆడుకోకుండా గుంపులుగా చేరి ట్యాబుల్లో వినోద కార్యక్రమాలను వీక్షిస్తున్నారు. వీటి ద్వారా తెలివితేటలు పెంచుకోవడం మాట అటుంచితే.. చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ట్యాబ్‌ల వల్ల విద్యార్థులు పెడదోవ పట్టకుండా కట్టడి చేసే బాధ్యతను ఉపాధ్యాయులతోపాటు ప్రభుత్వం కూడా తీసుకోవాలని కోరుతున్నారు. లాకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఇవ్వాలని సూచిస్తున్నారు. లేదంటే మంచి కంటే చెడే ఎక్కువ జరిగే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**దుర్వినియోగం చేస్తున్నారు** దబ్బల శ్రీరాములు, విద్యార్థి తండ్రి, దామాజిపల్లిట్యాబ్‌లు విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న సమయంలో చాటుగా వాటితో కాలక్షేపం చేస్తున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, జనరల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు ప్రభుత్వం వీటిని అందిస్తే దుర్వినియోగం చేస్తున్నారు. ఇతర విద్యార్థులు సైతం వాటికి ఆకర్షితులవుతూ చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి.

# డీసీఎంఎస్ దుకాణాల్లో బినామీల దందా




అనంతపురం : సొమ్ము ఒకరిది....సోకు మరొకరిది.. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)కి అతికినట్లు సరిపోతుంది. సొసైటీ ప్రధాన కార్యాలయం ముందు నిబంధనలకు విరుద్ధంగా బినామీ పేర్లపై నిర్మించిన దుకాణ సముదాయంపై జిల్లా సహకార శాఖ అధికారుల ఆరా తీస్తున్నారు. వైకాపా హయాంలోనే వాటిని నిర్మించారు. డీసీఎంఎస్ గత పాలకవర్గ హయాంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేయడానికి ఏ అధికారి సాహసం చేయలేకపోయారు. గతంలో ఓ అధికారి ప్రయత్నం చేయగానే వెంటనే బదిలీ చేయించడంతో తర్వాత వచ్చిన వారూ కాలయాపన చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 8 నెలలు గడిచినా బినామీల దందాను బయటపెట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. లక్షలాది రూపాయలు సొసైటీ ఆదాయానికి గండిపడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దుకాణాల నిర్మాణం, అద్దె నిర్ణయం అంతా నిబంధనలు తుంగలో తొక్కేశారు. అసలు నిర్మాణాలే చేపట్టరాదని సహకార శాఖ అధికారులు ఆదేశాలిచ్చినా బేఖాతరు చేశారు. అనంత నగరం నడిబొడ్డున ప్రైవేటు వ్యక్తులు సొంత పెట్టుబడితో నిర్మించి అద్దెకు ఇచ్చుకున్నారు. డీసీఎంఎస్‌కు రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారు.

**నిబంధనలకు పాతర...**

సహకార సొసైటీలో ఏ నిర్మాణం చేపట్టాలన్నా ఆ శాఖ రిజిస్ట్రార్ అనుమతి తప్పనిసరి. డీసీఎంఎస్‌లో నిర్మించిన 14 దుకాణాలకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ప్రైవేటు వ్యక్తుల ద్వారా డిపాజిట్లు సేకరించి నిర్మాణాలు చేపట్టారు. సహకార చట్టానికి పూర్తిగా విరుద్ధమని అప్పట్లో అధికారులే అన్నారు. నిర్మాణం పూర్తి చేయడం ఒక ఎత్తయితే.....అద్దె నిర్ణయంలోనూ ప్రైవేటు వ్యక్తులే పెత్తనం చెలాయించారు. నిర్మాణానికి వారు ఖర్చు పెట్టిన మొత్తం అడ్వాన్సు రూపంలో లాగేసుకున్నారు. ఇదంతా లోగుట్టుగానే సాగిపోతోంది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన దుకాణాలు: 14

అద్దెకు ఇచ్చింది: ఏప్రిల్, 2021

డీసీఎంఎస్‌కు చెల్లిస్తున్న (ఒక్కో దుకాణానికి)అద్దె : రూ.4,500

గుత్తేదారు రాబట్టేది: రూ.10వేలు

అడ్వాన్సుగా వసూలు చేసింది: రూ.15 లక్షలు

**విచారణ చేయిస్తాం..**

అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారిణి

డీసీఎంఎస్ ఆవరణలో అక్రమంగా నిర్మించిన దుకాణాలపై ఆరా తీస్తున్నాం. ఆరోపణలు రాయడంతో సమగ్ర విచారణ చేయాలని నిర్ణయించాం. నిర్మాణ అనుమతులు, అద్దె, గుత్తేదారులు ఎవరన్న దానిపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం.

# ఎట్టకేలకు హుద్‌హుద్ గృహాలకు మోక్షం



కొమ్మాది : హుద్‌హుద్ తుపానులో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకొనేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం ‘ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం’ పేరిట ప్రత్యేక నిధులు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకొంది. గత వైకాపా పాలనలో అవేవీ పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. టెండర్లు పిలిచి రూ.8 కోట్లు నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది.

‘ప్రీ-ఫ్యాబ్రికేటెడ్’ సాంకేతిక పరిజ్ఞానంతో గ్రౌండ్3 తరహాలో కొమ్మాది సర్వే సంఖ్య 83లో 19 బ్లాకుల్లో 608 గృహాలు, పరదేశిపాలెం సర్వే సంఖ్య 21లో 6 బ్లాకుల్లో 192 గృహాలను హుద్‌హుద్ బాధితులకు పునరావాసం కింద తెదేపా ప్రభుత్వం ప్రారంభించింది. ఆపై వైకాపా హయాంలో ఆయా గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టలేదు. కొన్ని బ్లాకులకు కిటికీలు, గుమ్మాలు అమర్చినా అవి తుప్పుపట్టిపోయాయి. తలుపులు సైతం చెదపట్టాయి. సింటెక్స్ ట్యాంక్‌లు ఎగిరిపోయాయి. మెట్ల మార్గాలు ధ్వంసమయ్యాయి. స్విచ్ బోర్డులు, పైపులు తస్కరణకు గురయ్యాయి.

ఈ ప్రాజెక్టులను తొలుత పాండే ఇన్‌ఫ్రాకాన్ సంస్థకు కేటాయించగా నిబంధనల మేరకు అన్ని పనులు పూర్తిచేయక పోవడంతో ఆ కాంట్రాక్టును ప్రభుత్వం రద్దు చేసింది. మరో సంస్థ సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్‌కు పనులు అప్పగించింది. ఆ సంస్థ సైతం తాత్సారం చేయడంతో రద్దు చేసింది. తాజాగా మరోసారి టెండర్లు పిలిచి టి.వై.నాయుడు అండ్ కో సంస్థకు పనులు కేటాయించింది.

ఒక్కోటి చక్కదిద్దుతూ.. ఆయా గృహ సముదాయాల్లో కిటికీలు, గుమ్మాలు అమర్చుతున్నారు. ధ్వంసమైన మెట్ల మార్గాల్ని చక్కదిద్దుతున్నారు. రంగులు వేస్తూ ప్లంబింగ్, యూజీడీ పనులు చేపడుతున్నారు. అంతర్గత రహదారులతో పాటు కాలువలు నిర్మిస్తున్నారు. లబ్ధిదారుల సొంతింటి కల నెరవేర్చేందుకు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

# అప్రమత్తం కాకుంటే అంతే!

తిరుపతి : ఎండల ప్రభావం పెరగడంతో విద్యుత్తు డిమాండ్ అధికమై సరఫరాలో అంతరాయాలు హెచ్చుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆసుపత్రుల్లో అత్యవసర ఏర్పాట్లు చేసుకోవాలి.. వాటి నిర్వహణపై శ్రద్ధ పెట్టాలి. తిరుపతి రుయా ప్రభుత్వాసుపత్రిలో ఈ విషయం నిర్లక్ష్యం వెంటాడుతోంది. తరచూ జనరేటర్ మొరాయించడం పరిపాటిగా మారింది. వెంటిలేటర్‌పై ఉన్న విలువైన ప్రాణాలను సంరక్షించుకోవాలంటే యూపీఎస్ బ్యాకప్ సామర్థ్యం మరింతగా పెంచుకోవాల్సి ఉంది. రుయాకు ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. 500 కేవీ మూడు, 350 కేవీ సామర్థ్యం ఉన్న విద్యుత్తు నియంత్రికలున్నాయి. వాటి ద్వారా 1,260 పడకల సామర్థ్యం ఉన్న ఐపీ వార్డులు.. ఓపీ, వైద్య పరికరాలకు విద్యుత్తు సరఫరా అందిస్తున్నారు. ఇటీవల అక్యూట్ కేర్ సెంటర్, జీరియాట్రిక్ వార్డు, సిటీ డయాగ్నోస్టిక్ భవనం అందుబాటులోకి విద్యుత్తు అవసరాలు పెరిగాయి. ఈ క్రమంలో వేసవిలో విద్యుత్తు అంతరాయాలు పెరిగే అవకాశం ఉండటంతో మరో వెయ్యి కేవీ సామర్థ్య విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేయాలి. అకస్మాత్తుగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే జనరేటర్లు వెంటనే స్టార్ట్ అయ్యేలా నిర్వహణ పనులు చేయాలి. బాధ్యత లేనట్లుగా ప్రవర్తించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.



**నిత్యం వెంటిలేటర్‌పై వంద మంది**

రుయాలో సుమారు వంద మంది రోగులు వెంటిలేటర్‌పై ఉంటారు. అత్యవసర విభాగంలోని ఆర్ఐసీయూ, ఐడీహెచ్, ప్రధాన భవనంలో సుమారు 50 వెంటిలేటర్ పడకలు ఉన్నాయి. చిన్నపిల్లల విభాగంలో పీఐఎస్‌యూ, ఎన్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ వార్డులో సుమారు 60 వెంటిలేటర్ పడకల్లో రోగులు ఉన్నారు. ఆక్సిజన్ సరఫరాకు అవసరమైన విద్యుత్తు అకస్మాత్తుగా ఆగిపోతే.. యూపీఎస్‌ల ద్వారా విద్యుత్తు సరఫరా అవుతుంది. 20 కేవీ యూపీఎస్‌లు క్యాజువాలిటీ, పీడియాట్రిక్ విభాగాల్లో ఉన్నా బ్యాకప్ సామర్థ్యం తక్కువగా ఉంది. ప్రస్తుత బ్యాకప్‌ల సామర్థ్యం గంటపాటు సరఫరాకు సరిపోదని సమాచారం. అధికారులు మాత్రం రెండు గంటలు బ్యాకప్ వస్తోందని చెబుతున్నారు. పెరిగిన పడకలకు తగ్గట్టుగా బ్యాకప్ సామర్థ్యం పెంచాల్సి ఉంది.

# ‘అమృత్’ధారలు

డోన్ : డోన్ పురపాలికలో మంచినీటి కష్టాలు తీరనున్నాయి.. పట్టణానికి అమృత్ 2.0 పథకం కింద ఎంపిక చేశారు. మున్సిపల్ అధికారులు నివేదిక రూపొందించారు. ఇందుకు ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ విభాగం ఆమోద ముద్ర వేసింది. సాంకేతిక అనుమతులు రాగానే ప్రజారోగ్యశాఖ టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

**తీరనున్న కష్టాలు**

రైతుమిత్ర కాలనీ, కృష్ణానగర్, పాతపేట శివారు వీధులు, శ్రీనివాసనగర్, ఆటోనగర్, కొత్త ఇందిరానగర్, సుజాతమ్మనగర్, విజయభాస్కరరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు నోచుకోలేదు. ఈ ప్రాంతాల్లో త్వరితగతిన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



**చేపట్టనున్న పనులు**

అమృత్ 2.0 పథకం కింద రూ.23.56 కోట్లు మంజూరయ్యాయి. పాతపేటలో రూ.1.90 కోట్లతో నీటి ట్యాంకు, కొండపేటలో రూ.2.25కోట్లతో నీటి ట్యాంకు నిర్మాణాలు చేపట్టనున్నారు.

అవసరమున్న ప్రాంతాల్లో రూ.9.94 కోట్లతో 40కి.మీ. మేర పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. రూ.1.50 కోట్లతో నీటి పంపింగ్ లైన్, 600 కుళాయి కనెక్షన్ల కోసం రూ.12 లక్షలు, పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న శుద్ధినీటి ప్లాంటు ప్రాంగణంలో రూ.1.22కోట్లతో 4.80 కేఎల్ సామర్థ్యమున్న రెండు ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

**త్వరలోనే పనులు ప్రారంభం - సురేష్, మున్సిపల్ ఏఈ, డోన్**

అమృత్ పథకం నిధులతో నీటి ట్యాంకులు, నీటి గొట్టాలు లేని ప్రాంతాలతో పాటు విస్తరించిన కాలనీల్లోనూ నీటి గొట్టాలను ఏర్పాటు చేయనున్నారు. డీపీఆర్ అనుమతులు వచ్చిన నేపథ్యంలో సాంకేతిక అనుమతులకు నివేదించాం. అనుమతులు రాగేనే ప్రజారోగ్యశాఖ వారికి అప్పగిస్తాం. వారు టెండర్లు పిలిచి అభివృద్ధి పనులు చేపడతారు.

# వందేళ్ల భవంతికి పూర్వ వైభవం

ఏలూరు : కన్నతల్లిని, జన్మభూమిని మర్చిపోకూడదని..ఏలూరు గ్రామీణ పరిధిలోని స్వగ్రామం చాటపర్రులో తన వందేళ్ల ఇంటిని ఆధునీకీకరించి పూర్వీకుల జ్ఞాపకాలను పదిలం చేశారు సినీ నటుడు మురళీమోహన్. మంగళవారం కుటుంబ సమేతంగా గృహ ప్రవేశం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అద్భుత నిర్మాణం.. ఇందిరా విలాసం.. 1925లో మురళీమోహన్ తాతయ్య, నానమ్మ చాటపర్రులో 18 అంగుళాల మందం గోడలతో కేవలం సున్నంతో ఇంటి నిర్మాణం చేపట్టారు. కిటికీలు, తలుపులు, సింహద్వారం తలుపులు ప్రత్యేకమైన కలపతో ఏర్పాటు చేశారు. వందేళ్లయినా ఇంటి గోడలు చెక్కు చెదరలేదంటే నిర్మాణ నాణ్యత స్పష్టమవుతోంది. నిర్మాణానికి వినియోగించిన ఇనుము మొదలు ఇతర వస్తువులను విదేశాల నుంచి రప్పించారు. అప్పట్లో దీనికి ఇందిరా విలాసం అని పేరుపెట్టారు. ఈ గృహంలోనే మురళీమోహన్ పుట్టి పెరిగారు. దీంతో ఆయనతో పాటు పూర్వీకుల అనుభూతులు భద్రపరిచేందుకు పాత నిర్మాణ ఛాయలు..ఆకృతులు ఏమీ మార్చకుండా ఖర్చుకు వెనుకాడకుండా మూడేళ్ల పాటు నిర్మాణం చేశారు.ప్రజాసేవ కోసమే.. మురళీమోహన్ తన తల్లిదండ్రుల మరణానంతరం..పరిసర ప్రజల అవసరాల కోసం ఆసుపత్రి నిర్వహణ కోసం ఇచ్చారు. కొంత కాలానికి భవనం శిథిలావస్థకు చేరడంతో ఆసుపత్రిని మరోచోటికి మార్చారు. ప్రస్తుతం ఇంటి పనులు పూర్తి అయిన నేపథ్యంలో ప్రజలకు ఉపయోగపడేందుకు ఇంటిని కేటాయిస్తానంటూ మురళీమోహన్ ప్రకటించారు. ఏఐ వంటి కొత్త సాంకేతికతను విద్యార్థులకు చేరువ చేసేందుకు భవనంలో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

చురకలు



## ఎటూ తేల్చుకోలేకపోతున్న ఐశ్వర్య

సక్సెస్, ఫెయిల్యూర్ రెండూ ఆర్టిస్టులకు నిద్ర పట్టనీయవు. ఒకవేళ సక్సెస్ వస్తే ఆ సక్సెస్ ను ఎలా నిలుపుకోవాలా అని ఆలోచిస్తూ తర్వాతి సినిమాల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. అదే ఫ్లాప్ అయితే తర్వాతి సినిమా అయినా ఇంకా బెటర్ గా ఉండాలని ఆ కోణంలో జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. అందుకే ఆర్టిస్టుని హిట్టూ, ఫ్లాపూ ఊపరాడనీయకుండా చేస్తాయంటారు. ఇప్పుడు తెలుగమ్మాయి ఐశ్వర్యా రాజేష్ కూడా అలాంటి పరిస్థితే ఎదుర్కొంటుంది. ఐశ్వర్యా రాజేష్ పేరుకే తెలుగమ్మాయి కానీ అమ్మడు తమిళంలోనే బాగా పాపులరైంది. తమిళంలో ఐశ్వర్య రాజేష్ ఎన్నో సినిమాలు చేసింది. వెంకటేష్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ మూవీ సంక్రాంతికి వస్తున్నాంతో ఐశ్వర్యా రాజేష్ ఈ ఏడాది మంచి హిట్ అందుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలో భాగ్యం పాత్రలో ఐశ్వర్యా రాజేష్ నటనకు అందరూ ఫిదా అయ్యారు. వెంకటేష్ తో పోటీ పడి మరీ ఐశ్వర్య ఆ సినిమాలో నటించింది.



అయితే సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో పాటూ అమ్మడి పాత్రకు కూడా మంచి ప్రశంసలు రావడంతో ఐశ్వర్యకు వరుస ఆఫర్లు వస్తాయని, ఆమె కూడా వరుస పెట్టి సినిమాలు చేస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పటివరకు ఐశ్వర్య తన నెక్ట్స్ తెలుగు సినిమాను ఇంకా అనౌన్స్ చేయలేదు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో అందుకున్న సక్సెస్ ను కంటిన్యూ చేయాలని ఐశ్వర్యా రాజేష్ ఎంతో జాగ్రత్తగా ఉంటూ తర్వాతి సినిమాల ఎంపికలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ఎటూ తేల్చుకోలేకపోతుంది. కాస్త లేటైనా సరే మంచి కథ వచ్చే వరకు సినిమాను ఒప్పుకోకూడదని డిసైడింది ఐశ్వర్యా. ఆల్రెడీ రెండు స్క్రిప్ట్స్ ను పూర్తి చేసిన ఐశ్వర్య ఈ ఏడాది తర్వాత వాటిని అనౌన్స్ చేసే ఛాన్సుంది. తమిళంలో కరుప్పర్ నగరం, మోహన్ దాస్ మరియు తీయావర్ కులైగల్ నడుంగ సినిమాలకు కమిట్ అయిన ఐశ్వర్యా ఆల్రెడీ షూటింగ్ లో ఉన్న కన్నడ సినిమా ఉత్తరాకాండలో కూడా నటిస్తోంది. త్వరలోనే ఐశ్వర్య తన తెలుగు సినిమాను ప్రకటించే అవకాశముంది.

## సీక్వెల్‌లో ఆమె ఎందుకు లేదంటే..!

అజయ్ దేవగన్ హీరోగా రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వంలో రూపొందిన 'రైడ్ 2' సినిమా మే 1న విడుదల కాబోతుంది. 2018లో వచ్చిన రైడ్ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. రైడ్ సినిమాకు సీక్వెల్ అనగానే అందరూ అంచనాలు భారీగా పెంచుకున్నారు. రైడ్ సినిమా బాక్సాఫీస్ వద్ద సాధించిన భారీ విజయం నేపథ్యంలో సీక్వెల్‌కి కచ్చితంగా భారీ ఓపెనింగ్స్ నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అజయ్ దేవగన్ గత చిత్రాల ఫలితాలతో సంబంధం లేకుండా ఈ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే విషయాన్ని ఫ్యాన్స్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు నమ్మకంగా చెబుతున్నారు. 'రైడ్' సినిమాను తెలుగులో 'మిస్టర్ బచ్చన్' టైటిల్‌తో రీమేక్ చేసిన విషయం తెల్సిందే, రవితేజ హీరోగా నటించిన రీమేక్‌కి హరీష్ శంకర్ దర్శకత్వం వహించబోతున్నాడు. భారీ అంచనాలు ఉన్న ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. మిస్టర్ బచ్చన్ సూపర్ హిట్ అయ్యి ఉంటే కచ్చితంగా 'రైడ్ 2' సినిమా రీమేక్ వార్తలు ఇప్పటికే వచ్చి ఉండేది. రవితేజ కచ్చితంగా రైడ్ 2 పై ఆసక్తి కనబర్చే అవకాశాలు కనిపించడం లేదు. రైడ్ 2 సినిమా విడుదల



తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో అజయ్ దేవగన్‌తో పాటు హీరోయిన్ వాణి కపూర్ ఇతర యూనిట్ సభ్యులు మీడియా ముందుకు వచ్చారు. తాజా మీడియా సమావేశంలో హీరోయిన్ విషయమై మీడియా నుంచి ప్రశ్న వచ్చింది. మొదటి పార్ట్‌లో అజయ్ దేవగన్‌కి జోడీగా ఇలియానా నటించింది. కథకు కొనసాగింపు, పాత్రలు సైతం కొనసాగే సినిమాలకు ఎక్కువ శాతం నటీ నటులను కంటిన్యూ చేస్తూ ఉంటారు. ఆ లెక్కన రైడ్ 2 సినిమాలో హీరోయిన్‌గా ఇలియానా నటించాల్సి ఉంటుంది. కానీ ఆమె ఆకుండా వాణీ కపూర్‌ను హీరోయిన్‌గా నటింపజేశారు. ఆ విషయమై మీడియా వారు ప్రశ్నించిన సమయంలో అజయ్ దేవగన్ స్పందిస్తూ.. మీరు హాలీవుడ్‌లో ఎన్నో ఫ్రాంచైజీ సినిమాలు చూసి ఉంటారు. అందులో పాత్ర సేమ్ ఉంటుంది... కానీ అందులో నటించే నటీ నటులు వేరుగా ఉంటారు. రైడ్ 2 సినిమా విషయంలోనూ అదే జరిగింది. అజయ్ దేవగన్ సమాధానం సరిగా లేదంటూ సోషల్ మీడియాలో కొందరు కామెంట్ చేస్తున్నారు. తాజా మీడియా సమావేశంలో హీరోయిన్ వాణీ కపూర్ మాట్లాడుతూ... రైడ్ 1 సినిమాలో నటించిన హీరోయిన్‌పై తనకు ఎలాంటి ఈర్ష్య లేదు. పై పెచ్చు ఆమెతో నాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ సినిమా కథను నా వద్దకు రచయిత, దర్శకుడు తీసుకు వచ్చిన సమయంలో పాత్ర తీరును గురించి ఆలోచించాను. తప్పకుండా ఇది తన కెరీర్‌లో నిలిచి పోయే పాత్రగా నిలుస్తుంది అనే నమ్మకం కలగడం వల్ల నటించేందుకు ఒప్పుకున్నాను. అయితే సీక్వెల్‌లో ఇంతకు ముందు నటించిన హీరోయిన్ పాత్రలో నటించడం అనేది ముందస్తుగా క్లారిటీ లేదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది.




## బాద్‌షాలో చిలిపిదనం కూతురిలోను?



బాద్ షా షారూఖ్ ఖాన్ ప్రత్యేకత ఎందులో ఉంది? అంటే.. అతడి అభినయంలో అని సులువుగా చెప్పేయగలరు అభిమానులు. అతడి నవ్వు.. చూసే చూపు.. కొంటెదనం.. ఎక్స్ ప్రెషన్ ఏదైనా ప్రతిదీ యూనిక్ నెస్ తో యువతుల హృదయాలను గెలుచుకున్నాయి. అందుకే అతడు సల్మాన్, అమీర్ లాంటి ట్యాలెంటెడ్ స్టార్ల మధ్య కూడా తనదైన ప్రత్యేకతను నిలుపుకుని ఇండస్ట్రీని కింగ్ లా ఏలాడు. నాలుగు దశాబ్ధాల కెరీర్ లో పీక్స్ ని చూపించాడు. ముఖ్యంగా దిల్ వాలే దుల్హానియా లేజాయేంగే (డిడిఎల్‌జె) లాంటి ప్రేమకథా చిత్రంలో షారూఖ్ అభినయం నభూతోనభవిష్యతి. నిజమైన ప్రేమికుడు అంటే ఎలా ఉండాలి? అనేందుకు ఈ సినిమాలో అతడి పాత్ర బెంచ్ మార్క్ గా మారింది. కాజోల్ వెంటపడుతూ అతడు తన ప్రేమను ఆవిష్కరించే ప్రతి సన్నివేశంలో కింగ్ నటన అసమానం.

అందుకే ఇప్పుడు సుహానా ఖాన్ బాలీవుడ్ లో అడుగుపెడుతోంది అనగానే అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని ఈ భామ అలాంటి ప్రత్యేకమైన ఎక్స్ ప్రెషన్స్ తో ప్రేమకథలతో బరిలో దిగుతుందని అంతా భావించారు. కానీ అందుకు భిన్నంగా సుహానా ఆరంభమే యాక్షన్ సినిమాతో ఎంట్రీ ఇస్తోంది. ది ఆర్చీస్ వెబ్ సిరీస్ తనకు ప్రాక్టీస్ సెషన్ మాత్రమే. కానీ పెద్ద తెరపై తన ఆరంగేట్రాన్ని ఘనంగా చాటాల్సి ఉంది. అందుకే సుహానాపై అభిమానుల అంచనాలు ఒత్తిడిని పెంచుతున్నాయి. చాలా కాలంగా దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ కింగ్ చిత్రం స్క్రిప్టు పనులు సహా కాస్టింగ్ ఎంపికలలో బిజీగా ఉన్నాడు. ఎట్టకేలకు అన్ని పనులు పూర్తయ్యాయి. తండ్రీ కూతుళ్లు షారూఖ్ - సుహానాలను అతడు ప్రత్యేకంగా ఆవిష్కరించేందుకు అతడు ప్రయత్నిస్తున్నాడు. ఈ జోడీతో కింగ్ షూటింగ్ మేలో ప్రారంభం కానుండగా, ఈ చిత్రానికి సంబంధించిన తొలి షెడ్యూల్ ని ముంబైలోని పాపులర్ స్టూడియోలో ప్రారంభిస్తారు. ఆ తర్వాత యుఏఇ, యూరోపియన్ దేశాల్లోని ఎగ్జోటిక్ లొకేషన్లలో కీలక షెడ్యూల్ తెరకెక్కిస్తారు. యాక్షన్ పార్ట్ ని విదేశాల్లో విజువల్ రిచ్ గా, గ్రాండియారిటీతో రూపొందిస్తారని సమాచారం. కొన్ని యాక్షన్ సీన్స్ లో తండ్రీ కూతుళ్లు కలిసి కనిపిస్తారని కూడా టాక్ ఉంది. షారూఖ్ మరోవైపు పఠాన్ 2లో కూడా నటించాల్సి ఉంది.

## ఇండియన్ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తున్న మాస్టర్ మైండ్స్!




ఇప్పుడు ఇండియన్ సినిమాల్లో కొత్త ట్రెండ్ నడుస్తోంది. స్టార్ హీరోల కంటే కూడా దర్శకుల మధ్యే అసలైన పోటీ మొదలైపోయింది. అంతకంతకు భారీగా ఉండాలని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని టార్గెట్ పెట్టుకుంటున్నారు. స్కేల్, విజన్, టెక్నాలజీ పరంగా ఇప్పుడు దర్శకులే అసలైన హీరోలు అని చెప్పొచ్చు. ఇందులో ముందున్న పేరు ఎస్ఎస్ రాజమౌళి. ఆయన తండ్రి విజయేంద్ర ప్రసాద్ రాసిన కథ ఆధారంగా మహేష్ బాబుతో ఓ గ్లోబల్ అడ్వెంచర్ థ్రిల్లర్ రూపొందిస్తున్నారు. ఇది కేవలం పాన్ ఇండియా సినిమా కాదు. ప్రపంచ స్థాయి ప్రేక్షకులను టార్గెట్ చేసిన స్టోరీతో, హాలీవుడ్ స్టైల్ టెక్నికల్ ట్రీట్‌మెంట్‌తో రాజమౌళి ఈసారి అంతరిక్షం నుంచి అడవుల దాకా వెళ్లే యాత్రను తెరపై ఆవిష్కరించనున్నాడు. ఇక మరోవైపు సందీప్ రెడ్డి వంగా కూడా తన స్పీడ్ తగ్గించకుండా ముందుకెళ్తున్నారు. ఆయన దర్శకత్వంలో ప్రభాస్‌తో తెరకెక్కుతున్న "స్పిరిట్" అనే సినిమా కాప్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతుంది. ఇది యాక్షన్‌తో పాటు ఇంటెన్స్ ఎమోషన్లను మిళితం చేసే యూనివర్సల్ కాన్సెప్ట్‌తో వస్తోంది. సందీప్ స్టైల్‌లో మానసిక ఆవేశాలు, బలమైన పాత్రల డెవలప్‌మెంట్ ఉండటం గ్యారంటీ. మరో పక్క కమర్షియల్ సినిమాలకు కింగ్‌గా పేరు తెచ్చుకున్న అట్లీ కూడా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో ఏకంగా సైన్స్ ఫిక్షన్ నేపథ్యంతో ఓ విభిన్న చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఇందులో వీఎఫ్ఎక్స్, డిజిటల్ డీ ఏజింగ్ వంటి టెక్నికల్ ట్రీట్మెంట్స్ ప్రపంచ స్థాయిలో ఉండబోతున్నాయి. ఇప్పటివరకు అందరూ ఊహించనిది అనిపించేలా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇక బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న రామాయణం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్న రణబీర్ కపూర్, సాయి పల్లవిల లుక్స్ వైరల్ అవుతున్నాయి. భారీ బడ్జెట్, టాప్ టెక్నికల్ టీమ్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు భారతీయ మైత్రి సాంస్కృతిక ప్రతీకగా ఉండే అవకాశముంది.

ఈ నాలుగు సినిమాలు మాత్రమే కాదు.. మొత్తం ఇండియన్ సినిమా వేదికే ఇప్పుడు టెక్నికల్ గా, క్రియేటివ్ గా అద్భుతమైన ప్రయోగాలకు వేదికవుతోంది. దర్శకులు కథను ఎలా చెప్పాలి అన్నదానికే కాకుండా, ప్రేక్షకుడిని ప్రపంచంలో ఏ మూలలో ఉన్నా కనెక్ట్ చేసేవిధంగా సినిమాను తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. హీరోల కంటే దర్శకులే ఇప్పుడు నాంది పలుకుతున్న కాలం ఇది. మరి రాబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాలను అందుకుంటాయో చూడాలి.

## రష్మిక మందన్నా.. కల్ట్ రోల్‌లోకి జంప్ చేస్తుందా?

స్టార్ హీరోయిన్‌గా దక్షిణాది నుంచి బాలీవుడ్ దాకా తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న రష్మిక మందన్నా, ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో వార్తల్లో నిలుస్తోంది. 2012లో విడుదలైన కాక్‌టెయిల్ అనే హిందీ సినిమా, అప్పటి యువతలో కల్ట్ ఫాలోయింగ్ ను కలిగిన ఒక ప్రేమ కథ. దీన్ని దర్శకుడు హోమీ అదజానియా తెరకెక్కించగా, కథను ఇమ్తియాజ్ అలీ రాశారు. ఇప్పుడు అదే సినిమాకు సీక్వెల్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సీక్వెల్ కాక్‌టెయిల్ 2 పేరుతో రూపొందుతోంది. ఇందులో శాహిద్ కపూర్, కృతి సనన్ జంటగా నటించనున్నారని ఇప్పటికే సమాచారం బయటకు వచ్చింది. ఇప్పుడు ఈ క్యూట్ రొమాంటిక్ డ్రామాలో రెండో హీరోయిన్ పాత్ర కోసం రష్మిక మందన్నాను ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. లవ్ ట్రయాంగిల్ కాన్సెప్ట్‌తో, తరం మారిన ప్రేమకథగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమాకు లవ్ రంజన్ కథను అందిస్తుండగా, హోమీ అదజానియా దర్శకత్వం వహించనున్నాడు. నిర్మాతగా మ్యాడ్ డాక్ ఫిలింస్ అధినేత దినేష్ విజన్ ఉ



న్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం కాక్‌టెయిల్ 2ను 2026 మధ్యలో విడుదల చేయాలనే యోచనలో ఉన్నారు మేకర్స్. మ్యూజిక్, స్టోరీలైన్ విషయంలో దర్శకుడు హోమీకి మంచి నమ్మకముందని టాక్. అయితే, అసలు 2012లో వచ్చిన కాక్‌టెయిల్‌కు ఉన్న క్రేజ్‌ను ఇప్పుడు మళ్లీ రిపీట్ చేయగలరా అనే అనుమానం అభిమానుల్లో నెలకొంది. ప్రస్తుతం శాహిద్ కపూర్, విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ మిస్టరీ థ్రిల్లర్ సినిమా చేస్తున్నాడు. అది డిసెంబర్లో రిలీజ్ కానుంది. ఇదే సమయంలో రష్మిక మందన్నా కూడా కుబేర వంటి పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ హిందీ ప్రేమ కథలో ఓ డిఫరెంట్ షేడ్ ఉన్న పాత్ర చేయాలనే ఆసక్తి చూపుతోందని సమాచారం. ముఖ్యంగా దీపికా పదుకునే పాత్రలా, కాక్‌టెయిల్ 2లోని పాత్ర రష్మిక కెరీర్‌కు కొత్త మలుపు కావచ్చని అభిమానులు భావిస్తున్నారు. దీపికా పదుకునేకు అప్పట్లో కాక్‌టెయిల్‌లోని 'వెరోనికా' పాత్ర ఒక బ్రేక్‌థ్రూ అయింది. ఆమె నటన, స్టైల్, కేరెక్టర్ డెప్త్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అదే విధంగా ఈ సీక్వెల్‌లోని రెండో హీరోయిన్ పాత్రను రష్మిక చేస్తే, ఆమె హిందీలో తన పట్టు మరింతగా పెంచుకునే అవకాశముంది. ప్రస్తుతానికి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు, త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## షారూఖ్ తర్వాత నేనే అంటూ సెల్ఫ్ డబ్బా

ఊర్వశి రౌతేలా ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించడం కొత్తేమీ కాదు. తాజాగా మసాలా కవర్ పేజీపై ఊర్వశి తళుకుబెళుకులు వైరల్ గా మారాయి. ఇంతకుముందు వజ్రాలు పొదిగిన గడియారాన్ని ప్రదర్శించి అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ ఆ తర్వాత దబిడి దిబిడి పాటతోను చర్చల్లోకొచ్చింది. ఇప్పుడు మరోసారి ఊర్వశి పేరు మార్మోగుతోంది. ఈసారి షారుఖ్ ఖాన్‌తో తనను తాను పోల్చుకోవడంతో నెటిజనులు తమదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. తాజా ఇంటర్వ్యూలో ఊర్వశి మాట్లాడుతూ... కింగ్ ఖాన్ షారుఖ్ తర్వాత తనను తాను ఉత్తమ ప్రమోటర్ అని గర్వంగా ప్రకటించుకుంది. ప్రచారంలో తన అంకిత భావం గురించి సెల్ఫ్ డబ్బా కొట్టింది. అయితే ఊర్వశి ఉద్దేశాన్ని నెటిజనులు సరిగా అర్థం చేసుకోలేదు. ఊర్వశి వ్యాఖ్యానం సారాంశం ఇలా ఉంది. షారుఖ్ ఖాన్ తర్వాత, సినిమాలను ప్రమోట్ చేయడంలో ఊర్వశి రౌతేలా ఉత్తమ ప్రమోటర్ అని జనం అంటున్నారు. అందుకే రీచర్ సీజన్ 3 హాలీవుడ్ మేకర్స్ కూడా తమ షోను ప్రమోట్ చేయడానికి నన్ను సంప్రదించారు. కాబట్టి ప్రతి అవకాశం వెనుక ఒక కారణం ఉంది.



ఇది ప్రశంసించాల్సిన క్షణం. ప్రమోటర్లుగా మేం సినిమాను, కళాకారులను ప్రమోట్ చేయకపోతే, ఎవరు చేస్తారు? అంటూ ప్రశ్నించింది. అయితే ఈ అవకాశాన్ని వెంటనే రెడ్డిటర్లు వినియోగించుకున్నారు. ఊర్వశి సెల్ఫ్ డబ్బాను గట్టిగా క్యాచ్ చేసారు. ఆమె ఉద్దేశపూర్వకంగా ఇదంతా చెబుతోంది.. కేవలం ట్రోలింగ్ కోసం... తన గురించి చర్చ జరిగేలా చేయడానికి రెచ్చగొడుతోంది. ఏం చేస్తే ప్రమోషన్ కొట్టేయొచ్చు అనేది ఊర్వశికి కచ్చితంగా తెలుసు. ఆమె ప్రతిసారీ దారుణంగా ఏదైనా మాట్లాడితే అది తనకు మరింత ప్రచార మైలేజ్ ని ఇస్తుంది. ఇది ఆమె వ్యూహంలో భాగం అని ఒకరు విశ్లేషించారు. ఆలోచన భయంకరంగా ఉంది కానీ ఆమె భయంలో ఆత్మవిశ్వాసం ఉంది! అని ఇతర నెటిజన్ అన్నారు.

ఊర్వశి తదుపరి ప్రాజెక్ట్ ఏమిటి? అంటే... తదుపరి గోపిచంద్ మలినేని- సన్నీడియోల్ కాంబినేషన్ మూవీ జాత్ లో నటిస్తోంది. ఇందులో దిల్ తుజ్కో హి దుంగి పెహ్లా సారీ బోల్ అనే అద్భుతమైన డ్యాన్స్ నంబర్‌లో కనిపించనుంది. ఈ చిత్రంలో సన్నీ డియోల్, రణదీప్ హుడా, రెజీనా కాసాండ్రా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్ తదితరులు నటించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536